The Real Personality Development Magazine

# యుగశక్తి గాయత్రి

వ్యయ మార్గశిరం - జ్యేష్ఠ : డిసెంబరు 2006 రూ. 8-00



గీతోపదేశం

SUNDAR GRAPHICS : 9391030025



# మా ప్రచురణలు

## పండిత శ్రీరామశర్మ ఆచార్యజీ సాహిత్యం


## గ్రంథములు



జీవన సాధనకు
బంగారు సూత్రాలు



సద్గురు వచనామృతం



గాయత్రి
సమస్యలకు
ఒక విలక్షణ పరిష్కారం



సందేహాలు -
సమాధానాలు



స్త్రీల గాయత్రీ సాధన



గృహస్థ జీవనం
ఒక తపోవనం



నిత్యజీవితంలో
తులసి



ఏమి తినాలి ?
ఎలా తినాలి?

గాయత్రి చేతనా కేంద్రం మరియు ధ్యాన మందిరం, హైదరాబాదు

ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



# యుగశక్తి  గాయత్రి



ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ — సజల శ్రద్ధ


**సంకల్పం**
**సంరక్షణ**
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
**డాక్టర్ ప్రణవ్ పండ్యా**
సంపాదకులు
**కందర్ప రామచంద్ర రావు**

**సంపుటి 7 - సంచిక 8**
**డిసెంబరు 2006**
వ్యయ మార్గశిరం - జేష్ఠ
**విడిప్రతి రూ॥ 8.00**
**సం॥ చందా రూ॥ 85**
**3సం॥ చందా రూ॥ 250**
**10 సం॥ చందా రూ॥ 750**

సలహాలు, సూచనలకు:
**శ్రీ అశ్విని సుబ్బారావు -**
**09949411181**


## అసాధ్యంలో సాధ్యం

జీవితంలోని ప్రతిక్షణంలో వైరుధ్యాలే, సంక్షోభాలే, సంఘర్షణలే. ఇవన్నీ పెచ్చుపెరిగి పోతున్నాయి. వీటిని తొలగించడం అసాధ్యం అనిపిస్తోంది. జీవితంలోని ప్రతి స్థాయిలో, చివరికి మనిషిలోని కణ కణంలో, మహాభారత సంగ్రామం సాగుతోంది.

భగవద్గీత కురుక్షేత్రాన్ని ధర్మక్షేత్రంగా వర్ణించింది. ఎందుకంటే - ధర్మ-అధర్మములు, వెలుగు-చీకట్లు, ప్రేమ-ద్వేషముల నిర్ణయం ఇక్కడ జరుగుతుంది. మహాభారత యుద్ధంలో శ్రీకృష్ణుని నారయణీ సేన కౌరవుల పక్షాన ఉన్నది. ఒక్క శ్రీకృష్ణుడు మాత్రమే పాండవుల పక్షాన ఉన్నాడు. పైగా ఆయన పూర్తిగా నిరాయుధుడుగా ఉన్నాడు.

జీవితంలోనూ పరిస్థితి ఇదే. ప్రపంచంలోని శక్తులన్నీ నేడు అధర్మ పక్షాన, అంధకారం పక్షాన, ఉన్నాయి. ప్రపంచ శక్తులంటే పరమాత్ముని సేన, శ్రీకృష్ణుని నారాయణీ సేన మొత్తం. ఒక్క శ్రీకృష్ణుడు మాత్రమే మన పక్షాన ఉన్నాడు - నిరాయుధుడుగా. నిరాయుధుడైన పరమాత్మ పక్షం గెలవడం అసాధ్యం అనిపిస్తోంది.

శ్రీకృష్ణుడు అర్జునునికి మాత్రమే సారథి కాడు. మన జీవన రథంపై కూర్చున్న సారథికూడ శ్రీకృష్ణుడే. మనందరిలోపలా పరమాత్మయే రథం నడుపుతున్నాడు. కానీ, మన ఎదుట శత్రు పక్షంలో కానవస్తున్నవి - అపార సేనా వాహినులు, ఉపద్రవకరమైన వ్యూహ రచనలు, మాయోపాయాలు, కుట్రలు కుహకాలు, దారుణ మారణ సన్నాహాలు.

ఇలాంటి విపత్కర పరిస్థితులలో గాబరాపడడం సహజమే. అర్జునుడు కూడ గాబరాపడ్డాడు. మన కాళ్లూ చేతులూ కూడ వణకుతున్నాయి. ఏవిధంగా చూచినా, ఎలా లెక్కవేసినా, ఎన్ని తర్కాలు చేసినా - ఓటమి ఖాయమనీ, గెలుపు అసాధ్యమనీ అనిపిస్తోంది.

అయినా - కృష్ణ పరమాత్మ చెప్పిన '**మమేకం శరణం వ్రజ**' అనే స్వర లహరులను వినగలిగినవారికే, శ్రీకృష్ణునికి తమను తాము సమర్పించుకున్నవారికే, జీవితంలో చేసే ప్రతి కర్మనూ తమ హృదయాలలో నివసిస్తున్న పరమాత్మకు అర్పించినవారికే - అంతిమ విజయం లభిస్తుంది. వారి జీవితాలలో అసాధ్య మనిపించే ప్రతి పనీ సాధ్యం అవుతుంది.

★★★

**అదృష్టం ఒక తెల్లకాగితం. దానిమీద ఏది కావాలంటే అది వ్రాయవచ్చు.**

## సద్గురు వచనామృతం



### మరణం అంటే భయం ఎందుకు ?

మనిషి మరణం అంటే ఎంతగానో భయపడతాడు. మనిషి మరణానికి కాక, తన పాపాల దుష్ఫలితాలకు భయపడతాడని స్పష్టమవుతుంది. ఈ భయానికి కారణాన్ని వెదికినప్పుడు. కష్టంకాని, ఆపద కాని ఉన్న స్థలానికి వెళ్ళవలసివస్తే – మనిషి ఎంతో భయపడతాడు, ఎంతో వ్యాకులత చెందుతాడు. ఇది మనకు తెలిసిన విషయమే. 'ఈ జీవితాన్ని నేను దుర్వినియోగం చేశాను; ఫలితంగా చనిపోయిన తర్వాత నేను దుర్గతి పొందవలసి ఉంటుంది' – అని మనిషిలోని ఆంతరిక చేతన అనుభూతి పొందుతుంది. కనుక మనిషి చావుకు భయపడతాడు. ఒక వ్యక్తి ప్రస్తుత పరిస్థితికన్న ఉత్తమమూ, ఉన్నతమూ, సుఖదాయకమూ అయిన పరిస్థితిలోకి వెళ్లేటప్పుడు అతడికి ఏమాత్రం కష్టం కలుగదు. పైగా అతడు సంతోషిస్తాడు. మేక కసాయివాడి గుమ్మంలోకి వెళుతూ రానున్న బాధను ఊహించుకుని భయపడుతుంది. అలాగే – తమ జీవితాలను నిరర్థకములూ, అనుచితములూ, నిరుపయోగములూ అయిన పనులలో వెచ్చించే వ్యక్తులు చావుకు భయపడతారు.

మృత్యు భయం నుండి కాపాడుకోవాలని అనుకుంటే – మీరు మీ జీవితాన్ని సద్వినియోగం చేసుకోండి; మీ కార్యక్రమాలను ధర్మమయం చేసుకోవడం ప్రారంభించండి. అలా చేస్తే – భవిష్యత్తు చిమ్మచీకటి కాదనీ, వెలుగుల వెల్లువ అనీ మీ ఆంతరిక చేతనకు నమ్మకం కలుగుతుంది. ఈ నమ్మకం హృదయంలో ఏర్పడిన క్షణంలో మరణ భయం పారిపోతుంది. ఈ శరీరపు మార్పును బట్టలు మార్చుకోవడంవలె ఒక మామూలు విషయంగా అప్పుడు మీరు భావిస్తారు; మీరు దాన్ని గురించి ఏమాత్రం భయపడరు, ఏమాత్రం గాబరాపడరు.

★★★

## విషయ సూచిక

ముఖచిత్రం : గీతోపదేశం


| | | |
|---|---|---|
| 1. | సంపాదకీయం : | 1 |
| 2. | సద్గురు వచనామృతం | |
| | విషయ సూచిక | 2 |
| 3. | వేద మంత్రం | 3 |
| 4. | గీతా మకరంద మాధుర్యం | 4 |
| 5. | నిరాడంబరతకు నమూనా | 9 |
| 6. | ఆంతరిక సంస్కరణలోనే జీవన సాఫల్యం | 11 |
| 7. | మూర్తీభవించిన దేవసంస్కృతి మహామనా మాలవ్యా | 12 |
| 8. | పౌరాణిక గాథలలోని యోగశాస్త్ర రహస్యాలు | 16 |
| 9. | భక్తి, జ్ఞానం పరస్పర పూరకాలు | 17 |
| 10. | సృజనాత్మకత, ఆధ్యాత్మికత | 21 |
| 11. | ఆది గురువు మహిళ | 23 |
| 12. | తాత్త్విక చికిత్సకు మూలసూత్రాలు | 27 |
| 13. | నిశ్శబ్దసేనకు నిలువెత్తు రూపం గోస్వామి గణేశదత్తు | 28 |
| 14. | అహంకారం కాదు – స్వాభిమానం | 30 |
| 15. | సప్త ముద్రలు | 31 |
| 16. | భుసావల్ గాయత్రీ యజ్ఞంలో అద్భుతం | 33 |
| 17. | నిర్భయత్వానికి రాచబాట ఆత్మజ్ఞానం | 35 |
| 18. | వానప్రస్థంలో జ్ఞాన, భక్తి, కర్మ యోగాలు | 40 |
| 19. | ఆశీస్సులూ, వాగ్దానాలూ | 43 |
| 20. | వార్తలు | 47 |
| 21. | సద్గురు లీలామృతం | 48 |


### డిసెంబర్ 06, జనవరి 07 నెలలలో పర్వదినాలు

**డిసెంబర్ :**

1. గీతా జయంతి
2. దత్తాత్రేయ జయంతి
25. క్రిస్మస్
    మదనమోహన మాలవ్యా జయంతి
30. వైకుంఠ ఏకాదశి

**జనవరి – 07 :**

12. వివేకానంద జయంతి
26. గణతంత్ర దినోత్సవం

**బుద్ధికుశలుడిని మనిషి అని పిలుస్తాం; దయామయుడిని దేవుడని పిలుస్తాం.**

# వేద మంత్రం

## దేన్ని పొందాలన్నా - తపస్సు తప్పనిసరి

**పవిత్రం తే వితతం బ్రాహణస్పతే ప్రభుర్గాత్రాణి పర్యేషి విశ్వతః ।**
**అతప్త తనూర్న తదామో అశ్నుతే శ్రతాస ఇద్వహన్తః సం తదాశత ॥**-(ఋగ్వేదం 9/83/1, సామవేదం 535)

**భావార్థం** : ఈ ప్రపంచం శుభకరము, మంగళదాయకము, మధురము అయిన పదార్థాలతో నిండి ఉన్నది. తపస్సుతో వాటి మూల్యమును చెల్లించ సిద్ధపడిన వారికే అవి లభిస్తాయి. వివేకపూర్ణ తపస్సుతో విద్య, ధనము మొదలైనవి ప్రాప్తిస్తాయి.

**సందేశం** : సృష్టి రచనలో పరమేశ్వరుడు చూపించిన కౌశలంలో వెయ్యవ లక్షవ వంతు కూడా మనం ఊహించలేము. 64 లక్షల జీవరాశులకు అన్ని విధాలైన పదార్థాలు ఈ ప్రపంచంలో రాశులుగా పడి ఉన్నాయి. వనస్పతులు, ఓషధులు, ధాన్యం, రత్నాలు, ముత్యాలు అన్నీ ఉన్నాయి. ఇవన్నీ ప్రాణికోటికి శుభం, మాధుర్యం కలిగిస్తాయి.

ఏ విధంగా ఈశ్వరుడు సర్వత్రా వ్యాపించి ఉన్నాడో, అదే విధంగా ఆయన ప్రకాశం నలువైపులా వ్యాపించి ఉన్నది. ఆయన జ్యోతి సూర్య చంద్రులను ప్రకాశింప చేస్తున్నది. ప్రభువు యొక్క శక్తి తన పూర్తి సామర్థ్యంతో ప్రతి జీవి కణ కణంలో వ్యాపించి ఉన్నది. అయినా ఆయన కృప తనంతట తాను లభించదు. నలువైపులా మంగళకర పదార్థాలు నిండిఉన్నా, మనుష్యుడు లేమితో కన్పిస్తున్నాడు. పరమాత్మ కృప అనే ఆనంద రసాన్నుండి వంచితుడై ఉన్నాడు – నీటిలో ఉండి దప్పికతో ఉన్నవానివలె. దీనికి కారణం అతడు తపస్సు ద్వారా తన పాత్రతను వికసింపచేసుకొనకపోవడం. అతని మనస్సు దోష దుర్గుణాలతో నిండి ఉన్నది. నలువైపుల నుండి కషాయం – కల్మషం అతన్ని చుట్టుముట్టి ఉన్నాయి. అజ్ఞాన అంధకారం వలన కూపస్థ మండూకం వలె సంకుచిత పరిధి నుండి బయటకు చూడగల్గిన సామర్థ్యము అతనికి లేదు. అతనికి ఉత్సాహం లేదు. బ్రహ్మచర్యం, వ్యాయామం, ఆసన ప్రాణాయామాలు, సంయమం, యోగం, మనోయోగం ఏకాగ్రతలలో మనసు నిలువదు. అతడు ప్రతినిమిషమూ ఇంద్రియలోలత్వం అనే వలలో చిక్కుకుంటున్నాడు.

జీవితంలో ఏది పొందాలనుకున్నా, తపస్సు తప్పనిసరి. అకారణంగా తన శరీరాన్ని కష్టపెట్టి శుష్కింపచేయుట తపస్సు కాదు. జీవన మార్గంలో వచ్చే కష్టాలకు చలించకుండా తన పూర్తి సామర్థ్యంతో, ప్రతిభతో వాటిని అధిగమించుటయే తపస్సు. ఈ నిమిత్తం చేసే పురుషార్థమే తపస్సు. కఠిన పరిశ్రమ చేసేవారికే పరమాత్మ సహాయం చేస్తాడు. అతనికే అన్ని విధాలైన ధన ధాన్యాల వరదానం ఇస్తాడు.

తపస్సు ద్వారా విద్య, ధనాలను పొందాలన్నది వేదాల నిర్దేశం. తపస్సుకు దృఢమైన ఆత్మబలం కావాలి. దీనితో మనుష్యుడు సంయమంతో ఇంద్రియాల ప్రలోభాన్నుండి తనను తాను రక్షించుకొని, ఏకాగ్రతతో సత్యమార్గంలో నడువగల్గుతాడు. ఇంద్రియాల ప్రలోభం కంటే ధనం గురించి లాలస ఎక్కువ ఉంటుంది. మనుష్యుడు ఏదోవిధంగా ఎక్కువ డబ్బు సంపాదించాలనుకుంటాడు. అందుకు నీతి–అవినీతులను, ఉచితానుచితాలను ఏమాత్రం పట్టించుకోడు. తపస్సు ద్వారా మనస్సును పవిత్రం చేసుకొని ఈశ్వరీయ జ్ఞానాన్ని పొందితే, అతడు వివేక పూర్వకంగా చరిస్తాడు. నిజాయితీగా ధనం సంపాదించేందుకు పురుషార్థం చేస్తాడు.

నిజాయితీకి ప్రచండ ఇచ్ఛాశక్తి అవసరం. అదే మనలను జీవన సాఫల్య మార్గంలో నడిపించే శక్తి కలిగి ఉంటుంది.


★★★

**దుష్ట భావనలను మనసులో దూర్చినవాడికి శాంతి ఉండదు.**

# ముఖచిత్ర కథనం

# గీతా మకరంద మాధుర్యం

గీత ప్రత్యక్ష భగవత్స్వరూపము. గీతాసేవ సాక్షాత్ శ్రీహరి సేవయే యగును. గీతాపఠనము భగవంతుని జపమే యగును. గీతాశ్లోకము నారాయణుని దివ్యమంత్రమే యగును. చక్కెరతో చేయబడిన చిలుక ఎక్కడ కొరికినను తీపిగనే యుండునట్లు, గీతలోని ఏ భాగమైనను బ్రహ్మానంద మాధుర్యముచే తులతూగుచుండును. గీత ధర్మమయము. 'ధర్మ' వృక్షము గీతాఫలము ఫలించినదనుటలో నతిశయోక్తి ఏ మాత్రమున్ను లేదు. గీతలో నిట్టి అద్భుతశక్తి యిమిడియుండుటలో హేతువేమి? దానిని బోధించినవాడు షోడశకళాపరిపూర్ణుడగు అవతారపురుషుడే అయియుండుట యగును. ప్రపంచములో గల గొప్పగొప్ప మతములకు సంబంధించిన ప్రవక్తలలో కొందరు 'నేను దేవుని కుమారుడను' అని చెప్పియుండిరి. మఱికొందరు 'నేను దేవుని దూతను' అని పలికియుండిరి. ఇంక కొందరు 'నేను దేవుని భృత్యుడను' అని వాక్రుచ్చియుండిరి. కాని గీతాప్రవక్త 'నేను దేవుడనే' అని చెప్పివేసెను. కావున ఇది 'సాక్షాత్ దైవవాణి'; కనుకనే ఇంత ప్రచండ ఆధ్యాత్మికశక్తిచే సంపన్నమై యలరారుచున్నది. అర్జునుని హిమగిరి సదృశమోహము (అజ్ఞానము) గీత దాదాపు సగము బోధ పూర్తియగునప్పటికే పూర్తిగ తొలగిపోవుట అతి విచిత్రమైన విషయము. గీతయొక్క అలౌకిక సామర్థ్యమును ఋజువుచేయుటకు ఇంతకుమించిన వేఱొక సన్నివేశ మేమి కావలయును?



గీ – గానము చేయువారిని, త – తరింపజేయునది గీత. కల్పవృక్షమువలె తన్నాశ్రయించువారిని అది రక్షించును. అసహాయుల కది సహాయము; గ్రుడ్డివారికి కన్ను; కుంటివారికి కాలు; దుర్బలులకు బలము; విషయదావాగ్నికి వర్షము; అజ్ఞానిని జ్ఞానిగ, పిరికివానిని సింహముగ, మరణించువానిని అమరునిగ అయ్యది తృటిలో నొనర్పగలదు. భవరోగమున కది రామబాణ దివ్యౌషధము. మానవ సమాజమునకు సర్వోత్తమ సంపద. ప్రతివారిని చేయిపట్టుకొని మెల్లమెల్లగ పైకిలేపి, ఒక్కొక్క మెట్టు ఊర్ధ్వముగ కొనిపోవును. వారివారి లోపములను సవరించుచు, వారివారి యంతఃకరణమున నిగూఢమైయున్న ఆత్మతేజమును బహిర్గత మొనర్చుచు, నిద్రితమైయున్న శక్తిని జాగృతము చేయుచు క్రమక్రమముగ కైవల్యరూప పరంధామమున వారిని జేర్చివైచుచున్నది.

కర్మ, భక్తి జ్ఞానములను మూడు ప్రవాహములు కలియు త్రివేణీ పుణ్యతీర్థము గీత. అట్టి త్రివేణియందు స్నానమాడువారు ధన్యులు. కర్మ, భక్తి, ధ్యానము, జ్ఞానము అను నీ నాల్గున్ను వేఱువేఱుగ విడదీయుటకు వీలుకాని వస్తువులు. ఒకదానితో మఱియొకటి కలిసిమెలసి సన్నిహిత సంబంధం ఏర్పరచుకొనియున్నవి. ఒకానొకనియందు సంస్కారవశాత్తు ఒకటి ప్రధానముగా గన్పించినను, తక్కినవి గౌణముగ ఉండియేయుండును. ఈ రహస్యము తెలియనివారే వారివారి మార్గము సవ్యమైనదని కలహించుకొనుచుందురు. గీత అన్నిటిని సమన్వయపఱచినది. ఎవరితోను పేచీలేకుండ చేసికొనినది. అహంకార రాహిత్యమే, స్వార్థత్యాగమే అన్ని మార్గములయొక్క ప్రధాన లక్ష్యమని బోధించినది.


గీతకు అనేక వ్యాఖ్యలున్నప్పటికిన్ని, అన్నిటికంటె గొప్ప వ్యాఖ్య శ్రీకృష్ణుని జీవితమే అయియున్నది. కర్మ, భక్తి, ధ్యాన, జ్ఞానములన్నిటికిని శ్రీకృష్ణుని జీవితమున సముచిత స్థానములు లభించినవి. అతనిది ఆదర్శ జీవితము. ఆత దననుసరించినది అనుష్ఠాన వేదాంతము. ఆతని జీవితము మూర్తీభవించిన

**ఉత్కృష్ట చింతన, ఆదర్శ కర్తృత్వం అనే విధానమే నిజమైన అధ్యాత్మ సాధన.**

గీతాప్రబోధము. ఎట్లనిన- చక్కని నిష్కామకర్మను శ్రీకృష్ణుడు ఆచరించిచూపెను. గీతాజ్ఞానము నాశ్రయించి మూడు లోకములను నిర్లేపముగ పాలింపదొడగెను. అనవరతకర్మయందు నిరతిశయశాంతిని బడయుట ఆతని జీవితమందలి ఒకానొక విశేషము.

గీతయందలి ప్రధానమైన బోధలలో నిదియొకటి. ఇక రెండవది భక్తి. తన గురువగు సాందీపమహర్షి యెడల, తక్కిన పెద్దలయెడల శ్రీకృష్ణుడు ఎంతయో భక్తిని ప్రదర్శించెను. ధర్మరాజొనరించిన రాజసూయ యాగమున భక్తుల పాదములను కడిగి వినయమును, నిగర్వమును జూపెను. ఇక యోగవిషయ మాలోచించెదమాయనిన, స్వయముగ నాతడు 'యోగేశ్వరుడే' అయియున్నాడు. జ్ఞానవిషయము చూతమా యనిన, పోతపోసిన జ్ఞానవిగ్రహమే యాతడు. ఏనాడో సూర్యునకు యోగమును, జ్ఞానమును బోధించిన దిట్ట. ఈ ప్రకారముగ కర్మ, భక్తి, యోగ, జ్ఞానములను గీతాధర్మముల సంపుటరూపమే శ్రీకృష్ణపరమాత్మ. శ్రీకృష్ణుడేవిధముగ తన జీవితమును గీతామయముగ నొనర్చుకొనెనో, అట్లే ప్రతివ్యక్తియు తన నిత్యజీవితమును గీతకు అనురూపముగ నిర్మాణ మొనర్చుకొని తనమాంసమయ విగ్రహమును మంత్రమయముగ, సచ్చిదానంద దివ్యతేజో పరిపూర్ణముగ గావించుకొనవలెను. ఇదియే జీవిత లక్ష్యము, గీత ప్రబోధ సారము.

గీతయందలి మఱియొక విశేషము గీతాబోధను గ్రహించవలసినదిగా ఒరులను బలాత్కారము చేయకుండుటయే. గీతయందలి ధర్మబోధయంతయు సమాప్తమైన వెనుక శ్రీకృష్ణుడు అర్జునునితో



**విమృశ్యైతదశేషేణ యథేచ్ఛసి తథా కురు**

-(18-63)

'నేను చెప్పిన ఈ గీతాశాస్త్రమునంతను నీవు బాగుగ పర్యాలోచించుకొని తదుపరి నీకెట్లిష్టమో అట్లాచరింపుము.' అని పలుకుటయే ఇందులకు తార్కాణము. 'చెప్పవలసిన ధర్మములను నేను చెప్పితిని. ఇది గొయ్యి, ఇది మెరక, ఇది అమృతము, ఇది విషము, ఇది శ్రేయము, ఇది ప్రేయము, ఇది బంధము, ఇది మోక్షము, ఇది పుణ్యము, ఇది పాపము- అని యీ ప్రకారముగ స్పష్టముగ నిరూపించి చూపితిని- ఇక, నీ కేది యిష్టమో దానినే సంపాదించుకొనవచ్చును-' అని భగవానుడు కరుణతో వచించెను. మహానుభావులు ఇతరులకు ధర్మమును బోధింతురేకాని కర్తృత్వమును ఎన్నడును వహింపరు. తెలివిగలిగిన శిష్యులు గురువుయొక్క ఇంగితమును గ్రహించినవారై వారు బోధించు ధర్మమును మనసార స్వీకరింతురే కాని త్యజింపరు. అర్జునుడట్లే చేసెను. ఫలితముగ ఆతని అజ్ఞానము తృటిలో మాయమైపోయెను.

ఇక గీతయందలి భావము లన్నిటిని క్రోడీకరించి సంక్షేపముగ నాలుగు వాక్యముల నిచట చెప్పదలచినాను - ప్రతిజీవియు ఘనీభవించిన ఆత్మస్వరూపమేకాని దేహము కాదు. కాని చిత్తశుద్ధిలేని కారణముచే మనుజునకట్టి అపరోక్ష జ్ఞానము కలుగుటలేదు. కాబట్టి చిత్తశుద్ధికొరకై నిష్కామకర్మాచరణము తప్పక చేయవలసియున్నది. ఈశ్వరార్పణబుద్ధితో, కర్తృత్వరహితముగ, నిష్కామముగ కర్మల నాచరించుచు వచ్చినచో కొలదికాలములో చిత్తము నిర్మలత్వమును బొందగలదు. మలినరహితమగు అద్దమునందు సూర్య ప్రతిబింబము చక్కగ గోచరించునట్లును,

**ఆత్మ నియంత్రణ లేనిదే జీవితం సఫలం కాదు.**

మురికిలేని వస్త్రమునకు రంగు బాగుగ అంటునట్లున్ను, నిర్మల చిత్తమునందు ఆత్మజ్ఞానము లెస్సగ అనుభూతమగును. కావుననే గీతయందు హృదయ నిర్మలత్వమునకు, చిత్తశుద్ధికి వలసిన సాధనోపాయములు లెక్కలేనన్ని వచింపబడినవి. మఱియు మాయాంతర్గతుడగు జీవుడు స్వయముగ మాయను దాటగల్గుట బహుదుస్తరము కనుక, మాయాతీతుడగు పరమేశ్వరుని అండదండలను ఆశ్రయించవలసియున్నది. కనుక భక్తియు చాల ఆశ్యకమేయగును. నిర్మలభక్తితో గూడి భగవానుని నామ సంకీర్తనము, జప, పూజా, ప్రార్థనాదులు సలుపుచుండవలెను.

**యే భజన్తి తు మాం భక్త్యా మయితే తేషు చాప్యహమ్**

-(9-29)

అని భగవానుడు తెలిపినట్లు ఎవరెవరు భక్తితో సర్వేశ్వరుని ఆరాధించుదురో వారి వారిని ఆతడు అనుగ్రహించుచుండును. అట్టి యనుగ్రహముచే సాధకుని యందు 'బుద్ధి యోగమ'ను అపూర్వవస్తువు వచ్చి చేరుచుండును (దదామి బుద్ధియోగం). దానినే ఆత్మజ్ఞానమందురు. అది కలిగినపుడు మోక్ష మిక దరిదాపులో నుండును. ఇవ్విధముగ పుణ్యకార్యాచరణము, నిష్కామకర్మము, అచంచలభక్తి మున్నగునవి క్రమముగ జీవునకు జ్ఞానోత్పాదనమందు మిక్కుటముగ సహాయపడుచున్నవి. అయితే ఇంటిలో దీపము వెలిగినను, కిటికీలగుండా గాలివీచినచో అది ఆరిపోవునట్లు, ఇంద్రియద్వారములగుండా విషయసంకల్పములు లోనికి ప్రవేశించినచో కష్టపడి వెలిగించుకొనిన ఆ జ్ఞానదీపము ఆరిపోవును. కాబట్టి ఇంద్రియనిగ్రహము విషయవిరక్తి మొదటినుండియు అభ్యసించుచు రావలెను.



**తస్మాత్త్వమిన్ద్రియాణ్యాదౌ నియమ్య భరతర్షభ**

- (3-41)

అని భగవానుడు ఇంద్రియ నిగ్రహమును గూర్చి అచటచట నొక్కి చెప్పుచు పోయెను. ఇచట 'ఆదౌ' (మొట్ట మొదట) అను పదమును ప్రయోగించినందువలన ఇక్కార్యము ఎప్పుడో చేయవలసినదికాదు, సాధన ప్రారంభములోనే దీనినిగూర్చి యోచించవలెనని గీతాచార్యుడు హెచ్చరిక చేయుచున్నాడు. ఈ ప్రకారముగ ఇంద్రియములను చిత్తవృత్తులను నిరోధించుటయే రాజయోగమని చెప్పబడును. ఇవ్విధముగ నిష్కామ కర్మ, భక్తి, రాజయోగములచే చిత్తమునందలి భయంకర దోషములను మల, విక్షేపములను పోగొట్టుకొని నెమ్మదిగ ఆత్మవిచారణయందు ప్రవేశింపవలెను. 'నే నెవరు?' అను ప్రశ్న వేసికొని పంచకోశములను ధీశక్తిచే వేరుచేసి, తద్వ్యతిరిక్తముగ హృదయముననే భాసించు సర్వసాక్షియైన, స్వయంజ్యోతి స్వరూపమును (క్షేత్రజ్ఞుని) లెస్సగ అనుభూతమొనర్చుకొనవలెను. అపుడు చిత్తమందలి మూడవ దోషమగు 'ఆవరణము' పటాపంచలైపోవును. అత్తఱి జీవుడు 'తేషామాదిత్యవజ్ఞానం' అనునట్లు మేఘము తొలగిన సూర్యునివలె నిరావరణముగ, స్వచ్ఛముగ ఆత్మతేజోవిరాజితుడై యొప్పును. అదియే మోక్షము. అట్టిస్థితిని బడయుటయే జీవుని లక్ష్యము. దానిని ఈ దేహమున్నపుడే సాధించివేసి కృతార్థుడు కావలయును. గీతాసారమిదియే.

గీతను పఠించుటకు కాలనియమ మేమియు లేదు. అయితే సామాన్యముగ ఉదయమున స్నానముచేసి శుచిర్భూతుడై, గృహమునగాని, తీర్థస్థానమందుగాని పవిత్రస్థలమున గూర్చుండి గీతాపారాయణము చేయు ఆచారము కలదు. అట్లే తక్కిన సమయములందుగూడ పారాయణము చేయవచ్చును. కాని అభ్యంతరశుద్ధితోబాటు బాహ్యశుద్ధినికూడ గమనించుచుండవలెను. 'శుచౌ దేశే' అని గీతయందు చెప్పబడి యుండుటచే సాధనచేయు చోటు, జపించు స్థలము పరిశుద్ధముగా నుండవలెనని స్పష్టమగుచున్నది. ప్రతిదినము ఒక అధ్యాయమును పారాయణ చేయవచ్చును. సమయమున్నచో ఇంకను అధికముగ

**కోపగించడం పిచ్చిపని. దానివల్ల సత్‌సంస్కారాలు నాశనం అవుతాయి.**

చేయవచ్చును. పారాయణము పూర్తి అయిన వెనుక మాహాత్మ్యమందలి ఒకటి రెండు శ్లోకములను తప్పక చదువవలెను.

మఱియు పారాయణానంతరము గీతను అర్థముతోసహా ఒకింత పఠించుటకు బాగుగా అభ్యసించుచురావలెను. ఏలననిన, పారాయణమువలన పుణ్యము లభించినను, శ్లోకార్థమును బాగుగ మననము చేసినపుడు మాత్రమే చిత్తమందలి మలిన వాసనలు నశించి మోక్షమునకు దారి ఏర్పడును. అర్థము సందిగ్ధముగ నున్నపుడు శ్లోకము యొక్క పూర్వపరములను సమన్వయపఱచుకొనుచు పోవలెను.

ఈ ప్రకారముగ ప్రతిదినము గీతాభ్యాస మొనర్చుచు చిత్తమును నిర్మలము చేసికొని భగవదనుగ్రహమునకు పాత్రులై జన్మపావనము గావించుకొనవలెను. ముఖ్యముగ పాశ్చాత్య నాగరికతా వ్యామోహము జనులను వెంటాడుచున్న ఈ కాలమున గీతాప్రబోధముయొక్క ఆవశ్యకత ఎంతేని కలదు. ప్రాపంచిక భోగములే శరణ్యములని తలంచు అవివేకులకు గీత చక్కని గుణపాఠము చెప్పి వాస్తవ సుఖమెచట నున్నదో చూపుచున్నది. అల్పసుఖములకు అఱ్ఱులు చాచక నిరతిశయానందమును వెతకుకొనుడీయని ప్రేమతో బలుకుచున్నది. కావున గీతామాతయొక్క వాత్సల్యపూరిత దివ్యవచనములను శ్రద్ధతో నాలకించి, అనుష్ఠించి ఆత్మసామ్రాజ్యాభిషిక్తులగుదురుగాక!

అయితే గీతను పఠించుటకు తగిన విద్యావైదుష్యము లేనివారు, చదువు బొత్తిగా రానివారు ఎట్లు తరింపగలరను శంక కొందఱికి ఉదయించవచ్చును. అట్టి వారినిగూర్చి శ్రీకృష్ణపరమాత్మ గీతయందే ఒకటిరెండు చోట్ల ప్రస్తావించి వారున్ను తరించుటకు అవకాశము కలదని కరుణతో పలికెను–

**అన్యేత్వేవమజానన్తః శ్రుత్వాఽన్యేభ్య ఉపాసతే**
**తేఽపి చాతితరన్త్యేవ మృత్యుం శ్రుతిపరాయణాః.**

– (13–26)

పెద్దపెద్ద యోగములను గూర్చిన పరిచయము లేకున్నను, ఇతరుల వలన ఆ యా బోధలను విని, శ్రద్ధతో ఆచరించి వారున్ను జననమరణరూపమగు ఈ సంసార బంధమును దాటి వేయుచున్నారని భగవానుడు చెప్పెను. విద్యయుండుటయే శ్రేష్ఠము. ఒకవేళ లేనిచో ఇతరులవలన ఆధ్యాత్మిక విజ్ఞానమును శ్రవణము చేయుటద్వారా సంసార తారణము క్రమముగ చేకూరగలదని భావము. ఏలయనిన శ్రవణానంతరము మననము, మననానంతరము నిదిధ్యాసము గావించి మనుజుడు మెల్లమెల్లగ లక్ష్యమును సాధించి వేయగలడు. కాని పట్టుదల, శ్రద్ధ మాత్రము తప్పక యుండవలెను. ఈ విషయమునే గీతాంతమున శ్రీకృష్ణమూర్తి ప్రస్తావించుచు శ్రద్ధతోగూడి, అసూయారహితుడై ఎవడు గీతను శ్రవణము చేయునో అట్టివాడున్ను పాపవిముక్తుడై పుణ్యవంతుల ఉత్తమ లోకములను బడయగలడని స్పష్టముగా చెప్పివేసెను. కావున గీత చదువలేనివారు దిగులుతో కూర్చొనక గీతాబోధ జరుగుచోటికి వెళ్ళి శ్రవణముచేసి ఆచరించి తరించవచ్చును. అయితే వీలుదొరికినచో స్వయముగ పఠింపగల్గుశక్తిని సంపాదించుటయే సర్వోత్తమము. గీతను పఠించుటకొఱకైనను సంస్కృతమును నేర్చుకొనుడు అని గాంధీమహాత్ముడొకసారి జనుల కుద్బోధించియుండుటను ఈ సందర్భమున జ్ఞాపకమునకు తెచ్చుకొనవలయును.

గీత సమాప్తమైనది. శ్రీకృష్ణుడు దివ్యౌషధమును ప్రయోగించుట పూర్తిచేసెను. అర్జునుని వ్యాధి తక్షణమే ఉపశమించెను. అయినను వైద్యునకొక కర్తవ్యము ఇంకను మిగిలియున్నది. 'నీ పరిస్థితి యెట్లున్నది?' అని రోగిని విచారించుటయే ఆ కర్తవ్యము. భిషగ్వర్యుడగు శ్రీకృష్ణుడిట్టి విచారణ గావింప, 'నష్టో మోహః' అని వెనువెంటనే రోగినుండి ప్రత్యుత్తరము వచ్చివేసెను. 'మహాత్మా! నా అజ్ఞానము శమించినది. దీర్ఘసంసారవ్యాధి తుదముట్టినది. ధన్యోఽస్మి, ఇదియంతయు నీ యనుగ్రహఫలమే' అని అర్జునుడు ఉత్సాహపూర్వకముగ పలికెను. వైద్యుని గీతారూప ఔషధముయొక్క ప్రథమ ప్రయోగము (అర్జునునిపై) సఫలమైనది. వెనువెంటనే సంజయుడున్ను ఆ ఔషధమును త్రాగి "హృష్యామిచ పునః పునః హృష్యామిచ ముహుర్ముహుః" అని ఆనందముతో చిందులు త్రొక్కసాగెను. బ్రహ్మజ్ఞానము యొక్క సద్యఃఫలములైన శోక రాహిత్యము,

**దుబారా చేయడం అంటే ఆత్మను అమ్ముకోవడం.**

అతిహర్షము అను రెండును అర్జుననకువలె సంజయునకును సంప్రాప్తించినవి. కాబట్టి వైద్యునియొక్క గీతారూపమగు ఔషధముయొక్క ద్వితీయ ప్రయోగమున్ను (సంజయునిపై) సఫలమైనది. ఇట్లు గీతాశ్రవణముచే వెంటవెంటనే ఒకరి తరువాత నొకరు అర్జునుడు, సంజయుడు తరించిపోవ ఇక తక్కినవారి విషయమై ఏల సందేహింపవలెను? వారున్ను తప్పక తరించిపోగలరు.

ఈ ప్రకారముగ గీత ఒక్క అర్జుననకేకాక, సంజయునకేకాక, తక్కిన ప్రాణి కోట్లందఱికిని గూడ శాంతిభిక్ష నొసంగుచున్నది. గీతాకల్పవృక్షము శాఖోపశాఖలుగ విస్తరించి చక్కని నీడనొసంగుచుండ, ఫలములను ప్రసాదించుచుండ సంసార మార్గమున అనాదికాలమునుండి పరిభ్రమించుచు భీషణతాపత్రయములచే వ్యథనొందు జీవుడు దాని క్రిందకు బోయి సేదతీర్చుకొని మోక్ష ఫలములు భుజించి ఏల సుఖముగ నుండరాదు? పవిత్ర **గీతామకరందమును** త్రావి ఏల పరమానంద మనుభవించరాదు? గీతాధ్యయనమను ఉత్తమ జ్ఞానయజ్ఞ మాచరించి నిర్వాణసుఖము నేల బడయరాదు? సర్వేశ్వరుని కృపచేతను, పరమకారుణికులగు మహర్షుల కృపచేతను జనులలో గీతాసక్తి పెంపొంది ఆధ్యాత్మిక విద్యాపరిచయము లెస్సగ కలుగుగాక! గీతాతత్త్వసమాశ్రయణముచే జనుల భవబంధములు విచ్ఛిన్నములైపోవుగాక! గీతారూపపరమార్థపీయూషవర్షధారలచే ప్రజల హృదయక్షేత్రములు సస్యశ్యామలములై యలరారుచు నిర్వాణమను చక్కని పంటను పండించుగాక! గీతాశంఖారావము దశదిశలు మార్మోగి జనులను అజ్ఞాననిద్రనుండి మేలుకొలుపుగాక! గీతాగంగా స్రవంతియందు తనివితీర స్నానమాచరించి సంసారమాలిన్యమును వదలగొట్టుకొని ప్రాణికోట్లు నిరతిశయసుఖ మనుభవింతురుగాక! భగవత్కృపవలన గీతాతత్త్వానుభూతిచే జనులు తమ హార్దికతమఃపటలములు సంఛిన్న మొనర్చుకొని బ్రహ్మానందవారాశియందు నిమగ్నులై జీవితములను ధన్యము గావించుకొందురుగాక ! ! !

– శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామి
("గీతామకరందం" నుండి)

★★★

## సరియైన దృక్పథం

1970లో నాగపూర్‌లో రాష్ట్రీయ స్వయంసేవక సంఘ సమావేశం జరుగుతోంది. ప్రచారకులు, ప్రముఖ కార్యకర్తలు అందులో పాల్గొన్నారు. కార్యకర్తలు తమ నివేదికను ఇస్తున్నారు. ఒక కార్యకర్త తన క్షేత్రాన్ని గురించి సమాచారం ఇస్తున్నాడు. ఆ క్షేత్రంలో పని చాలా తక్కువగా ఉంది. శ్రీ గురూజీ ఆ కార్యకర్తను అడిగారు–అక్కడి సంఘ కార్యం ఇలా ఎందుకుంది? పని పెరగకపోవటానికి కారణాలు ఏమిటి?

ప్రచారక్ జవాబిచ్చాడు– 'ఏమిచేయగలం ? అక్కడ సమాజం నిర్జీవంగా ఉంది. ఉత్సాహంగా లేదు.'

ఇది వినగానే గురూజీ గంభీరులైనారు. ఒక్క నిమిషం మౌనం వహించి తరువాత కఠినంగా ఇలా అన్నారు– 'ఇక నీవు పని ఏమి చేస్తావు? సమావేశంలో నిశ్శబ్దం తాండవిస్తోంది. కొంచెంసేపు ఊరకుండి శ్రీ గురూజీ ఇలా వివరించారు– 'సమాజం పట్ల ఇలాంటి దృష్టి పెట్టుకొని పనిచేస్తే విజయం ఎలా లభిస్తుంది? సమాజం పట్ల మనం ఎల్లప్పుడూ సరియైన దృక్పథం కలిగి ఉండాలి. సమాజంలోని దౌర్బల్యాలను తొలగించేందుకే కదా మనం కార్యక్షేత్రంలోకి పంపబడింది! సమాజం పట్ల మనకు సరియైన విశ్వాసం ఉండాలి. ఆరోగ్యవంతమైన దృష్టి ఉంటే ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించబడుతుంది.'

**అసత్యం నుండి సత్యానికీ, చీకటి నుండి వెలుగుకూ పురోగమించడమే సాధన.**

బోధ కథ

# నిరాడంబరతకు నమూనా

కెనడాలోని ఒక నగరంలో రోడ్డు మీద ఆగి ఉన్న కారులో ఇద్దర వ్యక్తులు వచ్చి కూర్చున్నారు. ఒకరు వృద్ధులు. ఒకరు యువకుడు. వారిద్దరూ తండ్రీ కొడుకులు. కారులో స్టీరింగ్ పట్టుకుని కూర్చుంటూ కొడుకు దినపత్రిక తీసాడు. తండ్రి అడిగాడు – "ఏమిటది?"

"టైమ్స్" కొడుకు జవాబిచ్చాడు.

"ఎక్కడ కొన్నావు?"

"ఆ కొట్లో"– అని కొడుకు చెప్పాడు. దానికి ఆ తండ్రి "వెళ్ళు, వెళ్ళి తిరిగి ఇచ్చెయ్. నా దగ్గర కూడా "టైమ్స్" ఉంది. నేను చదివిన తరువాత నువ్వు చదువు."

30, 40 పైసల దినపత్రికను తిరిగి ఇచ్చేయమని ఎవరైనా సామాన్యుడు చెపితే పొదుపరి అనుకోవచ్చు. కాని "రోల్స్‌రాయిస్" కారు యజమాని చెబితే ఆలోచించాల్సిందే. ఆ వ్యక్తి కోటీశ్వరుడైతే ఇంకా ఎక్కువ ఆలోచించాలి. కాని అతను పొదుపు మీద ఆధారపడే కోటీశ్వరుడు కాగలిగాడు. రెండుపూటలా తిండి దొరకని ఒక క్షురకుని కొడుకు అతడు. తన రోజుల్లో ప్రపంచం లోనే అతిపెద్ద ప్రెస్ యజమాని కాగలిగాడు. అపజయం, ప్రతికూలతల గుండెలను చీల్చి ముందుకు వెళ్ళి ధైర్యం, సాహసం అనే బలమైన పునాదులను నిర్మించుకున్న ఆయన నవయువకులకు ఖచ్చితంగా ఒక ఆదర్శంగా నిలుస్తారు.

లార్డ్ టామ్సన్ 1784 లో కెనడాలోని ఒక సామాన్య కుటుంబంలో జన్మించాడు. ఊహ తెలుస్తూనే తన తండ్రి చేసే పనిలో చేరవలసి వచ్చింది. కాని మరో విషయంలో ఆసక్తి ఉండటం వలన ఆయనకు ఈ పని భారంగా అనిపించింది. ఆయన తన కుటుంబానికి వారసత్వంగా వస్తున్న పేదరికం నుండి విముక్తి పొందాలనుకున్నాడు. ఏదోవిధంగా వ్యవసాయం మొదలుపెట్టాడు. గడ్డకట్టే చలి. సరిపోని బట్టలు. కాలంతో పోటీపడుతూ మట్టిలో బంగారం పండించాలనుకున్నాడు. కాని విజయం మొండిచెయ్యి చూపించింది.

ఈ రంగాన్ని వదిలి తన సొంత పనినే వ్యాపారంగా మర్చాడు. వ్యాపారంలో పెట్టుబడులు, లాభాల ఆట జరుగుతుంటుంది. తక్కువ పెట్టుబడితో లాభం కనిపించదు. అదే టామ్సన్ విషయంలోనూ జరిగింది. అందుకే దానిని కూడా వదిలేశాడు. అపజయం వెంట అపజయం వస్తుంటే ఒక సామాన్యుడైతే కృంగిపోయేవాడు. కాని టామ్సన్ సామాన్యుడు కాడు కదా! తాను పది సంవత్సరాలలో కోటీశ్వరుడు అవుతానని అందరికీ చెప్పేవాడు. ఇంట్లోవారు 'ముందు ఈ పూటకి తిండి ఏర్పాట్లు చెయ్యి" –అంటూ ఎగతాళి చేసేవారు.

ఎన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ, టామ్సన్ తన ధైర్యాన్ని సడలనివ్వలేదు. తన ప్రయత్నం తాను చేస్తూనే ఉన్నాడు. 1828లో ఆయన కుటుంబంలో ఒక దుర్ఘటన జరిగింది. అది ఆయన జీవితానికి ఒక దారి చూపటమే కాదు. ఆయన అడుగుల్లో వేగాన్ని కూడా పెంచింది. ఆయన కూతురికి ఒక దుర్ఘటనలో చేయి విరిగింది. డబ్బులేక పోవటంతో సరియైన చికిత్స చేయించలేకపోయేవాడు. చెయ్యి అలాగే ఉండిపోయింది. టామ్సన్‌ను తన గారాల కూతురు పరిస్థితి కదిలించివేసింది. జీవితంలోని ఈ సంఘర్షణలో గెలిచి తీరాలని సంకల్పించుకున్నాడు. దృఢమైన సంకల్పం, మనోబలాల ముందు పరిస్థితులు ఇబ్బంది కావని

**ఆధ్యాత్మిక వికాసానికి పెద్ద అవరోధం అహంకార యుక్త ఆలోచన.**

నిరూపించాలనుకున్నాడు. టామ్సన్ మనసులో ప్రణాళికాబద్ధంగా డబ్బు దాచవచ్చని ఆలోచన వచ్చింది. దానిని క్రియారూపంలో పెట్టటానికి ఎంతో శ్రమ, సాధనలతో పాటు తన సర్వస్వాన్ని అర్పించాడు.

ఎంతో కష్టపడి డబ్బుతో ఒక ప్రెస్ కొన్నారు. ఉన్న డబ్బంతా పెట్టుబడికే సరిపోయింది. మిగతావన్నీ తన కష్టంతో, ముందుచూపుతో పూర్తిచేసుకున్నారు. అందుకే ప్రెస్‌లోని కార్మికులకు జీతం బదులు చెక్కులు ఇచ్చేవారు. వారంరోజుల తరువాత మార్చుకోమనేవారు. ఈ వారంలో పేపరు ఏజంట్లు, కస్టమర్ల చెల్లింపులు బ్యాంక్‌లో జమ అయ్యేవి. ఈ విధంగా డబ్బు లేకపోయినా సమన్వయంతో పని జరిగేది. వ్యాపారం పెంచటానికై ఆయన డబ్బు ఉండి కూడా తక్కువ ఖర్చు చేసేవాళ్ళని వెతికి పట్టుకునేవారు. వారందరికీ -'డబ్బు ఎప్పుడైనా దొరుకుతుంది. కాని కాలంతో ఆటలాడవద్దు'- అని చెప్పేవారు.

ఈ విధంగా-దయ కలిగిన వ్యక్తిత్వం మొదలైన గుణాల వలన కార్మికులకు, అధికారులకు కూడా ఎప్పుడూ హైరానా పడవలసి వచ్చేది కాదు. ఆయన స్వయంగా ఖర్చు తక్కువ పెడుతూ సామాన్యమైన జీవితం గడిపేవారు. ఒక బ్రాహ్మణుడి యొక్క అన్నింటికన్నా గొప్ప విశేషం ఏమంటే- తనపట్ల కఠినంగాను, ఇతరులపట్ల ఉదారంగాను ఉండటం. టామ్సన్ ఈ ఆలోచనను ఎక్కువగా సమర్థించటమే కాదు, తన జీవితంలో ఆచరించారు కూడా. తన జీవన సిద్ధాంతాన్ని చివరిదాకా పాటించారు. ఎన్నోసార్లు రాజకుటుంబం నుండి ఆహ్వానం వచ్చింది. మహారాణి గారు కూడా ఎన్నోసార్లు పిలిచారు. కాని ఎప్పుడూ శుభ్రమైన, సామాన్యమైన వస్త్రాలనే ధరించేవారు. టామ్సన్ ఎప్పుడూ సాధారణ వేషభూషల్లోనే ఉండేవారు. అదే ఆయనకు గుర్తు. వ్యక్తులు ఎప్పుడూ తమ స్వభావం, నడవడిక, ఆలోచనలు, వ్యక్తిత్వం ద్వారానే పేరుపొందుతారు, అలంకరణలు, ఆడంబరాలతో కాదు- అని చెప్పేవారు. 'విలువైన ఖర్చైన సూట్లు కేవలం ఆడంబరానికే. దాని ద్వారా అనవసరంగా అహంకారం పెరుగుతుంది. అందుకని నేను దానిలో నా శ్రామికుల సాధనను, సంపదను ఎందుకు పాడుచేయాలి?' -అని చెప్పేవారు.

టామ్సన్ కొనుగోలు విషయంలో కూడా ఎప్పుడూ ఈ సిద్ధాంతాన్ని గుర్తుపెట్టుకునే వారు. ఆయన స్వయంగా తనను ప్రెస్‌లోని ఒక కార్మికుని కంటే ఎక్కువ అనుకునేవారు కారు. దానికి తగినట్లుగానే జీవితం చివరివరకు ఖర్చు పెట్టేవారు. ఈ నీతి నియమాల వలనే దుర్వ్యసనాలనుండి, దుష్ప్రవర్తనల నుండి తనను తాను రక్షించుకున్నారు. ఆయన కుటుంబం కూడా సుసంస్కృతంగా వికసించింది. లార్డ్ టామ్సన్ అనవసర ఖర్చులు తగ్గించటం లోను, డబ్బు సంపాదించడంలోనూ చేయి తిరిగినవారు. నష్టంలో ఉన్న ఏ పత్రికనైనా లాభాల బాటలో నడిపేవారు. ఆయన ఈ రంగంలో ఒక సమర్థుడైన వ్యాపారిగా పేరు పొందారు. "పత్రిక ఏవిధమైన వాదాలలోనూ దిగకూడదు. దానిని స్వతంత్రంగా, నిష్పాక్షికంగా, నిర్భయంగా పనిచేసేలా చూడాలి. అలా కాకపోతే సమాజానికి, ప్రజలకు, అది సేవ చేయలేదు. నా కార్మికులకు ఇదే నేర్పిస్తాను"- అని ఒకసారి చెప్పారు కూడా. ఈ రోజుకీ ఆయన వ్రాసిన పాత సంపాదకీయాలు జర్నలిజంలో పేరుగాంచినవి.

1856లో ఆయన మరణించారు. ఒక సాధారణ కుటుంబం నుండి సంఘర్షణతోను, సాహసంతోను ముందుకు నడచి విజయం అంచులదాకా చేరిన టామ్సన్ జీవితం ఏ యువకుడికైనా స్ఫూర్తిదాయకం. దైన్యం, నిరాశలకు ఎప్పుడూ జీవితంలో స్థానమివ్వరాదని ఆయన జీవితం చెపుతోంది.

★★★

**జాగృత ఆత్మలు యుగపు పిలుపును విన్న తర్వాత చేతులు ముడుచుకుని కూర్చొనలేరు.**

ఆచరణలో అధ్యాత్మ

# ఆంతరిక సంస్కరణలోనే జీవన సాఫల్యం

బయటి ప్రపంచపు సమాచారాన్ని హెచ్చుగా సంపాదించడం సముచితమే, అవసరమే. అయితే- మనం మనల్ని గురించి హెచ్చుగా తెలుసుకోవడం కోసం, మన సమస్యలను అర్థం చేసుకోవడం కోసం, మన ప్రయోజనాలను నెరవేర్చుకోవడంకోసం తగు ప్రయత్నం చేయడం అన్నిటికన్నా ముఖ్యమైన విషయం.

## ఆంతరిక స్థితి ముఖ్యం

జీవితం ప్రగతి పొందడంలో, పతనం చెందడంలో బయటి పరిస్థితుల పాత్ర చాలా కొద్దిపాటిది. మనిషియొక్క ఆంతరిక స్థితియే అందులో ప్రముఖ పాత్ర వహిస్తుంది.

నీవు మలినంగా, నికృష్టంగా, అస్తవ్యస్తంగా ఉంటే- దాని ప్రతిక్రియ లెక్కలేనన్ని సమస్యలనూ, ఆపదలనూ సృష్టిస్తుంది. నోటినుండి దుర్వాసన వస్తూ ఉంటే, ప్రక్కన ఉన్న ప్రతివ్యక్తీ అసహ్యించుకుంటాడు; దూరంగా జరిగి కూర్చుంటాడు. ఒక వ్యక్తి ఆలోచన నుండి, స్వభావంనుండి దుర్గంధం వెలువడుతూ ఉంటే- అతడికి మిత్రులూ ఉండరు, సహచరులూ ఉండరు. విరోధంతో, నిందతో కూడిన వాతావరణం నలువైపులా ఆవరించి ఉంటుంది.

నీ లోపలి స్థితి సద్భావనతో, శిష్టతతో కూడి ఉంటే- దాని ఆకర్షణ శక్తి సజ్జనుల సహకారాన్ని నీ చుట్టూ నిర్మిస్తుంది.

ఈ ప్రపంచం అద్దం వంటిది. దానిలో చాలవరకు నీ బొమ్మే కనబడుతుంది. ఎవరు ఎలా ఉంటే, వారి మిత్రులూ, సహచరులూ కూడ ఆ స్థాయికి చెందినవారే అవుతారు. పరిస్థితులూ, సాధనాలూ కూడ క్రమంగా ఆ విధమైనవే సమకూరుతూ ఉంటాయి. లోపలి స్థితికి అనుగుణంగా వ్యక్తిత్వం, వాతావరణం నిర్మాణం అవుతాయి.

## మనఃస్థితికి అనుగుణంగా పరిస్థితి

మంచివీ చెడువీ పరిస్థితులు మనకు లభిస్తాయని భావించడం పొరపాటు. వాస్తవం ఏమంటే- మన లోపలి పరిస్థితికి అనుగుణంగా బయటి పరిస్థితులు ఏర్పడుతూ, మారుతూపోతాయి. మనల్ని మనం సంస్కరించుకోవడం అంటే అర్థం - మన విషమ సమస్యలను పరిష్కరించుకోవడం, మన సర్వతోముఖ ప్రగతికి రాచబాట వేయడం.

బయటి వ్యక్తులనూ, సంఘటనలనూ మనం కోరుకున్నట్లు మలచడం కష్టం. మన ఆంతరిక స్థితిని మార్చుకుని కోరుకున్న విధంగా వాతావరణాన్ని దానికదిగా మారేందుకు తలుపు తెరవడం మరింత సులభమైన పని. ఇలా చేయడంలోనే విజ్ఞత ఉంది.

ఇతరులను సరిగా అంచనా వేయడం కష్టం. కానీ, మనల్ని మనం తేలికగా తెలుసుకోగలుగుతాం. ఇతరులను సంస్కరించడం కష్టం. కానీ, మనల్ని మనం సులభంగా సంస్కరించుకోగలుగుతాం. ఇతరులకు పెద్దయెత్తున సాయపడడం సాధ్యపడకపోవచ్చు. మనకు మనం సాయపడడం మరింత సులువు.

## పాత్రతను పెంచుకోవడం ప్రధానం

మనం మనల్ని అర్థం చేసుకోవాలి; మనల్ని సంస్కరించుకోవాలి. మనకు మనం సేవచేయడానికి సిద్ధంగా ఉండాలి. ఇతరులకు సేవచేసే పుణ్యం పొందటానికి ఇది తొలి అడుగు కావడం, మహత్తరమైన చర్య కావడం నిశ్చయం.

నీవు పొందగోరే దానికోసం బయట పరుగులు తీసేముందు - నీలోపల దానికి తగిన పాత్రతను సంపాదించు. నీ వ్యక్తిత్వాన్ని ఎంత తీక్షణంగా, ఎంత సంస్కరించబడిన దానినిగా, ఎంత సమర్థంగా రూపొందించుకుంటే - అంతగా కోరుకున్న వాటిని పొందగలగడం సాధ్యమే కాక సరళం కూడ అవుతుంది. నీ ప్రత్యేకతలే బయటి సహకారాన్ని ఆకర్షిస్తాయి. లోపల దృఢంగా ఉన్న వ్యక్తి మాత్రమే లభించినవాటినుండి పూర్తి ప్రయోజనం పొందగలుగుతాడు. నీవు నీ బలహీనతలను ఉపేక్షిస్తూ ఉంటే, బయటి వస్తువులు నీ చేతికి అందకుండా పోతాయి. కనుక, నీ ఆకర్షణ శక్తిని తీవ్రతరం చేసుకోవడంలో నీవు నిమగ్నం కావాలి. ఆ ఆకర్షణ శక్తి ప్రభావంవల్ల ఎన్నెన్నో సాఫల్యాలు నీ దగ్గరకు లాగబడతాయి.

★★★

**తర్వాత పశ్చాత్తాపపడవలసినది ఏదీ మనం చేయకూడదు.**

# మాలవ్యా జయంతి వ్యాసం

# మూర్తీభవించిన దేవసంస్కృతి మహామనా మాలవ్యా

1861 డిసెంబర్ 25న ఆహియాపురంలో పండిత మదనమోహన మాలవ్యా జన్మించారు. మదనమోహన్‌కి ఎనిమిదవ ఏట ఉపనయనం చేశారు. తన కుమారునికి తానే స్వయంగా అమూల్యమైన గాయత్రి బోధించాడు తండ్రి వ్రజనాథ్.

బాలమేధావి మదనమోహన్ అనునిత్యం ఉభయ సంధ్యలలో అనుష్ఠానం చేసేవాడు. 15 సంవత్సరాల మదనమోహనుడికి కుందనాదేవి నిచ్చి వైభవంగా పెళ్ళి జరిపించారు. యోగ్యుడైన భర్తకు లభించిన యోగ్యురాలైన భార్య కుందనాదేవి.

తన తాత తండ్రులు అనుసరించిన పథంలోనే భాగవతానికి వ్యాఖ్యానాలు వ్రాసి పేరు ప్రతిష్ఠలు సాధించాలన్నది మదనమోహన్ కోరిక. ఇదే విషయం తల్లికి నివేదించాడు. కుమారుడి కోరిక విన్న మూనాదేవి “మన ప్రస్తుత పరిస్థితి నీకు తెలుసు. నీకు ఏది సబబనిపిస్తే అదే చేయి” అని అన్నది. తల్లి హృదయం అర్థంచేసుకున్నాడు మదనమోహన్. నలభైరూపాయల జీతానికి ఒక పాఠశాలలో ఉపాధ్యాయుడుగా చేరాడు. పాఠశాలనుండి రావడమే వ్యాయామం చేసేవాడు. సేవ - క్రమశిక్షణ అవసరమనుకున్న దగ్గర అతనుండేవాడు. సంగీత సాధనకు అంకిత మయ్యేవాడు. మురళి, సితార వాయించడం నేర్చుకున్నాడు. ప్రభాత సమయాల్లో సాయం సంధ్యలలో కుమారుడికి మీరా, సూరదాసుల భక్తిగీతాలు నేర్పేవాడు వ్రజనాథ్.

## పండిత సమావేశం

పదునైదు సంవత్సరాల వయస్సులో ఉండగా మదనమోహన్‌కి పినతండ్రితో కలసి మిర్జాపూర్ వెళ్ళే అవకాశం వచ్చింది. అక్కడ ఎందరో పండితులు కలుస్తున్నారు. సంస్కృతంలో మృదుమధురంగా హేతుబద్ధంగా సాగిన మదనమోహనుని ఉపన్యాసానికి, మేధాశక్తికి అక్కడి పెద్దలంతా సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యారు.

## వివిధ ముఖాల రత్నం

పుట్టుకతోనే మదన్‌మోహన్ కవి. 15, 16 సంవత్సరాల వయస్సులోనే కవిత్వం వ్రాయడం మొదలుపెట్టాడు.

భారత జాతీయ కాంగ్రెస్ రెండవ సమావేశాలు కలకత్తాలో నిర్వహించారు. అంతపెద్ద మనోహరమైన సమావేశాలలో తన గురుదేవుని ఆదేశానుసారం ఒక యువకుడు వేదిక వద్దకు వెళ్ళాడు. అతను ఉపన్యాసం మొదలుపెట్టాడు. ఆ యువకుని వాక్కులు దేశభక్తితో వెల్లువెత్తాయి. నిశ్చల గంగా ప్రవాహంలా సాగిపోతున్నాయి. శ్రోతలు ఆనందంలో మునిగిపోయారు. కాంగ్రెస్ సంస్థాపకులు ఏ.ఓ. హ్యూమ్- మదన్‌మోహన మాలవ్యా చేసిన నేటి ఉపన్యాసం ఏనాటికీ మరిచిపోలేనిది- అని అన్నారు.

ఈ సమయంలోనే శ్రీరాంపాల్ సింగ్ మాలవ్యాను కలుసుకున్నారు. హిందుస్థాన్ పత్రికా సంపాదకులు వారు. తన పత్రికకు ఎడిటర్‌గా ఉండమని మాలవ్యాను వారు అభ్యర్థించారు. అంతేకాకుండా పత్రిక బరువు బాధ్యతలు మొత్తం వారికే అప్పగించారు.

## న్యాయవాదిగా

సామాజిక జీవనంలో ఎంతో ఒత్తిడికి లోనౌతున్నప్పటికీ 1892 లో అలహాబాదు హైకోర్టులో న్యాయవాదిగా చేరారు. మాలవ్యా స్వల్పవ్యవధిలోనే గొప్పన్యాయవాదిగా పేరు తెచ్చుకున్నారు. అనతికాలంలోనే ప్రజాబాహుళ్యంలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. అసామాన్య మేధాసంపత్తి, అనర్గళ వాక్‌శక్తి, సహనం, కష్టించి పనిచేసే సామర్థ్యం మాలవ్యాకు పుట్టుకతోనే అబ్బినవి. న్యాయవాదిగా పుష్కలంగా ధన సముపార్జన చేశాడు. తన జీవితంలో ఏనాడు తప్పుడు కేసులు చేపట్టలేదు. పేదలు - అమాయకుల కోసం తన న్యాయపటిమను ఎక్కువగా వినియోగించేవాడు.

**గురు కృపద్వారానే ఆత్మప్రేరణ, ఆత్మబోధ కలుగుతాయి.**

## జాతి అధ్యాపకుడు

భారత జాతీయ స్వాతంత్ర్య సంగ్రామ సౌధంలో మహాత్మా గాంధీ, సుభాష్‌చంద్ర బోసులకే మాత్రం తీసిపోరు మదనమోహన మాలవ్యా. అయితే ఆయన కంటికి కనపడని పునాదిరాయి. మాలవ్యా 'జాతి అధ్యాపకుడు'.

మాలవ్యా భారతీయ సంస్కృతి పూర్వ వైభవం, గౌరవం తిరిగి పొందాలని పట్టుపట్టాడు. అందుకోసమే బెనారస్ యూనివర్శిటీ స్థాపించాలని నిర్ణయించుకున్నాడు. కాంగ్రెస్ అతిరథుడైన సురేంద్రనాథ్ బెనర్జీ సరైన అధ్యాపకులు దొరికేవరకూ యూనివర్శిటీలో ఇంగ్లీషు ప్రొఫెసర్‌గా ఉచితంగా పనిచేస్తానని అన్నారు.

ఈనాడు బెనారస్ హిందూ యూనివర్శిటీ ఉన్న ప్రదేశం కొరకు మాలవ్యా గట్టిగా కృషి చేశారు. ఆ ప్రదేశం బెనారస్ రాజావారిది. మాలవ్యా బహుమతిగా ఆ స్థలాన్ని రాజుగారి నుండి అందుకున్నారు.

## సిగ్గుపడిన నిజాం

హిందూ యూనివర్శిటీకై నిధులు అభ్యర్థించడం మొదలుపెట్టాడు. భోషాణం నిండసాగింది. ఈ సందర్భంలోనే ఆయన హైదరాబాదు నగరానికి వచ్చారు. ఆనాడు నిజాం ఈ నగరాన్ని పాలిస్తున్నాడు. ఆయన పర్యటన విషయం తెలుసుకున్నాడు నిజాం. యూనివర్శిటీకి విరాళం ఇవ్వడానికి అతను ఒప్పుకోలేదు. ఇదే విషయం స్పష్టంగా మాలవ్యాకు తెలియజేశాడు. రిక్తహస్తాలతో ఇక్కడినుండి వెళ్ళడం మాలవ్యాకు సుతరామూ ఇష్టం లేదు.

అదే రోజు ధనవంతుడైన హిందువు ఒకడు మరణించాడు. అతని అనుయాయులు శవంమీద నాణాలు చల్లుతూ ఊరేగింపు తీస్తున్నారు. ఇది గమనించిన మాలవ్యా ఆ రూకలు ఏరి సంచిలో వేసుకోసాగాడు. ఇది గమనించిన కొందరు నాణాలు ఏరి ఆయన సంచిలో వేసారు. సంచి నాణాలతో నిండిపోయింది. నిజాంకు ఈ విషయం తెలిసింది. సిగ్గుపడ్డాడు. ఔదార్యంతో బాగా విరాళమిచ్చి అభినందించాడు.

## బిచ్చగాళ్ళకే అధిపతి

ఒక పర్యాయం దర్భంగలో భాగవతంపైన ఉపన్యాసమిచ్చారు మాలవ్యా. దర్భంగ మహారాజు ఆఖరిరోజు కార్యక్రమానికి విచ్చేశారు. మాలవ్యా ఒసగిన అద్భుత ప్రసంగానికి మహారాజా మంత్రముగ్ధుడైపోయాడు. 25 లక్షల రూపాయలు విరాళమివ్వడమే కాదు, తన శేషజీవితమంతా మాలవ్యా ఉదాత్త ఆశయసాధనకు తాను కూడా కృషి చేస్తానన్నాడు.

పండిత మాలవ్యా దేశం నలుమూలల నుండి ఒకకోటి 34 లక్షల రూపాయలు ప్రోగుచేశారు. బిచ్చగాళ్ళ అధిపతి అనే బిరుదు పొందారు. ఒక్కసారి గాంధీజీ 'నా పెద్దన్న శ్రీ మాలవీయ నుండి డబ్బులు దండటం నేర్చుకోవాలి'- అని అబ్బురపడుతూ అన్నారు.

## బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం

1916 ఫిబ్రవరి నాలుగు శుభప్రదమైన వసంత పంచమి రోజు. బెనారస్ ఉత్సవ రూపం సంతరించుకుంది. గంగాతీరాన ఆనాటి వైస్‌రాయ్-గవర్నర్ జనరల్ హర్డింజ్ చేతులమీదుగా హిందూ యూనివర్సిటీకి శంఖుస్థాపన జరిగింది. వేదాలు-ఉపనిషత్తులు, గీత, మహాభారతం, రామాయణం వంటి పవిత్ర గ్రంథాలు చదవడం, భారతీయ సంస్కృతికి సంస్కృత భాషకు ప్రాముఖ్యం కలిగించడం మొదలైన అంశాల సాధనకే యూనివర్సిటీ స్థాపించారు. అదే వారి జీవితానికి ఊపిరి అయ్యింది.

## భారతీయ సంస్కృతికి పుట్టినిల్లు

ఆర్థిక స్థితిగతుల కంటే వ్యక్తి శీలం అత్యవసరం. ప్రతిదేశం తన ధర్మాన్ని కాపాడుకోవాలి. పరంపారానుగతంగా మనకు సంక్రమించిన హిందు ధర్మాన్ని కాపాడవలసినవారు నేటి నవతరం. హిందూధర్మం జీవనమార్గం చూపే దివ్వెవంటిది. నేటి యువతరం మన సంస్కృతిని అర్థం చేసుకోవాలి. మాలవ్యా ఆలోచనలు ఇలా ఉండేవి.

హిందూ ధర్మం మనకందించిన విలువలను సంరక్షించుకోవడానికి అనువైన విద్యను బోధించడమే ధ్యేయంగా స్వీకరించింది బెనారస్ విశ్వవిద్యాలయం.

**ఉదాత్త ఆశయాలతో ముడిపడిన కర్తవ్యపాలనయే కర్మయోగం.**

యువతరానికి విశాల దృక్పథం కలిగిన హిందూ విద్యా సుగంధం అందించాలి. దానికి తోడుగా ఇతర ధర్మాలను సైతం అవగాహన చేసుకోవడం నేర్పాలి. మదన మోహన మాలవ్యా హృదయంలో మొలకెత్తి మానుగా మారిన ఆశయమిది. ఆయన ఆశయాలకు, ఆదర్శాలకు సజీవ రూపకల్పన బెనారస్ హిందూ యూనివర్శిటీ.

## ఆదర్శ రచయిత

పత్రికకు సంపాదకుని బాధ్యతలు స్వీకరించిననాడు– నా బాధ్యతా నిర్వహణలో వీసమెత్తయినా ఇతరుల జోక్యం సహించను, నాకు పూర్తిగా స్వేచ్ఛ ఉండాలి – అని అన్నారు. నిబంధనను అంగీకరించి రాజా రాంపాల్ సింగ్ వారికి పత్రిక బాధ్యత అప్పగించారు. పత్రిక గురుతర బాధ్యత మాలవ్యా తీసుకున్నారు.

ఢిల్లీ నుండి ప్రచురితమయ్యే 'కోపాల' వార పత్రికకు వీరి అండదండలుండేవి. బాబూ పురుషోత్తమదాస్ టాండన్ నడిపే 'అభ్యుదయ' పత్రిక నిర్వహణలో వెన్నుదన్నుగా ఉండేవారు. పత్రికారచయితకు ఆదరణీయ లక్ష్యాలు, ఆత్మగౌరవం, హుందాతనం, బాధ్యతాయుత స్వభావం ఉండి తీరాలని అనేవారు. అతడు ఉన్నత ధర్మాలు కలిగి, నీతినిజాయితీలను విస్మరించని వాడై ఉండాలి – అనేవారు.

ఢిల్లీ నుండి ప్రచురితమయ్యే ది హిందూస్థాన్ టైమ్స్ పత్రికను కొని కొన్ని సంవత్సరాలపాటు ఆ పత్రికను చక్కగా నడిపించారు. ఈ రోజు ఢిల్లీ నుండి ప్రచురితమౌతున్న 'ది హిందూస్థాన్ టైమ్స్' 'ది హిందూస్థాన్'లు మాలవ్యా ప్రభావ ఫలాలే.

## రౌండ్ టేబుల్ సదస్సు

1931లో లండన్‌లో రెండవ రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. మహాత్మా గాంధీ ఈ చర్చలకు మాలవ్యాను తీసుకువెళ్ళాలని నిశ్చయించారు.

తన మతం పట్ల మాలవీయకు ప్రబల విశ్వాసం. లండన్ వెళ్ళే సమయంలో తనవెంట పవిత్ర గంగాజలం తీసుకువెళ్ళాలని నిర్ణయించుకున్నారు.

రౌండ్‌టేబుల్ సమావేశంలో వారి పాత్ర ఎన్నటికీ మరువలేనిది. 'ఇండియన్ డైరీ' అనే తన పుస్తకంలో మాంటేంగు రౌండ్ టేబుల్ సదస్సులో మాలవ్యా పాత్రను చాలా ప్రశంసించాడు. తేజ్ బహదూర్ సప్రూ కూడా హృదయపూర్వకంగా ఆయనను అభినందనలతో ముంచెత్తారు. తన అశేష ప్రజ్ఞా పాటవాలతో ఖండాంతరాలలో సైతం రాజనీతిజ్ఞుల ఆదరాభిమానాలను చూరగొన్నారు మాలవ్యాజీ.

## దినచర్య

తన దైనందిన కృత్యాలను క్రమపద్ధతిలో ఆచరించేవారు శ్రీ మాలవ్యా. వేకువజామున నిద్రలేచి వ్యాయామం సాధన చేసేవారు. భారతదేశ కంపెనీలు తయారీచేసిన సబ్బులను మాత్రమే ఉపయోగించేవారు. స్నానానంతరం పూజాకార్యక్రమములు ముగించేవారు. నుదుట తిలకధారణచేయడం ఎన్నడూ మరిచేవారు కారు. తరువాత వెచ్చని పాలు తాగేవారు. తెల్లని దుస్తులు, తలపాగా ధరించేవారు. మధ్యాహ్నం ఒకటిరెండు గంటలు వచ్చిపోయేవారితో గడిపేవారు.

మాలవ్యా చాలా మితాహారం తీసుకునేవారు. మసాలా దినుసులు తినేవారుకారు. భోజనానంతరం విశ్రాంతి తీసుకునేవారు. ఆయన నిద్ర గదిలో తల్లిదండ్రుల తైలవర్ణ చిత్రపటాలుండేవి. తల్లిదండ్రుల చిత్రపటానికి, భగవంతునికి ప్రార్థన చేసిగాని నిద్రకు ఉపక్రమించేవారు కారు.

## బహుభాషా కోవిదుడు

మాలవ్యాకు అనేక భాషలు వచ్చు. ఆంగ్ల, సంస్కృత, హిందీ, ఉర్దూ భాషలలో ప్రజ్ఞాశాలి. ఇంగ్లీషు భాష మాట్లాడే సమయంలో ఇతర భాషా పదాల్ని ఎన్నడూ ఉపయోగించేవారు కారు. సంస్కృత భాషలో మాట్లాడే సమయంలో చదువుల తల్లి సరస్వతి ఆయన నాలుకపై నర్తిస్తుందా అని అనిపించేది. ఆయన ప్రసంగంవలె ఆయన రచనలు సైతం కదిలిస్తాయి. పాఠకుల హృదయాలను పట్టి బంధిస్తాయి. ఆయన మాటలు ముత్యాలైతే రచనలు రత్నాలు.

## విప్లవవాది

పాత సంప్రదాయాల్ని పట్టుకు వ్రేలాడే వ్యక్తిలా కనిపించినా, మాలవ్య గొప్ప విప్లవకారుడు. 1919వ సంవత్సరం

ప్రతిభలకూ, సంపదలకూ రాజమార్గం పాత్రత యొక్క వికాసం.

ఏప్రిల్ 13వ తేదీ అమృతసర్‌లోని జలియన్‌వాలా బాగ్‌లో అత్యంత విషాద సంఘటన జరిగింది. క్రిక్కిరిసిన సభలో నిస్సహాయులైన ప్రజలు కాల్చి చంపబడ్డారు.

కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులంతా సిమ్లాలో సమావేశమయ్యారు. ఆ సమావేశంలో శ్రీ మాలవ్యా అత్యంత ఉద్వేగభరితంగా ఆరుగంటలసేపు జలియన్ వాలాబాగ్ నరమేధం పై ప్రసంగించారు. ప్రేరణాత్మకమైన ఆయన వాగ్ధాటికి సమావేశంలోని ఆంగ్లేయులు సైతం ఉత్తేజితులయ్యారు.

1947లో భారతదేశం స్వాతంత్ర్యం పొందింది. ఒక్క సంవత్సరం ముందు ఆనాటి తాత్కాలిక ప్రభుత్వం జరుగుతున్న దారుణాలను నిస్సహాయంగా చూస్తూ ఉండిపోయింది.

ఈ హృదయ విదారక సంఘటనలు తెలిసికొన్న మాలవ్యా స్థాణువయ్యారు. ఇస్లాంలోకి మార్చబడిన హిందువులను తిరిగి స్వధర్మంలోకి తీసుకురావడమెలా అనే ప్రశ్న ఎదురైనప్పుడు 'రామనామం-పవిత్ర గంగా జలం వారిని తిరిగి హిందువులుగా మార్చగల'వని అన్నారు.

హిందువులందరినీ ఏకత్రాటిపై తీసుకురావడానికై అవిశ్రాంతంగా శ్రమించారు. మరొకవైపున హిందూ - ముస్లిం సఖ్యతకై పాటుబడ్డారు. హరిజనోద్ధరణ జరిగితేనే హిందూదేశం అభివృద్ధి చెందుతుందనేవారు మాలవ్యా. అట్టడుగు వర్గాల, పేదప్రజల, వైధవ్యం పొందిన మహిళల, నిరక్షరాస్యుల ఉన్నతికై శ్రమించారు వారు.

## అంతిమయాత్ర

వంద సంవత్సరాలు సంపూర్ణంగా జీవించాలని మాలవ్యా ఆకాంక్ష. భగవంతుని నిర్ణయం మరోలా ఉంది. నౌఖాలీ దారుణ సంఘటనలు ఆయన హృదయాన్నీ మనసునీ శరీరాన్నీ మథించివేశాయి. ఈ వేదనతోనే 1946 నవంబరు 12వ తేదీన పండిత మదనమోహన మాలవ్యా తుదిశ్వాస విడిచారు. యావత్ జాతీ దుఃఖసాగరంలో మునిగిపోయింది.

## మాలవ్యా ఆలోచనలు

పరమేశ్వరునిపై విశ్వాసం ఉంచు. పశుపక్ష్యాదులపై ప్రేమ కలిగి ఉండు. బీదవారిపై - బలహీనులపై దయ చూపించు. స్త్రీలనెప్పుడూ గౌరవించు. ఆపన్నులను ఆదుకో- ఎవరిపట్లా క్రూరత్వం చూపించకు.

స్వచ్ఛమైన జీవితాన్ని సాగించు. ఇతరుల ఆస్తిని దొంగిలించకు.

ఆత్మస్థైర్యం - విశ్వాసం కలిగి ఉండాలి. ఇతరులగురించి చెడుగా మాట్లాడవద్దు. అభిప్రాయ భేదం వచ్చినపుడు ఎదుటివారి అభిప్రాయాలను గౌరవించు. ఎవరినీ చూచి భయపడవద్దు. నిన్ను చూచి ఎవరూ భయపడకూడదు.

భారతదేశం మన మాతృభూమి. మనకు భగవంతుడిచ్చిన ప్రసాద భూమి. పవిత్రమైనది. నీతి నిజాయితీలతో ఈ భూమికి అనుగుణంగా ప్రవర్తించు.

భారత్ అదే ఇండియా అంటే హిందుస్థాన్. భగవంతుని ఆశీర్వాదం లభ్యమైనవారే ఇక్కడ జన్మిస్తారు.

హైందవ ధర్మం మహోన్నతమయినది. భారతీయ మానవుడు సన్మార్గంలో ప్రయాణిస్తూ సత్కర్మలు ఆచరిస్తూ ముక్తిని పొందాలన్నది భగవంతుని నిర్దేశం అని చెబుతున్నది.

ఈ లక్ష్యాన్ని చేరడానికై భగవంతుడు నాలుగు ఆశ్రమాలను మనకు ప్రసాదించాడు- బ్రహ్మచర్యం, గృహస్థధర్మము, ఆశ్రమవాసము, సన్యాసజీవనం. ఈ నాలుగు ధర్మాలను ఆచరించడం ద్వారా మానవుడు తాను సుఖించడమేకాక. నైతిక విలువలు చిరస్థాయిగా మిగల్చగలడు.

కేవలం తన స్వసుఖానికే జీవించే మానవుడు పశువుతో సమానం. వ్యక్తి తనదేశంకోసం, ధర్మంకోసం, ఇతరుల కొరకు జీవించాలి. ప్రపంచంలోనే అత్యంత పురాతన పవిత్ర గ్రంథాలు వేదాలు. ప్రాశ్చాత్య విజ్ఞులు సైతం ఇది అంగీకరించారు. మానవుడు జ్యోతిర్మయ మార్గంలో ప్రయాణించాలి అందుకై సాధనచేయాలి.

మహోన్నతుడైన శ్రీ మాలవ్యా మనకు అందించిన చిరస్మరణీయ సందేశమిదే.

-అర్చిక వెంకటేశ

★★★

**ఆత్మపరీక్ష, ఆత్మనిర్మాణం - ఇవే మహత్తర పురుషార్థాలు.**

సాధన విజ్ఞానం

# పౌరాణిక గాథలలోని యోగశాస్త్ర రహస్యాలు

కుండలినీ మహాశక్తి రెండు తలలు కలిగిన సర్పిణి. దాని తలలో ఒకటి మలమూత్ర విసర్జన ఇంద్రియాల మధ్య ఉన్న మూలాధార చక్రంలో ఉంది. రెండవది మెదడు మధ్య బ్రహ్మ రంధ్రంలో ఉంది. భూమియొక్క ఉత్తర, దక్షిణ ధృవాల మధ్య గల ఇచ్చిపుచ్చుకోవడం వంటిది ఈ కేంద్రాలు రెండింటి మధ్యా జరుగుతూ ఉంటుంది. మేరుదండం ఈ ప్రక్రియకు మధ్యమం. వెన్నెముక వీటిని కలుపుతూ ఉంటుంది.

మేరుదండంలో ఒక బ్రహ్మనాడి ఉంది. దానికి ఇరువైపులా ఇడా, పింగళ నాడులు పనిచేస్తూ ఉంటాయి. ఇవి రక్తాన్ని ప్రసారంచేసే సిరలు కావు. శస్త్రక్రియద్వారా వీటిని చూడలేము. వాస్తవానికి ఇవి విద్యుత్ ప్రవాహాలు. వీటికి స్థూల రూపం, స్థూలమైన మనుగడ లేవు.

## మూలధారం నుండి బ్రహ్మరంధ్రం వరకు విద్యుత్ ప్రవాహం

మల ద్వారానికీ, జననేంద్రియానికీ మధ్య ఉండే సుమారు నాలుగు అంగుళాల స్థలంలో ఒక త్రికోణ పరమాణువు ఉంది. శరీరం అంతటిలో వృత్తాకార కణాలు ఉంటాయి. ఇదొక్కటే త్రికోణ ఆకారంలో ఉంటుంది. ఇక్కడ ఒక విధమైన శక్తి ప్రవాహం ఉంది. శరీరంలో, యంత్రాలలో ప్రవహించే విద్యుచ్ఛక్తి ముందుకూ, వెనుకకూ పోతూ తనదైన దిశలో పురోగమిస్తుంది. అయితే, మూలాధార త్రికోణ కణం యొక్క శక్తిప్రవాహం చెట్టుకు అల్లుకున్న తీగెవలె చుట్లు తిరుగుతూ ముందుకుపోతుంది. ఇలా సుమారు మూడున్నర చుట్లు తిరుగుతుంది. ఆ తర్వాత ఈ ప్రవాహం మామూలు పద్ధతిలో ముందుకుపోతుంది.

ఈ ప్రవాహం మేరుదండం గుండా మెదడులోని బ్రహ్మ రంధ్రం వరకు, అనగా సహస్రార కమలంవరకు వెళుతుంది. ఈ శక్తి కేంద్రం యొక్క మధ్య అణువు గుండ్రంగా కాక చదునుగా ఉంటుంది. దాని అంచులు రంపపు పళ్లవలె ఎగుడుదిగుడుగా ఉంటాయి. ఈ పళ్ల సంఖ్య వేయి అని యోగులు చెపుతారు. విచ్చుకున్న వేయి దళములు కలిగిన కమలముగా దానిని అలంకారికంగా వర్ణిస్తారు.

వేయి దళములు గల కమలమును పురాణాలు వర్ణించిన పద్ధతి మహోత్తమమైనది, సారగర్భితం అయినది. విష్ణుమూర్తి. క్షీరసాగరంలో వేయిపడగల ఆదిశేషునిపై శయినించి ఉన్నాడని పురాణాలు వర్ణిస్తున్నాయి. ఆ వర్ణన ప్రకారం- ఆయన చేతులలో శంఖం, చక్రం, గద, పద్మం ఉన్నాయి. లక్ష్మీదేవి ఆయన కాళ్లు ఒత్తుతూ ఉంది. కొందరు దేవతలు ఆయన దగ్గర నిలబడి ఉన్నారు.

## మెదడులోని పదార్థమే పాల సముద్రం

క్షీర సాగరం మెదడులో నిండియున్న బూడిదరంగు గల చిక్కని పదార్థం (గ్రేమేటర్). వేయి పడగల ఆదిశేషుడు చదునుగా, మొనలు కలిగిన ఉన్న బ్రహ్మరంధ్రంలోని విశేష పరమాణువు. మనిషి శరీరంలో ఉన్న బ్రహ్మసత్తాకు కేంద్రం ఇదే. దీనినే విష్ణుమూర్తి నివాసంగా వర్ణించారు.

ఇక్కడ విష్ణుమూర్తి నిద్రపోతూ ఉంటాడు. అందరిలోనూ పరమేశ్వరుని అంశ ఉంటుంది. అయితే అది మేలుకొని ఉండదు. సాధారణంగా జనం హేయమైన పశుప్రవృత్తుల స్థాయిలో బ్రతుకుతూ ఉంటారు. వారిలో పరమేశ్వరుడు లేడనీ, ఉంటే నిద్రావస్థలో ఉన్నాడనీ వారిని చూస్తే అనిపిస్తుంది. మనిషిలో పరమేశ్వరుడు మేల్కొని ఉంటే, అతడి ఆలోచనలు, క్రియాశీలత, ఆకాంక్షలు, అతడి స్థితి ఉత్కృష్ట స్థాయిలో ఉంటాయి. అతడు మెలకువ కలిగి ఉంటాడు. వెలుగుతూ ఉంటాడు. తన వెలుగుతో ఇతరులకు దారి చూపుతూ ఉంటాడు.

ఒక వ్యక్తిలో మానవత్వపు గుణగణాలు కనిపించకపోతే, అతడు శోక-సంతాపాలతో, దైన్య-దారిద్ర్యాలతో, చింతా-నిరాశలతో కూడిన జీవితం గడుపుతూ ఉంటే - అతనిలో భగవంతుడు ఉన్నాడని ఎలా చెప్పగలం? అయినా, అతనిలో దైవాంశ లేదనీ చెప్పలేము. ప్రతి జీవిలో దైవాంశ ఉంది. ప్రతి

**ఉత్కృష్ట ఆదర్శవాదముల సమాహారమే పరమాత్మ.**

జీవిలో బ్రహ్మ సత్తా ఉంది.

ఈ వైరుధ్యాన్ని తొలగించడానికై మనం ఇలా చెప్పవచ్చు. అతనిలో భగవంతుడు ఉన్నాడు. కాని నిద్రావస్థలో ఉన్నాడు. క్షీరం (పాలు) వంటి ఉజ్వలమైన ఆలోచనల సాగరంలో భగవంతుడు నివసిస్తాడు. క్షీరసాగరమే ఆయన లోకం. ఒక వ్యక్తి మెదడులో పాలవంటి తెల్లని, స్వచ్ఛమైన ఉజ్వలమైన ప్రవృత్తులు నిండి ఉంటే, అతడి అంతరంగం పాలసముద్రం అని చెప్పవచ్చు. దానిని భగవానుని లోకంగా పరిగణించాలి. పాలసముద్రంలో వెయ్యిపడగల ఆదిశేషునిపై విష్ణుమూర్తి శయనించి ఉన్నాడనే పురాణ వర్ణనలలోని రహస్యం ఇదే.

## శంఖ చక్ర గదా పద్మముల అర్థం

విష్ణుమూర్తి చేతిలోని శంఖం అంటే ధ్వని, వాక్ శక్తి ఇతరులను మేలుకొలిపే, తట్టిలేపే, ప్రభావితం చేసే సామర్థ్యం.

చక్రం అంటే గతి శీలత; పరివర్తన జరిపేశక్తి.

గద అంటే దండన; అవాంఛనీయ, అనుచిత పరిస్థితులను అణచివేసే నిర్మూలించే సంస్కరించే సామర్థ్యం.

పద్మం అంటే సౌందర్యం, శోభ, సుగంధం, మాధుర్యం, సౌమ్యత, సజ్జనత్వం, సహృదయత, ఔదార్యం, సంయమనం మున్నగు సద్గుణాలు పుష్కలంగా ఉండడం.

విష్ణుమూర్తి యొక్క నాలుగు చేతులలో ఈ నాలుగు ఆయుధాలు ఉన్నాయి. ఒక వ్యక్తిలో భగవంతుడు మేలుకొని ఉంటే, క్రియాశీలంగా ఉంటే – అతనిలో పై నాలుగు గుణాలూ ప్రత్యక్షంగా కానవస్తాయి.

## భగవంతుడు ఉన్నచోట విభూతులు

లక్ష్మీదేవి విష్ణుమూర్తి భార్య, భగవంతుడు ఉన్నచోట విభూతులు, సిద్ధులు, విశేషతలు, సాఫల్యాలు, సద్భావనలు పుష్కలంగా కానవస్తాయి. లక్ష్మి అంటే విభూతి. ఆమె విష్ణుమూర్తి భార్య. మహాపురుషుల వద్ద గొప్ప మహిమలు ఉంటాయి. దారిద్ర్యం దుర్జనుల వాటాలోకి వస్తుంది. సజ్జనులు అపరిగ్రహులుగా ఉండవచ్చు. అది వారి స్వేచ్ఛ, వారి సౌలభ్యం, వారి అభిరుచి. వారిపై ఎలాంటి కొరతా రుద్దబడజాలదు.

## నారదుడు, హయగ్రీవుడు దైవీశక్తులు

నారదుడు, హయగ్రీవుడు మున్నగు దేవతలు విష్ణుమూర్తి చుట్టూ ఉంటారు. దీని అర్థం – విష్ణుమూర్తితో లక్ష్మీదేవితోపాటు అనేక దైవీ శక్తులు కూడ సహాయంకోసం నిలిచి ఉంటాయి. నారదుడు సాత్విక శక్తులకూ, జ్ఞాన విజ్ఞానాలకూ, వర్చస్సుకూ ప్రతీక. హయగ్రీవుడు బల పరాక్రమాలకూ, పురుషార్థానికీ, వైభవానికీ, సాహసానికీ, సకామ మహత్తుకూ ప్రతినిధి. విష్ణుమూర్తి, లక్ష్మీదేవి ఉన్నచోట సత్వ రజో గుణములు సమృద్ధిగా ఉంటాయి. దైవభక్తులూ, ఆస్తికులూ, ఆత్మధర్ములూ అయిన వ్యక్తులు విష్ణుమూర్తి, లక్ష్మీదేవి, దేవతాగణాలు, క్షీరసాగరం, ఆదిశేషుడు వంటి దివ్యసత్తాలు తమ అంతరంగాలలో ప్రతిష్ఠితులు అయినట్లు చూడగలుగుతారు. మేలుకొన్న వారి మస్తిష్కాలలో పై విశేషతలన్నీ నిలిచి ఉంటాయి. వారి వ్యక్తిత్వములు కాంతివంతములుగా, అనుకరణీయములుగా, చరిత్రాత్మకములుగా, చిరస్మరణీయములుగా నిలచి ఉంటాయి. ఉత్కృష్ట ఆలోచనలతో ఆదర్శవాదంతో కూడిన వారి క్రియాశీలత వారిని నరపశువుల స్థాయి నుండి నర నారాయణుల స్థాయికి కొనిపోతుంది.

శేషశాయి అయిన విష్ణుమూర్తి వర్ణనలో గొప్ప అంతరార్థం ఉంది. సహస్రార కమలం మేలుకుంటే, వ్యక్తి తనలోపల విష్ణుమూర్తినీ, ఆయన సమస్త వైభవాన్నీ చూడగలుగుతాడు; సిద్ధపురుషుడు కాగలుగుతాడు.

శ్రీకృష్ణుడు గోపికలతో పాటు రాసలీల జరపడంలో వేణుగానం చేయడంలో కూడ అంతరంగంలోని సమస్త భావ తరంగాలను సమ సత్తాతో నింపడం అనే సంకేతం ఉంది. స్నానం చేస్తున్న గోపికల వస్త్రాలను తీసుకుని పారిపోవడంలో వారిని నగ్నంగా ఉంచడంలో అంతరార్థం ఉంది. తాంత్రిక సాధనలలో "భైరవీ చక్ర" సాధన అశ్లీలం కనుక దానిని అతి రహస్యంగా ఉంచుతారు. రామకృష్ణ పరమహంస తాంత్రిక గురువు మహాయోగిని ఆయన చేత "కుమారీ పూజ" సాధన చేయించింది. ఆ పూజలో పాల్గొనడానికి ఆయన భార్య శారదాదేవి అతికష్టంమీద ఒప్పుకున్నారు.

**నిస్సహాయులను ఉపేక్షించడం పరమేశ్వరుని పిలుపును నిరాదరించడమే.**

ఆధ్యాత్మికతలో కామశాస్త్రం కూడ ఉంది. దాని ప్రకారం కన్య అయిన కుంతీదేవి దేవశక్తులను ఆహ్వానించి, సూర్యుని ప్రసాదంగా కర్ణుడిని, ఇంద్రుని ప్రసాదంగా అర్జునుడిని, యమధర్మరాజు ప్రసాదంగా ధర్మరాజును, వరుణుని ప్రసాదంగా భీముడిని సృష్టించింది. హనుమంతుని తల్లి అంజనీదేవి. తండ్రి మరుత్తు (వాయుదేవుడు) కనుక అతడు మారుతి అయినాడు.

ఈ శాస్త్రం వెనుక విస్తృతమైన విజ్ఞానం ఉంది. అయితే అది ప్రత్యేకమైన యోగ్యత కలిగిన వారికే పరిమితం చేయబడింది.

భాగవతంలో కాళియ మర్దనం, కాళియుని భార్యలు ఇద్దరూ శ్రీకృష్ణునికి అనేక బహుమతులు ఇచ్చి ఆయనను ప్రార్థించడం అనే కథ ఉంది. శ్రీకృష్ణుడు విష్ణుమూర్తి అవతారం. ఆ మహాసర్పాన్ని ఆయన మాత్రమే నియంత్రణ చేయగలిగాడు. మన మనోవ్యవస్థ ఒక మహాసర్పం. అది విజృంభిస్తే విషం క్రక్కుతుంది; సర్వనాశనానికి సన్నాహాలు చేస్తుంది. దాన్ని అదుపు చేస్తే - దాని భార్యలు బుద్ధి, సిద్ధి ఇద్దరూ లెక్కలేనన్ని బహుమతులను తీసుకుని వచ్చి ప్రార్థన చేస్తారు.

భూభారాన్ని ఆదిశేషుడు తన పడగలపై మోస్తున్నాడనే వర్ణన పురాణాలలో ఉంది. పైన చెప్పబడిన మహాసర్పమే జీవితానికి ఆధారం ప్రాణం యొక్క అగ్ని కణములన్నీ దాని నోటిలో దాగి ఉన్నాయి. మహాప్రాణం యొక్క అధిపతి అదే.

ఇలా మన పురాణ కథలలో ఆలంకారికంగా కుండలినీ జాగరణనూ, దానివల్ల కలిగే అద్భుత శక్తులనూ వర్ణించారు. కుండలినిని మేలుకొలుప గలిగితే, మనిషి దేవతలతో సమానుడు అవుతాడు; దైవీశక్తులకూ, విభూతులకూ స్వామి అవుతాడు. విశాల సంపదను తనకోసం, మొత్తం సమాజం కోసం వినియోగిస్తాడు. ఆ సంపదను పెంచి పోషిస్తాడు. అయితే, ఇందుకోసం ధర్మాచరణ అనే మూలాధారం అవసరం. ధర్మాన్ని కాదని ధనాన్ని సంపాదించే మనిషి ఒక ప్రక్క ప్రకృతి సంపదను అవివేకంగా దోచుకుని, పర్యావరణ సమతూకాన్ని నాశనం చేస్తాడు, మరోప్రక్క - తన క్షణిక లాభం కోసం భ్రమలో పడి తనకూ సమాజానికీ ఎన్నెన్నో రోగాలనూ, కష్టాలనూ సృష్టిస్తాడు. ఇదంతా నేడు జరుగుతూన్నదే. ప్రకృతి నుండి, సమాజం నుండి తీసుకున్న దానికన్న ఎక్కువగా ధన సంపాదన ద్వారా వాటికి ఇవ్వాలి. ధర్మం చూపే మార్గం ఇది. మన యజ్ఞ పరంపర ఈ ఉత్కృష్ట భావనపై ఆధారపడి ఉంది.

★★★

## జలియన్‌వాలాబాగ్

1919 ఏప్రియల్ 13వ తేదిన అమృతసర్‌లోని జలియన్‌వాలాబాగ్‌లో గుమికూడిన ప్రజాసమూహముపై తెల్లప్రభుత్వ అధికారులు మరతుపాకులతో కాల్పులు జరిపారు. ఆ మరునాడు ఉదయమే భగత్‌సింగ్ పాఠశాలకు వెళ్ళాడు. భగత్‌సింగ్ చిన్న చెల్లెలు అమృత తన సోదరుని అప్పటి మనోదశను ఇలా వర్ణించి చెప్పింది- 'అతడు స్కూలుకు వెళ్ళనే లేదని తరువాత తెలిసింది. అతడు సరాసరి జలియన్‌వాలాబాగ్‌కు వెళ్ళాడు. ఇంటికి వచ్చేసరికి బాగా ఆలస్యం అయింది. ఇంట్లో అందరూ దిగులుపడి ఉన్నారు. ముఖం వ్రేలాడవేసుకొని ఎంతో సేపటికి ఇంటికి వచ్చాడు. అన్నా, ఇంత ఆలస్యం అయిందేమిటి? అని నేనడిగాను. జవాబు చెప్పాడు- ఏమి తెచ్చానో చూడు. ఏమి తెచ్చావు? అని నేనడిగాను. అన్న జేబులో నుండి ఎర్రగా కనిపిస్తున్న ఒక సీసాను బయటకు తీసాడు. చూశావా ఇందులో జలియన్‌వాలాబాగ్‌లోని మట్టి ఉంది. నెత్తురుతో కూడిన మట్టి ఇది. తెల్లవాళ్ళు నిరాయుధులైన మన దేశీయులను హతమార్చారు. ఎంతమంది మరణించి ఉంటారో! అని అన్నాడు. అక్కడ ఏమి చూశాడో, ఏది విన్నాడో అది అంతా తడబడుతూ చెప్పాడు. ఆరోజున అన్న ఆహారం ముట్టలేదు. తోటలో నుండి చాలా పూలు తెచ్చి ఆ సీసాను అలంకరించాడు. దానికి ప్రణమిల్లాడు. లోపల ఏవేవో గొణుక్కున్నాడు. బహుశా మనస్సులోనే ఒక నిశ్చయం చేసుకొని ఉంటాడు. చాలా రోజుల వరకు ఆ సీసాకు భక్తి కుసుమాలు సమర్పిస్తుండేవాడు.

ఆ హుతాత్ముల రక్తంతో ఆయనకు సన్నిహితమైన సంబంధం ఏర్పడింది. అందుకే ఆయన తాను కూడా హుతాత్ముడైనాడు.

**దేవుని నుండి పొందడం, ప్రాణులకు పంచడం - ఇందులోనే ఉన్నాయి సంపన్నత, సమర్థత, జీవన సార్థకత.**

తత్వచింతన

# భక్తి, జ్ఞానం పరస్పర పూరకాలు

## రెండు రెక్కలు, రెండు తీరాలు

జ్ఞానమంటే అర్థం ఉత్కృష్టమైన చింతన. భక్తి అంటే సంవేదన, భావన. ఇవి రెండు ప్రవాహాలు. ఇవి పక్షికి ఉండే రెండు రెక్కలు. నావకు ఉండే రెండు తెడ్లు. నదికి ఉండే రెండు ఒడ్డులు. జీవన చైతన్యం వీటి మధ్య ప్రవహిస్తూ ఉంటుంది. ఈ రెండూ తగువిధంగా వికాసం పొందినప్పుడే జీవితంలోనికి పరమాత్మయొక్క దివ్య ప్రకాశం దిగి వస్తుంది. పరమ స్థితి, సిద్ధ స్థితి లభిస్తాయి. ఈ రెండూ సంగమించినప్పుడు పూర్ణత్వం, సమగ్రత చేకూరుతాయి.

## జ్ఞానానికి శిఖరాగ్రం భక్తి

జ్ఞానం భక్తికి ప్రారంభం. భక్తి జ్ఞానానికి శిఖరాగ్రం. జ్ఞానం పొలాన్ని సారవంతం చేస్తుంది. ఇందుకోసం అది బీడులో మొలచిన కుసంస్కారాలు అనే కలుపుమొక్కలను నిర్మూలిస్తుంది. దానికి నీళ్లు పెడుతుంది. ఎరువు వేస్తుంది. ఇలా తయారైన పొలంలో భక్తి బీజాలను నాటుతాము. విత్తనం మొలకెత్తి పంట పండాలంటే సారవంతమైన భూమి, మేలురకం విత్తనాలు – రెండూ అవసరమే. చింతన తీక్షణంగా ఉండి భావన లేకపోతే– జీవితం నీరసంగా, శుష్కంగా ఉండిపోతుంది. వికాసం లోపిస్తే, భావన గ్రుడ్డిది అవుతుంది. జీవితం గాడి తప్పుతుంది.

జ్ఞానం బుద్ధినుండి జనిస్తుంది. భక్తి హృదయపు లోతులనుండి జనిస్తుంది. జ్ఞానంవల్ల బుద్ధి సంస్కరించబడుతుంది. క్షాళన పొందుతుంది. కానీ, భక్తి లోపిస్తే, జ్ఞానం పుష్పించదు, ఫలించదు, వికసించదు. ప్రభువును చేరే పథంలో ఎదురయ్యే బాధలను, కష్టాలను, ఆటంకాలను జ్ఞానం తగ్గిస్తుంది, తొలగిస్తుంది. అయినా, భక్తి అనే మెట్లమీదుగానే అక్కడికి చేరగలుగుతాము. జ్ఞానం వ్యర్థమైన వాటిని తొలగిస్తుంది. నిరర్థకమైన వాటిని నిర్మూలిస్తుంది. అనర్థాలను నశింపజేస్తుంది. అయితే దానికి సార్థకత భావన ద్వారా చేకూరుతుంది. దాని సమగ్రత భక్తిలో లభిస్తుంది.

## భక్తికి రక్షణ కవచం జ్ఞానం

జ్ఞానంలో తీక్షణత ఉంది, తేజస్సు ఉంది. అయితే అది ఎడారిలోని మండుటెండవంటిది. అందులో స్వచ్ఛత ఉంది, పవిత్రత ఉంది. కాని, అది నిర్జీవమైనది. దానిలో వ్యాపకత్వం ఉన్నది కాని ఎత్తూ లేదు, లోతూ లేదు. జ్ఞానం దానికదిగా శుష్కము, నీరసము, ఏకాకి అయినది. మరోప్రక్క – భక్తి అనే భావనా ప్రవాహంలో జీవితం వికసిస్తుంది. అయితే ఆ వికాసం ఏకపక్షమైనది. పాక్షికమైనది. భక్తివల్ల జీవితంలో చెట్లు పెరుగుతాయి. పూలు పూస్తాయి. పచ్చదనం పెరుగుతుంది. అయితే ఆ పచ్చదనాన్ని కాపాడడానికి సాధనం ఏదీ ఉండదు. రక్షణ కవచం ఏదీ ఉండదు. వికాసంతో కూడిన జ్ఞానమే ఈ పచ్చదనాన్ని రక్షించే కంచె.

భావనలు సారవంతమైన భూమి. దున్నిన భూమి. నీరూ, ఎరువూ అందిన భూమి. ఇందులో విత్తనాలు అంకురిస్తాయి. ఆ విత్తనాలు ముళ్లతో కూడిన తుమ్మవి అయినా, చేదయిన వేపవి అయినా, నీడనూ పండ్లనూ ఇచ్చే మామిడివి అయినా. భావనలో సత్య బీజాలూ అంకురిస్తాయి. అసత్య బీజాలూ అంకురిస్తాయి. విశ్వాసమూ మొలుస్తుంది సందేహమూ మొలుస్తుంది. ప్రేమ, దయ వికసిస్తాయి. ద్వేషమూ, వైమనస్యమూ వికసిస్తాయి. కనుక, సారవంతమైన భూమిలో సత్యం–శ్రద్ధ – విశ్వాసం – నిష్ఠల విత్తనాలు అంకురించాలంటే, భావనలకు వివేకయుక్తమైన బుద్ధి అనే రక్షణ, నిఘా అవసరం అవుతుంది.

## జ్ఞానం కత్తి, భక్తి డాలు

భావన జ్ఞానమనే దారిలో నడవకపోతే, దాని పునాది బలహీనంగా ఉంటుంది. భక్తి అనే భావన ఎప్పుడూ ఊగిపోతూ ఉంటుంది. పెను తుపాను రాకపోయినా, చిన్నగాలి వీచినా– అది కూలిపోయే ప్రమాదం ఉంది. సాధారణంగా భక్తికి నమ్మడమే తెలుస్తుంది. శ్రద్ధ కలిగి ఉండటమే తెలుస్తుంది. అది సత్యపథంలో నడిపించేవారినీ నమ్ముతుంది. పథభ్రష్టులను చేసేవారినీ

**ఆశ గొప్ప వెలుగు; నిరాశ చిమ్మ చీకటి.**

నమ్ముతుంది. దానిలో సందేహమనే విత్తనం మొలకెత్తవచ్చు. అది తప్పుడు విషయాన్ని కూడ పట్టుకోవచ్చు. మంచి విషయాన్ని పట్టుకున్న విధంగా. దానికి ఆలోచన ఎక్కడ ఉంటుంది? ఎందుకంటే- ఇది శుద్ధభాషను కాక హృదయస్పందనను అనుసరిస్తుంది. హృదయంలో లేస్తూ పడుతూ ఉండే స్వరాల తీవ్రతను మాత్రమే అది గుర్తిస్తుంది. అది సరైనదే. దాని విశిష్టతే అది. దానిలో మహిమ ఉంది. అయితే అది సమగ్రం కాదు.

భావనలు మూగవి. బుద్ధి వదరుబోతు. ఈ రెండూ ఏకం కావడంలోనే పరమ సాఫల్యం ఉంది. జీవితమనే మహాసముద్రాన్ని జయించడానికై ఈ జంట అత్యవసరం. జ్ఞానమనే ఆయుధంతో దెబ్బకొట్టవచ్చు. భక్తి అనే డాలు లేనిదే మనల్ని మనం కాపాడుకోలేము. కనుక ఆలోచనలు ఎంత ప్రయోజనకరమైనవో భావనలు అంత ప్రయోజనకరమైనవి.

## ఆదిశంకరుల మేధ+బుద్ధుని కరుణ

కనుకనే విశ్వవిఖ్యాతి పొందిన స్వామి వివేకానంద ఇలా పేర్కొన్నారు-

"ఆది శంకరుల తీక్షణ మేధాశక్తి నాకు కావాలి. కరుణతో, భావనతో, సంవేదనతో పొంగి పొరలే బుద్ధుని హృదయమూ కావాలి నాకు."

ఈ రెంటింటిలో ఒకటి చాలదు. వీటిలో ఒకదానిని పొందిన వ్యక్తి పరిపూర్ణుడు కాలేడు. కనుకనే - జ్ఞాన విజ్ఞానములు సమస్తాన్నీ పొందినప్పటికీ, దేవఋషి నారదునిలో ఏదో అసంతృప్తి మిగిలిపోయింది. మరి దేనినో పొందాలనే ఆకాంక్ష, తహతహ, ఆరాటం ఆయనను కలచి వేశాయి. భక్తి అనే సోమరసాన్ని పానం చేసిన తర్వాతనే ఆయనలోని ఆ వ్యథ, ఆ అసంతృప్తి సమాప్తమయాయి. ఆయనలో జ్ఞానంతోపాటు భక్తి, భావనకూడ ఉదయించింది. ఆయన ఆ భావ తరంగాలలో తేలియాడారు. నారద భక్తి సూత్రాలు దాని ఫలితాలు.

## సౌందర్య లహరిలోని భక్తి గాంభీర్యం

ఆది శంకరులు మేధ ప్రజ్ఞలు మాత్రమే కలిగిన సన్యాసి కారు. ఆయన హృదయం విశాలమైనది. ప్రేమ, భక్తి ఆయనలో జీవించాయి. ఆయన రచించిన సౌందర్య లహరిలో భక్తిలోని నిగూఢత, గాంభీర్యం కదను త్రొక్కాయి.

బుద్ధిమార్గంలో దార్శనికత, తాత్వికత జన్మిస్తాయి. దీనివల్ల జీవితంలో తర్కమనే ఇసుక నిండిపోతుంది. ఆలోచన చాలా జరిగింది, ఎక్కడికీ చేరుకున్నది లేదు- అనే పరిస్థితి ఏర్పడుతుంది.

ఆలోచనలకు భావనలూ, చేసే సాహసమూ తోడయితే గమ్యాన్ని చేరుకుంటాం. మరోప్రక్క వట్టి భావన భావుకత అయిపోతుంది. భావుకత నీటి బుడగలాంటిది. దానిలో ఆకర్షణ ఉంటుంది. అయితే, ఆ బుడగ క్షణభంగురమైనది. సూర్యరశ్మి పెరగగానే అది ఆవిరై ఎగిరిపోతుంది. బుద్ధి, భావనల సంగమం జరిగినపుడు జీవితంలో ఆనందం వర్షిస్తుంది, సంగీతం నినదిస్తుంది. ఈ సంగమం మహాయోగాన్ని నిర్మిస్తుంది. ఈ సంగమం వల్ల మహాసమన్వయం సిద్ధిస్తుంది. అది కార్యరూపం ధరించినపుడు జీవితం ప్రభుమయం అవుతుంది.

జ్ఞానం-భక్తి, ఆలోచన-భావన అనే రెండు తెడ్లతో జీవితమనే నావ భావసాగరాన్ని దాటగలుగుతుంది. ఇవి బండికి ఉండే రెండు చక్రాలు. దానిని గమ్యానికి చేర్చే చక్రాలు. ఇవి జీవితమనే నదికి రెండు తీరాలు. జీవితం వాటి మధ్యనుండి ప్రవహించవలసి ఉంటుంది. ప్రవహించడానికి రెండు తీరాల ఆసరా అవసరం అవుతుంది. చివరికి తీరాలు రెండూ అంతం అవుతాయి. విలీనం అవుతాయి. నదీ ఉండదు. ప్రవాహమూ ఉండదు. తీరమూ ఉండదు. అన్నీ సాగరంలో జలమయం అయిపోతాయి. అయితే, ప్రభువు ద్వారాన్ని చేరుకోవడానికి ఆలోచన, భావన రెండూ అవసరమే.

ఇదే సాధన. ఈ సాధననుండే సిద్ధి, సమాధి జన్మిస్తాయి. మన చింతన ఉత్కృష్టంగా ఉంటే, మన భావన ఉత్కృష్టంగా ఉంటే ఇది సాధ్యపడుతుంది. అప్పుడే కర్మ శ్రేష్ఠమూ, నిష్కామమూ అవుతుంది. జీవనంలో సార్థక్యం, సమగ్రత సమకూరుతాయి.

కనుక - మనమంతా మన ఆలోచనల ద్వారా భావనల ద్వారా కర్మల ద్వారా ఈ శ్రేష్ఠత్వంవైపు నిరంతరం పురోగమిస్తూ ఉండాలి.

★★★

**అదృష్టంపై కాక - శీలంపై ఆధారపడు.**

# వ్యక్తినిర్మాణం

# సృజనాత్మకత, ఆధ్యాత్మికత

## మనిషి సామర్థ్యం అపారం

మనిషి పరమపిత పరమాత్మ యొక్క అంశ. అతడిలోని శక్తి సామర్థ్యాలు అపారమైనవి, అపరిమితమైనవి. అనంతములూ, అమూల్యములూ అయిన మహిమలతో కూడిన మానవ జీవనం అతి దుర్లభం. అందులో విభూతుల భాండాగారం నిండి ఉంది. సిద్ధులూ, సంత్‌లూ, మహాత్ములూ, మహాపురుషులూ మానవ జీవితంలోని అమూల్య శక్తులను మనకు పరిచయం చేస్తూ ఉంటారు. మనిషి ఎన్నడూ దీనుడుగా, బలహీనుడుగా, నిస్సహాయుడుగా, అసమర్థుడుగా ఉండజాలడు. ఈ లక్షణాలు అతడి నీడలు మాత్రమే. వాస్తవానికి - మానవ జన్మ పొందడానికై దేవతలు సైతం ఉవ్విళ్లూరుతారు. ఎందుకంటే- మనిషిలోని శక్తి సామర్థ్యాలు దేవతల శక్తి సామర్థ్యాలకన్న మిన్న అయినవి. మానవ జీవనంలోనే తపస్సు చేసే అమూల్యమైన అదృష్టం సాకారం అవుతుంది.

## సృజనాత్మకత, ఆధ్యాత్మికత

జీవితానికి ఆధారం శరీరం. శరీరం జీవితానికి వ్యక్తీకరణ. వ్యక్తిత్వం జీవితానికి దివ్య పరిమళం. ఈ వ్యక్తిత్వంలో అపరిమితములైన సామర్థ్యాలు ఇమిడి ఉన్నాయి. ఈ సామర్థ్యాలను నిశితంగా పరిశీలిస్తే - వీనిలో రెండు తత్వాలు ప్రధానంగా కానవస్తాయి. మొదటిది నిర్మాణాత్మక సామర్థ్యం. రెండవది ఆధ్యాత్మిక సామర్థ్యం.

నిర్మాణాత్మక సామర్థ్యం అంటే - తన అభిరుచిని గుర్తించడం, నిర్దిష్టమైన లక్ష్యం కోసం దానిని క్రమబద్ధంగా వినియోగించడం. వ్యతిరేక పరిస్థితులనుండి, ఆలోచనలనుండి తన శక్తిని వెలికితీసి, దానిని నైపుణ్యంతో ప్రణాళికా బద్ధంగా సద్వినియోగపరచడమే సృజనాత్మకత లేక నిర్మాణాత్మకత.

ఆధ్యాత్మిక సామర్థ్యం ఇంతకన్న లోతయినది, కష్టమైనది. ఈ సామర్థ్యం అత్యంత దుర్లభం; అయితే అసాధ్యం కాదు. ఇది ఆశించని రీతిలో, అకస్మాత్తుగా వ్యక్తం అవుతుంది; బూడిదనుండి జ్వాలను తిరిగి రగిలించగలుగుతుంది. ఈ ఆధ్యాత్మిక సామర్థ్యంతో ప్రారబ్ధాన్ని మలుపు త్రిప్పగలుగుతాము, మెలిత్రిప్ప గలుగుతాము.

నిర్మాణాత్మక సామర్థ్యం పురుషార్థం. ఆధ్యాత్మిక సామర్థ్యం మహా పురుషార్థం. మనందరిలో నిర్మాణాత్మక సామర్థ్యం ఇమిడి ఉంది. ఆధ్యాత్మిక సామర్థ్యం కూడ ఉంది. అయితే అది అందనంతగా కొంత ఎగువన ఉంది. అందరికీ అందేది కాదది.

## లక్ష్యంవైపు మళ్లే అభిరుచి

నిర్మాణాత్మకత పరిధిలోకి మనమంతా వస్తాము. ప్రతి వ్యక్తిలో కొన్ని గుణములు, సామర్థ్యములు ఉండి తీరుతాయి. వాటిని గుర్తించి, సరైన దిశలో ప్రయోగించి, మనిషి సాఫల్యపు శిఖరాగ్రాన్ని చేరగలుగుతాడు. మనం ఏమి చేయగలమో, ఏమి చేయలేమో అనే విషయం మనకు తెలియనపుడు మాత్రమే మనను గురించి మనకు తెలియనపుడు మాత్రమే- వైఫల్యం, సహాయ నిరాకరణ ఎదురవుతాయి. మన అభిరుచి ఎందులో ఉంది, మనం చేయగలిగేది ఏది- అనే విషయాన్ని మనం మొట్టమొదట గుర్తించాలి. మన అభిరుచికి అనుగుణంగా పనిచేసినపుడు సగం సాఫల్యం లభిస్తుంది. దానిని కౌశల్యంతో, నైపుణ్యంతో చేయడంపై మిగతా సగం సాఫల్యం ఆధారపడి ఉంటుంది.

సృజనాత్మక సామర్థ్యంలో మొట్టమొదట మన అభిరుచి సృజనలో, నిర్మాణ విషయంలో ఉంటుంది. ఆ తర్వాత మన లక్ష్యాన్ని సాధించడానికై మన సామర్థ్యంతో బయటి సాధన సంపత్తిని వెదుకుతాము. సాధనల హెచ్చు తగ్గులు తీవ్రమైన విజయకాంక్షకు సాధక బాధకములు కావు. సముచితంగా సద్వినియోగం చేయకపోతే, సాధనాలు సమృద్ధిగా ఉన్నా సాఫల్యం అందదు. నైపుణ్యంతో, పథకం ప్రకారం ఏకాగ్రతతో పనిచేస్తే సాధనాలు కొరవడినా సాఫల్యం ఆగదు. తీవ్రమైన కొరతలు ఉన్నప్పటికీ, పురోగమించి సాఫల్యపు శిఖరాగ్రాన్ని చేరుకున్న జీవం జవం కలిగిన కర్మవీరులూ, యోధులూ ప్రపంచ చరిత్రలో ఎందరెందరో కనిపిస్తారు.

## ఏకాగ్రతలో, నిష్ఠలో సాఫల్యం

ఏకాగ్రత, నిష్ఠ లోపించినపుడు సాధనాల సమృద్ధి విలాస

**కలసిమెలసి ఉండు, పంచుకుని తిను - నవ్వే నవ్వించే పరిస్థితి కల్పించు.**

జీవనానికి జన్మ ఇస్తుంది. ఏకాగ్రత, నిష్ఠ అనే లక్షణాలు పూరిగుడిసెను సైతం భవంతిగా మార్చే సాహసాన్ని చూపుతాయి. కష్టాలూ, ఆపదలూ వీటి మార్గానికి ఆటంకాలుగా నిలువవు; వీటిని మరింత బలీయం చేస్తాయి. ప్రతికూల పరిస్థితులు శారీరిక స్థితినీ, మానసిక స్థితినీ మాత్రమే నీరసపరుస్తాయి. కష్టాల అగ్నిజ్వాలలోనుండి చలించకుండా ముందుకు సాగే వ్యక్తి బంగారంవలె నిగ్గు తేలతాడు. భీషణమైన ప్రతికూల పరిస్థితులలో కూడ విజయ పతాకాన్ని ఎగురవేసే గుణమే సృజన. వ్యతిరేక పరిస్థితులకు గాబరాపడకూడదు. దృఢంగా నిలచి వాటిని ఎదుర్కొనాలి. సాఫల్యానికి ఆధారం ఇదే. సృజనాత్మక సామర్థ్యాన్ని చూపడం అంటే ఇదే.

## హఠాత్తుగా వచ్చిపడే ప్రారబ్ధపు విపత్తు

పురుషార్థం యొక్క బలంలో, కార్యశూరత యొక్క బలంలో నిర్మాణాత్మక సామర్థ్యం వ్యక్తం అవుతుంది. అయినా – ఒక్కొక్కపుడు నూటికి నూరుపాళ్లు కార్యశూరత చూపినప్పటికీ నిరాశ, వైఫల్యం ఎదురవుతాయి. తన సర్వస్వాన్నీ ఒడ్డినప్పటికీ, జీవితంలో కష్టాలూ, ఆపదలూ యథాప్రకారం నిలిచి ఉంటే– ప్రారబ్ధం ఆటంకంగా ఎదురవుతున్నదని గుర్తించాలి. ప్రారబ్ధం ఆశించని విధంగా అకస్మాత్తుగా వచ్చిపడుతుంది. ఇంతవరకు అంతా సవ్యంగా ఉంది. అకస్మాత్తుగా ఏదో జరిగి అంతా తలక్రిందులు అయింది. సునామీ తుఫాను వచ్చి అన్నింటినీ సముద్ర గర్భంలో కలిపివేసినట్లు– ప్రారబ్ధపు విపత్తు ఇలాగే వచ్చిపడుతుంది.

**ఆధ్యాత్మిక సామర్థ్యం ద్వారానే ఈ ప్రారబ్ధపు విపత్తు నుండి తప్పించుకోగలుగుతాము.**

ఆధ్యాత్మికత మనిషిలోని అంతఃచేతన యొక్క దివ్య వైభవం. ఆధ్యాత్మిక సామర్థ్యం ఎన్నడూ సమాప్తం కాదు. వాల్మీకి రామాయణంలో దీన్ని గురించిన రమణీయమైన వర్ణన ఉన్నది.

## సీతామాత విజయం ఆధ్యాత్మికం

తాను విజయం సాధించినట్లు రావణుడు భావించాడు. సీతాపహరణం అందుకు ప్రబల ప్రమాణంగా పరిగణించాడు. సీతామాతకు కూడ అవి నిరాశ నిండిన క్షణాలు. రావణుడు తన మాయోపాయాలతో రోజుకొక విచిత్రమైన దృశ్యం చూపాడు. అతడు ఒకసారి ఖండించిన రాముని శిరస్సును సైతం చూపాడు. కానీ, సీతమ్మవారు చలించలేదు. స్థిరంగా నిలబడింది. ఆ తర్వాత పరిస్థితులు మారాయి. అసాధ్యం సాధ్యపడింది. చివరికి ధర్మమే గెలిచింది. సత్యమే గెలిచింది. ఈ విజయంలోని రహస్యం ఆధ్యాత్మిక సామర్థ్యం.

## ప్రారబ్ధాన్ని మలుపుత్రిప్పే ఆధ్యాత్మిక సామర్థ్యం

దేవతలు సైతం మానవీయ సామర్థ్యానికి తలవంచుతారు. దేవతలు శక్తులన్నింటికీ యజమానులు. దేవతలను మంత్రాలద్వారా వశపరచుకోగలుగుతాము. తపస్వులైన సాధకులు మంత్రసిద్ధి పొందుతారు. మానవుని ఆధ్యాత్మిక సామర్థ్యం అపరిమితమైనది, నిరుపమానమైనది. తపస్సు ద్వారా ఈ సామర్థ్యాన్ని అభివృద్ధి చేయవచ్చు, వికసింపజేయవచ్చు. తపస్సు ద్వారా బ్రహ్మాండంలోని శక్తిని మనిషి తనలో ధారణ చేయగలుగుతాడు. ఘనీభవించిన, సాంద్రమైన ఈ శక్తితో మనిషి ముల్లోకాలలో ఏ పని అయినా సాధించడానికి సమర్థుడు అవుతాడు. **తపస్వులు కాలాన్ని తమకు అనుకూలంగా మార్చుకునే సామర్థ్యం కలిగి ఉంటారు. తపస్వులు తమ ఆధ్యాత్మిక సామర్థ్యంతో ప్రారబ్ధంతో ఆటబొమ్మతో ఆడుకున్నట్లు ఆడుకుంటారు.** ఆధ్యాత్మిక సామర్థ్యం అత్యంత దుర్లభం. అందుకు మహాపురుషార్థం అవసరం అవుతుంది.

మనిషి యొక్క అంతరాళంలో దివ్యశక్తుల భాండాగారం నిండి ఉంది. దానిని గుర్తించడం, సద్వినియోగపరచడం అవసరం. ఈ సామర్థ్యాన్ని నైపుణ్యంతో సద్వినియోగపరచితే – వ్యక్తి సాఫల్యపు సోపానాలను అధిరోహిస్తూ పోతాడు.

## సమగ్ర వ్యక్తిత్వ నిర్మాణం

సృజనాత్మక సామర్థ్యాన్ని వికసింపజేసుకుని భౌతిక సాఫల్యాన్ని పొందగలుగుతాము. ఆధ్యాత్మిక సామర్థ్యాన్ని సద్వినియోగపరచుకుని ఊహాతీతము, అత్యద్భుతమూ అయిన ప్రపంచంలో ప్రవేశించగలుగుతాము.

ఈ రెండు అంశములనూ వ్యక్తిత్వంలో వికసింపజేసుకుని, మనిషి సమగ్ర వ్యక్తిత్వాన్ని నిర్మించుకోగలుగుతాడు.

★★★

**ప్రేమ, ఆత్మీయతలతో పొంగిపొరలే హృదయమే ప్రత్యక్ష స్వర్గం.**

మహిళా జాగరణ

# ఆది గురువు మహిళ

మాతృ ప్రేమ వర్ణ వర్గాల కతీతమైందనీ, అందులో త్యాగం నిబిడీకృతమై ఉందని, బాల్యం నుండి వార్ధక్యం వరకు ఆ ప్రేమామృత ఝరిలో ఓలలాడని బిడ్డ దురదృష్టవంతుడని చెప్పవచ్చు. ఆమె అమృతమయే కాదు. ఆది గురువు కూడా. అవసరమైతే ఆది శక్తిలా శాసించి బిడ్డలను సంస్కరించగల ధీశాలి.

భూమివలె స్త్రీ గర్భధారణ సమయంలో తన రక్తమాంసాదులతో గర్భస్థ శిశువును పోషిస్తుంది. కన్ను తెరవని ఆ పసిగుడ్డు ఆరోగ్య సంరక్షణ కోసం తన ఆహార విహారాల్లో నియమాలను పాటిస్తుంది. అంటే పుట్టుకకు ముందు నుండే తన శిశువు యొక్క పాలన స్వీకరిస్తుంది. అందుకే మాతృస్వరూపిణిగా అనాదిగా అగ్ర పీఠ మధిష్టించి మాతృదేవోభవ అంటూ తొలివందనం అందుకొంది.

భారతంలో గర్భస్థ శిశువుగా అభిమన్యుడు పద్మవ్యూహం గురించి తెల్సుకున్నట్లు, గర్భిణిగా ఉన్న హిరణ్యకశిపుని భార్య లీలావతికి నారదుని భక్తి బోధల వల్లనే ప్రహ్లాదుడు విష్ణు భక్తుడుగా జన్మించినట్లు ఇతిహాసం. కనుక బిడ్డలు గర్భంలో ఉన్నప్పటి నుండి తల్లి యొక్క భౌతిక ధర్మాలతో బాటు మానసిక శక్తులకు ఔరసులు. అంతే కాదు గర్భిణి సమయంలో ఆమె సంకల్ప ముద్ర వారిపై పడుతుంది. అందుకే స్త్రీల మనస్సు ప్రశాంతంగా ప్రఫుల్లంగా ఉండాలని దృశ్య శ్రవణ విషయాలు కూడా ఉదాత్తంగా ఉండాలని చెప్పారు పెద్దలు. ఆనాటి ఇతిహాసాలే కాదు, నేటి సైన్సు కూడా అంగీకరించిన విషయమిది. ఒక స్త్రీ తన బిడ్డను డాక్టరు దగ్గరకు తీసుకువచ్చి ఈ బిడ్డ నిద్రలో కూడా నిమిషానికోసారి ఉలిక్కిపడుతుంటాడని ఒక్కోసారి బిగ్గరగా ఏడుస్తాడని చెప్పిందట. అన్ని టెస్టులు చేసినా డాక్టరుకు కారణం తోచక నువ్వెక్కడ వుంటావు? ఏం పనిచేస్తావు తల్లీ అనడిగాడట. అందుకామె తాను టెలిఫోన్ ఆపరేటర్‌గా ఉద్యోగం చేస్తున్నట్టు అప్పుడప్పుడు నైట్ డ్యూటీలు కూడా చేయవలసి వస్తుందని చెప్పిందట. అప్పుడు డాక్టరుకా పిల్లవాడి పరిస్థితి అర్థమైంది. ఫోన్ ట్రింగుమని రింగైనప్పుడల్లా గర్భంలో ఉలిక్కిపడటం వల్ల, రాత్రి డ్యూటీ చేసి వెళ్లేటప్పుడు ఆమె ఆందోళనా ప్రవృత్తికి ప్రభావితుడవడం వల్ల ఆ బిడ్డ చిన్న ధ్వనికి కూడా ఆందోళనతో అరవటం స్వభావ సిద్ధమైందన్న మాట!

ఇక పుట్టిన బిడ్డకు అమ్మ, అత్త అనే పదాలు పల్కించటంతో మొదలౌతుందామె బోధన. పసితనంలో తప్పటడుగులను, పెద్దయేటప్పుడు తప్పుడడుగులను సరిదిద్దుతూ ఉత్తమునిగా తీర్చిదిద్దే మహాశిల్పి మాత! ఉగ్గుపాలతో బాటు సనాతనాభిధారలను జీర్ణింపచేస్తుంది. ఆటపాటలతోబాటు సంస్కారాలను కథలుగా గాథలుగా విన్పిస్తూ లాలిస్తుంది. ఉదయాన్నే చంటిబిడ్డకు ఉగ్గుపెడుతూ జీర్ణం వాతాపి జీర్ణం... అంటూ ఆ రాక్షసుడు కడుపులో జీర్ణమైనట్టు తన బిడ్డ జీర్ణశక్తి పెరగాలని కోరుకుంటూ ఆ కథను గుర్తు చేస్తుంది. నిజానికీనాటి తల్లులకు చాలామందికి ఆ కథ తెలియదు. ఓ చెంచాడు గ్రైప్ వాటర్ త్రాగించటం తప్ప కాళ్ళు చాచి బిడ్డను పడుకోబెట్టుకుని ఉగ్గుపట్టే తల్లులే కరవౌతున్నారు. అలా బిడ్డను కాళ్ళ మీద పడుకోబెట్టుకోవడంలో కూడా చక్కని ఆరోగ్య సూత్రముంది. కాళ్ళనోసారి, చేతులనోసారి ముడుస్తూ చాచుతూ చిరు వ్యాయామం చేయిస్తారు. అది కూడా పాటలతో పరవశింపజేస్తూ, గుఱ్ఱం తిన్న గుగ్గిళ్ళు జీర్ణం, ఏనుగు తిన్న వెలగపండు జీర్ణం పాపాయి త్రాగిన పాలు జీర్ణం అంటూ... కుందిలాగ కూర్చుని, నత్తలాగ ప్రాకి, నందిలాగ నడిచి, లేడిలాగ పరుగెత్తి – అంటూ తన బిడ్డ పెరుగుదల క్రమాన్ని తల్చుకుంటుంది. రోలు క్రింది భాగాన్ని కుంది అంటారు.

మనస్సును విచ్చలవిడిగా తిరగనిస్తే – దక్కేవి పతన పరాభవాలే.

అది స్థిరంగా ఉంటుంది. తన బిడ్డ ముందు అలా బ్యాలెన్సుగా కూర్చోవాలి. ఆ తర్వాత మెల్లగా నత్తలాగా పారాడుతూ, మెల్లగా నడుస్తూ లేడిలాగ ఛంగుఛంగున పరుగెత్తాలని కోరుకుంటూ వ్యాయామం చేయిస్తుంది. ఇక స్నానం చేయించేటప్పుడు తలంటుతూ అమ్మ కడుపు చల్లగా, అత్త కడుపు చల్లగా, లెక్కలేనంత సొమ్మెట్టుకుని, పుట్టు పుట్టం కట్టి బతకరా నూరేళ్లు నిండుగా – అంటూ తన దీవెనలను పాట రూపంలో పొందుపర్చుతుంది. ఇటు తన వంశం, అటు చేసుకోబోయే పిల్ల వంశానికి ఆనందం కల్గేలా తన బిడ్డ నిండుగా నూరేళ్ళు సుఖంగా బ్రతకాలని కోరుకుంటుంది. ఇక బిడ్డను ఊయలలో ఉంచి ఊపుతూ రామాయణ, భారత కథల్ని లాలిపాటలుగా జోలపాడుతూ నిద్ర పుచ్చుతుంటారు.

**"ఉత్తముడు దశరథుడు ఊరు అయోధ్య**
**సత్యపురుషుని కన్న సాధ్వి కౌసల్య"**

అంటూ రాముని పుట్టుకతో మొదలెట్టి –

**చిట్టి ముత్యము పుట్టె సీత గర్భమున**
**స్వాతి వానలు కురిసె సంద్రాల మీదా**

అంటూ లవకుశల జననం వరకూ పాడుతుంటే బాలప్రహ్లాదుడి జన్మలా బాల్యం నుండీ ఆ బిడ్డ జన్మ పునీతమౌతుంది.

ఇక భాగవతాన్ని కూడా

**"జో అచ్యుతానంద జోజో ముకుందా**
**లాలి పరమానంద రామగోవిందా**
**అంటూ మొదలెట్టి**
**తొలుత బ్రహ్మాండంబు తొట్టి గావించీ**
**నాలుగూ వేదములు గొలుసులమరించీ**
**బలమైన ఫణిరాజు పానుపమరించీ**
**చెలియ డోలికలందు చేర్చి లాలించి జోజో"**

అని పాడుతూ ఆశువుగా ఆధ్యాత్మికతను జోడించి పాడుతుందా తల్లి. ఆ భావ మధురిమకు, మధురాలాపనకు ఈ తరం పెట్టి పుట్టలేదేమో నన్పిస్తుంది. ఇలాగే దేవుళ్ళ పేర్లు, వస్తువుల పేర్లు, సంఖ్యలు, నెలలు, జంతువులు ఒకటేమిటి బాల సాహిత్యమంతా పాటల రూపంలోనే వింటూ మదిలో భద్రపర్చుకుంటారా చిన్నారులు. సంస్కృతిపరమైన విషయాలెన్నో పసితనంలో వంటబడతాయా బిడ్డలకు. అలాంటి మాత లాదర్శం కావాలీనాడు. అయితే అసలీనాడు సంస్కృతి అనే పదానికి సరియైన అర్థం తెలియని తల్లులెందరో ఉన్నారన్నా అతిశయోక్తి కాదు. సంస్కృతికి అర్థమడిగితే కల్చర్ అనేస్తారంతే! పోనీ ఈ కల్చర్ అనే పదమెక్కడి నుండి వచ్చిందని యోచిస్తే కల్టివేషన్ నుండి. కల్టివేషన్ అంటే వ్యవసాయము, కృషి అని అర్థం మన మాతృభాషలో.

ఒక రైతు వ్యవసాయం చేసి పంట పండించడాని కెంత కృషి చేస్తాడో మనకు తెల్సు. క్షేత్రాన్ని బాగా దున్ని, అదనులో గింజలు వేసి, అవి మొలకెత్తాక వాటితోబాటు పెరిగిన కలుపు మొక్కల్ని ఏరివేసి, ఏపుగా పెరగటానికి ఎరువు వేసి, పెరిగిన సస్యరక్షణకు కంచె వేసి ఎంతో కష్టపడితేగాని పంట ఇల్లు చేరదు. సంస్కారం పండించటంలో తల్లి కృషి ఇంతకంటే తక్కువేమీ కాదు. పిల్లల మనోక్షేత్రాల్ని తన బుద్ధి అనే నాగలితో దున్ని, అనువైన వేళలో వారి మనసెరిగి సంస్కార బీజాలు నాటి, అవి మొలకెత్తాక చెడు స్నేహాలనే కలుపు మొక్కల్ని దూరం చేసి, వారిలో పెరిగే మంచి భావాలకు ఊపిరి పోసి, కథలు పాటలనే ఎరువుల నందిస్తూ వారి మనసులో సంస్కారం పండిస్తుంది. మానుగా వంగని మొక్కలను తొలిదశలోనే వంచే నేర్పరియైన తోటమాలిగా బిడ్డలను మలిచి వారికి తానే తొలి గురువై వారిని జాతి రత్నాలుగా తీర్చిదిద్దే సమర్థత గల ధీశాలి. అందుకే మహర్షి మనువు –

**ఉపాధ్యాయాన్ దశాచార్యః**
**ఆచార్యాణాం శతం పితా ।**
**సహస్రంతు పితౄన్ మాత**
**గౌరవేణాతి రుచ్యతే ॥**

**సంకుచిత స్వార్థపరత్వం తరిగితే, సత్ప్రవృత్తులు సునాయాసంగా పెరుగుతాయి.**

అంటూ పదిమంది ఉపాధ్యాయులకంటే ఒక ఆచార్యుడు, వందమంది ఆచార్యులకంటే ఒక తండ్రి, వేయిమంది తండ్రులకంటే ఒక తల్లి ఉన్నతురాలన్నారు బోధనలో. ఆమె యొక్క సచ్ఛీలతా ప్రభావానికి ప్రతిబింబాలామె బిడ్డలు. అందుకే ఒక స్త్రీ విద్యావంతురాలైతే కుటుంబమంతా విద్యావంతమైనట్లేనన్నారు మహాత్ములు. ఇక్కడ విద్య అంటే కేవల మక్షర జ్ఞానమే కాదు. విద్ అంటే జ్ఞానము. ఈ జ్ఞానము శాస్త్రగతము, పరంపరాగతము. దాన్ని తమ బిడ్డల ద్వారా భావితరాలకు వారసత్వంగా అందించే భాగ్యదాతలు మాతలే! కనుక సుసంస్కృతి సజీవత్వానికి మూలవిరాట్టు మాత!

కాన్కగా తన వద్దకు పంపబడిన ముస్లిం సుబేదారుని అందమైన కోడల్ని సత్కరించి సోదర వాత్సల్యంతో గౌరవించి తిరిగి ఆమె భర్త వద్దకు గౌరవంగా పంపిన శివాజీలోని మహోన్నత వ్యక్తిత్వాన్ని మలచిన ఖ్యాతి జిజియామాతదే! స్త్రీ అంటే సెక్స్ సింబల్‌గా భావించే పలువురు పాశ్చాత్యులకిది అర్థం కాని విషయమైనా మనం తప్పక గుర్తుంచుకొనవలసిన విషయం. సత్యం అహింస అనే రెండు మాటలనే మారణాయుధాలుగా చేసి ఆంగ్లేయుల్ని పరుగు లెత్తించిన బాపూకు మాటలు నేర్పింది తల్లి పుతలీబాయి. ఒక మంచి తల్లి వందమంది ఉపాధ్యాయులకు సమానురాలట. గురువు పాఠాలలోని విషయాలను మాత్రమే చెప్పగలడు. తల్లి జీవితమనే పుస్తకంలోని తన అనుభవాలనే పాఠాల జ్ఞానాన్ని బోధించి వ్యక్తిత్వ సౌష్టవాన్ని పెంచుతుంది. అందుకే మాత సమాజ నిర్మాత. అక్షర జ్ఞానవే కాక ఆచారాలు, సంప్రదాయాలు, అందులో నిహితమైన ఆరోగ్య సూత్రాలు అన్నింటినీ చెప్పకనే చెప్తుంది బిడ్డకు. అందుకామె ఎంతో ఓర్పు నేర్పు కల్గి ఉంటుంది. చిన్నపిల్లలకు జిజ్ఞాస ఎక్కువ. ప్రతి విషయం తెల్సుకోవాలనుకుంటారు. ఎక్కువ సమయం బయట గడిపే పురుషునికి వాళ్ళను సమాధానపర్చే సమయముండదు. కనుక వారు తల్లినే ఆశ్రయిస్తారు. ఎన్నో ప్రశ్నలు వేస్తుంటారు. విసుగు పడకుండా వివరించగల్గితే సదవగాహనతో సమర్థులుగా తయారౌతారు. తల్లిలో అది లుప్తమైతే వారి మనసులో ప్రశ్నలు ప్రశ్నలుగానే తయారయ్యే ప్రమాదం లేకపోలేదు. అలాకాకుండా ముందాతల్లి తన బిడ్డల మనసుకు హత్తుకునేలా హితవైన మాటలు ప్రియంగా లాలనతో నేర్పుతో చెప్పగల ధీశాలి కావాలి. భువనేశ్వరి దేవి అందుకు తార్కాణం.

ఒకసారి కలకత్తా పురవీధుల్లో ఓ టాంగాలో తమ బిడ్డతో ప్రయాణిస్తున్నారు దంపతులు. తండ్రి తన బిడ్డ పెద్దయ్యాక ఎలా ఉండాలో ఏం చదవాలో ఉత్సాహంగా భార్యతో ముచ్చటిస్తున్నాడు. కాని ఆ బిడ్డ మాత్రం రోడ్డు మీద మెత్తగా సాగిపోయే టాంగాను, గిట్టల చిరుశబ్దంతో పరుగెడుతున్న గుర్రాలను చూస్తూ ఆనందిస్తున్నాడు. ఇంతలో తండ్రి బిడ్డను దగ్గరగా తీసుకుని పెద్దయ్యాక నువ్వు ఏం చేస్తావు నాన్నా అనడిగాడు ప్రేమగా. టాంగావాలా నవుతానన్నాడా పిల్లవాడు ఠక్కున. పాపమా తండ్రి ఉత్సాహం నీరుగారిపోయింది. చూడు చూడు నీ కొడుకుకెలాంటి కోరికో అన్నాడు కోపంగా భార్యతో. నాకేనా కొడుకు మీక్కాదా అని గద్దించలేదా ఇల్లాలు. పిల్లవాడిని కూడా మందలించలేదు. చిరునవ్వుతో తల పంకించింది. టాంగా ఇల్లు చేరగానే కొడుకు నెత్తుకుని ఇంట్లోకి ప్రవేశించింది. హాల్లో కదుగెట్టి చుట్టూ కలియజూసింది. ఆమె కంటికి పార్థసారథి చిత్రం కన్పించగానే దాని దగ్గరకు వెళ్ళి పిల్లవాడికి చూపుతూ ఈ టాంగా చూశావా? మనమెక్కిన దానికంటే చాలా బావుంది కదూ అనడిగింది. ఔనన్నట్టు చూశాడా బాలుడు ఉత్సాహంగా. ఈ టాంగాకు ఎక్కువ గుర్రాలు కట్టబడి ఉన్నాయి. టాంగావాలా కూడా ఎంత చక్కగా ఉన్నాడో చూడు. తలపై కిరీటం, అందులో నెమలి పింఛం. కుడి చేతిలో వేణువు, ఎడమ చేతిలో పగ్గాలు పట్టుకుని వెనక కూర్చున్నవానివైపు తిరిగి జ్ఞాన బోధ చేస్తున్నాడు. ఆయన బోధ వల్ల చాలా మేలు జరిగింది. చెడ్డవాళ్ళందర్నీ చంపించాడు. మంచివాళ్ళని రక్షించాడు. చాలా మంచివాడు అందామె మెచ్చుకోలుగా. నేనూ ఇలాంటి టాంగావాలా నవుతానన్నాడా పసివాడు వెంటనే. అతని

**రేపటి నెమలికన్న నేటి పావురం మిన్న.**

ఆలోచననే తన భావాల కనుగుణంగా మార్చి నేర్పుగా ఆ పసిమనసును ప్రభావితం చేసిన తల్లి భువనేశ్వరీ దేవి. ఆ బాల నరేంద్రుడే హిందూ సమాజోద్ధారకుడైన వివేకానందుడు.

మాతృత్వం ఒక వరంగా, బిడ్డలను పెంచడం ఒక యజ్ఞంగా భావించుటయే స్త్రీత్వ పరిపూర్ణతకు చిహ్నం. ఉగ్గుపాలతో బాటు జాతీయతను రంగరించి పోసే తల్లి జీవితం ధన్యం. పిల్లల్ని పెంచడమంటే వారు కోరిందల్లా కొనివ్వడం, బాగా పేరున్న స్కూల్లో పెట్టి చదివించడం అనుకోకూడదు. ఎలా పెంచాలో శాస్త్ర కారులు చక్కగా నిర్దేశించారు.

**రాజవత్ పంచవర్షాణి, దశవర్షాణి దాసవత్ ।**
**ప్రాప్తేతు షోడశేవర్షే పుత్రం మిత్రవదాచరేత్ ॥**

అంటే ఐదేళ్ళ ప్రాయం వరకు రాజాలా పెంచాలట. అడిగినవన్నీ అందిస్తూ అరికాలికి మన్నంటకుండా భుజాలపై మోస్తూ అతి ప్రేమగా పెంచుతాం. ఆపై పదేళ్ళు అంటే 15 సం॥వరకు దాసుడిలా దండిస్తూ, వాడు చేసే ప్రతి పని నిశితంగా గమనిస్తూ మంచిని ప్రశంసిస్తూ చెడును సంస్కరిస్తూ పెంచాలి. 16 సం॥ దాటిన తర్వాత మిత్రునిలాగ హితవు చెప్పాలట. ఎందుకంటే వారికా వయసులో తాము చేసేదే సరియైనదిగా తోస్తుంది. ఇతరులతో చెప్పించుకోవడం అవమానంగా భావిస్తారు. గట్టిగా చెప్తే తల్లిదండ్రుల్ని ద్వేషించే ప్రమాదం ఉంది కనుక అనునయంగా చెప్పాలి. ఈనాడిలా ఎంతమంది చెయ్యగల్గుతున్నారు? మా పిల్లలు మా మాట బొత్తిగా వినటం లేదని వాపోవడం తప్ప వారికోసం మనమేం చేస్తున్నామని యోచించేవారెందరు? పాలగ్లాసు ముందెట్టుకుని వెన్న కన్పడలేదంటే ఎలా? ఎన్నిరకాలుగా మారితే అది వెన్నవుతుంది? పాలలాంటి బిడ్డల మనసుల్ని వన్నె తెచ్చేలా మలచటానికి ప్రయత్నించిన తల్లి నిజమైన పట్టభద్రురాలు అవుతుంది. మన బిడ్డలు మన ప్రవర్తనకు ప్రతిరూపాలని గుర్తించి, తనను తాను సంస్కరించుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఆది గురువైన అమ్మ పరిపూర్ణమయితే ఆమె చేతిలో పెరిగిన బిడ్డ భావి బంగారుమయం అవుతుంది. తల్లిగా తమ గురుతర బాధ్యతల్ని నిర్వహించిన వీరమాతలు మన కాదర్శం కావాలి. ముందుగా మాతలలో వివేచన పెరగాలి. ఏది మంచో ఏది చెడో గ్రహించి బిడ్డలకు మంచివైపు ప్రేరణ కల్గించాలి.

–డి.జి.విజయలక్ష్మి.

★★★

## మోక్షానికి మార్గం సేవ

భారతదేశంలో పర్యటిస్తూ స్వామి వివేకానందుడు దక్షిణదేశంలోని రామనాడ్ రాజ్యంలో మధురై వెళ్ళారు. ఈ నగరం ప్రస్తుతం తమిళనాడులో ఉంది. అక్కడ స్వామీజీకి రాజా భాస్కర సేతుపతితో పరిచయం అయింది. రాజు గొప్ప విద్వాంసుడు. స్వామీజీతో సంభాషించిన మీదట ఆయన ఎంతో ప్రభావితుడై స్వామీజీకి శిష్యుడైనాడు.

రాజా సేతుపతి ఒకనాడు స్వామీజీని ప్రశ్నించాడు, 'స్వామీజీ, మీరు విరాగులు. సంసారవిముఖులు. ఐనా దేశంలోని జనసామాన్యం యొక్క స్థితిని గురించి ఆలోచిస్తున్నారు, వ్యధ చెందుతున్నారు. వారి ఉన్నతికోసం విద్యా వ్యాప్తి జరగాలని వ్యవసాయం అభివృద్ధి చెందాలనీ ఉత్సాహంతో చర్చలు చేస్తున్నారు ఎందువల్ల?'

స్వామీజీ చెప్పారు, 'సన్యాసి ఐనవాడికి మోక్షమే లక్ష్యంగా ఉంటుంది. నిజమే కాని నా గురుదేవులు నన్ను ఇలా ఆదేశించారు. భారతదేశ ప్రజల ఉన్నతికై ప్రయత్నించటం కూడా మోక్షప్రాప్తికి ఒక పవిత్రసాధనమే అవుతుంది. త్యాగము, సేవ అనేవి మన దేశంలో జాతీయగుణాలు' అని చెప్పారు. రాజు ఇది విని సర్వజన హితచింతకుడైన ఆ సన్యాసికి శ్రద్ధాభక్తులతో నతమస్తకుడైనాడు.

**స్త్రీణాం భూషణం లజ్జా. స్త్రీలకు అలంకారం లజ్జ.**

మనం-మన ఆరోగ్యం

# తాత్విక చికిత్సకు మూలసూత్రాలు-3

వైద్యుని బాధ్యత అన్నిటికన్న గొప్పది. బరువైనది కూడా. అతను తత్వదర్శకుల-వైజ్ఞానికుల స్థాయి పాత్ర పోషించవలసి ఉంటుంది. తన వ్యక్తిత్వాన్ని ఋషుల స్థాయికి పెంచుకునే ప్రయత్నం చేయాలి. ఎందుకంటే దిగజారిపోతున్న వారిని, వెనుకబడి పోతున్నవారిని ఉద్ధరించడం ద్వారా అతని శక్తి నిరూపించబడుతుంది. రోగి శారీరికంగా, మానసికంగా బాధలో ఉంటాడు. బాధపడే వారిపై సానుభూతి-సద్భావన కలిగి ఉండాలి. అవసరమైన చికిత్స నెమ్మదిగా సాగుతూ ఉన్నా ముందుగా అతనికి వైద్యుని పట్ల విశ్వాసం కలిగేలా చూచుకొనాలి. "ఈయన సహకారంతో నేను నా బాధల నుండి విముక్తి పొందగలను. సంపూర్ణ ఆరోగ్యవంతుడిని కాగలను"-అన్న నమ్మకం కలిగినప్పుడు వైద్యుని మాటలయందు, చేతలయందు గురి కుదిరి ఆయన చెప్పినట్లు నడుచుకుంటాడు. అప్పుడు వైద్యునికి చికిత్స సులువౌతుంది. సందర్భానుసారం రోగికి ధైర్యము కలిగిస్తూ అతి త్వరలో రోగ విముక్తుని చేయగలుగుతాడు. అలా అని ఏమాత్రో కాప్స్యూలో ఇచ్చి, ఇక నీకేం పర్వాలేదు; అంతా చక్కబడిపోతుంది, అని మాయ మాటలు చెప్పకూడదు. నిజమైన మిత్రునిలా, శ్రేయోభిలాషిలా అతని బాధలను తెలుసుకోవడంలో, పొరపాట్లను తెలియజేయడంలో ఎక్కువ సమయం వెచ్చించవలసి వస్తే వెనకాడకుండా ఉదారంగా వెచ్చించాలి. ఈ విధంగా రోజుకి ఒక రోగికి మాత్రమే సమగ్ర వైద్యం అని భావించగలిగితే మరింతమంచిది. నిముషానికో వందమందికి నాడీ, గుండె పరీక్షించి హడావుడిగా ఏవో మందులు రాసిస్తుంటే అందువల్ల ఎవరికి లాభం కలుగుతుంది ! వైద్యునికి ఆత్మ సంతృప్తి దొరకదు. రోగికి ఆరోగ్యమూ కలుగదు.

వైద్యుడు మొట్టమొదట తన శారీరిక, మానసిక ఆరోగ్యాన్ని పటిష్టం చేసుకొనాలి. తత్వజ్ఞానిగా, సద్భావన కలిగిన నిజమైన మార్గదర్శకుడుగా ఉద్ధారకుడుగా మారాలి. అప్పుడే ప్రజలు ఆయన సామర్థ్యం, ప్రామాణికత, తెలివితేటలపై విశ్వాసం పెంచుకొంటారు. ఆయన వైద్యం ద్వారా జీవితాంతం ఆరోగ్యమనే భాగ్యమును పొందగలుగుతారు.

★★★

## వీరపత్ని జీజాబాయి

శివాజీ తల్లి జీజాబాయి మహారాష్ట్ర ప్రాంతంలో సింద్‌ఖేడ్ అనే గ్రామంలో పుట్టింది. మరాఠా సర్దార్ లఖూజీ జాధవరావు కుమార్తె ఆమె. నిజాంషాహిలో లఘూజీ జాధవరావు సర్దార్ పదవిలో ఉన్నాడు. అలా పదవి పొందిన సేనానులలో అతడు ప్రథముడు. మాలోజీ పుత్రుడు షహాజితో జీజాబాయి వివాహం అయింది.

షహాజీకి, జాధవరావుకు వైరం వుండేది. జాధవరావు మొగలుల వైపున ఉన్నాడు. షహాజీ మరాఠాల వైపున ఉన్నాడు. జీజాబాయి మొగలులకు బందీ అయింది. ఆమె తన తండ్రి ఆధీనంలో ఉంది. జీజాబాయి అప్పుడు గర్భవతి. జాధవరావు కుమార్తె పరిస్థితి చూచి ఇలా చెప్పాడు, 'అమ్మా నీకీ కష్టమెందుకు? సింద‌ఖేడ్‌లో మన ఇంటికి వెళదాం పద. నేను ఇప్పుడే పల్లకీ ఏర్పాటు చేస్తాను.'

జీజాబాయి వీరపత్ని. ఆమె దీనికి ఎలా అంగీకరిస్తుంది? తన తండ్రితో నిర్భయంగా ఇలా చెప్పింది- 'మీరు భోంస్లే కుటుంబం మీద పగ తీర్చుకోవాలని అనుకుంటున్నారు. ఇక్కడ నేను మీ ముందున్నాను. నా మీద తీర్చుకోండి పగ. నాకు వివాహం అయింది. భోంస్లే కుటుంబంతో నాకు సంబంధం ఏర్పడింది. ఆనాడే నాకు మీ కుటుంబంతో సంబంధం తెగిపోయింది. నేను మీ ఇంటికి రాను.' జీజాబాయి ఇలా హూంకరిస్తూ దుర్గాదేవిని తలపించింది. జాధవరావు ఇక అక్కడ ఉండకుండా వెళ్ళిపోయాడు.

**విప్రాణం భూషణం వేదః. బ్రాహ్మణులకు అలంకారం వేదం.**

సేవా సాధన

# నిశ్శబ్ద సేవకు నిలువెత్తు రూపం గోస్వామి గణేశ దత్తు

భారత దేశానికి రక్షణ ద్వారం పంజాబు. శారీరికంగా బలవంతులైన ఆ ప్రాంతపు సైనికులే భారతమాతకు ద్వారపాలకులు. కాని వందలాది సంవత్సరాలుగా విదేశీయుల పరిపాలన వలన భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు కుంటుపడ్డాయి. ముఖ్యంగా దాని ప్రభావం భాషమీద పడింది. దాదాపు 80 సంవత్సరాలు వెనక్కిపోయి చూచినట్లైతే – ఆ ప్రాంతంలో విద్యావంతులలో 95శాతం హిందీ గురించి తెలియనివారే. ఆ రోజుల్లో పంజాబులోని వార్తాపత్రికలన్నీ ఉర్దూలోనే ఉండేవి. కొద్దో గొప్పో హిందీ తెలిసిన వారెవరైనా ఉంటే, వాళ్లు మహిళలే. భాషకూ, సంస్కృతికీ గల అవినాభావ సంబంధం అందరికీ తెలిసిందే. అందువలన పంజాబులో హిందుత్వం అనేది రూపుమాసిపోయేలా ఉండేది.

ఆ పరిస్థితినంతా గోస్వామి గణేశ దత్తు పూర్తిగా ఆకళింపు చేసుకున్నారు. హిందీ ప్రచారం ద్వారా సంస్కృతిని పరిరక్షించాలని నిర్ణయించుకున్నారు. ఆయన నివసించే నగరం లాయలేపురంలో "సనాతన ధర్మసభ" పేరుతో ఒక సంస్థ నడుస్తుండేది. దాని సంస్థాపకుడు "లాలా రలియారామ్" దగ్గరకు వెళ్లారు. అది ఇదీ మాట్లాడి, తన మనసులోని వేదనను వెళ్లగ్రక్కారు. "మీరు అనుమతించినట్లైతే, మీ సభలో రాత్రి పాఠశాలను నడిపి హిందీ నేర్పుతాను. నాకెలాంటి వేతనమూ అక్కరలేదు. కేవలం పాఠశాలలో వెలుతురు కోసం ఒక దీపం, దానికి కావలసిన చమురును సమకూర్చితే చాలు"– అని ప్రాధేయపడ్డారు. కాని ఆ సంస్థాపకుడు తన అశక్తతకు చాల బాధ పడ్డాడు. తన సభా పరిస్థితిని వివరించి – కావాలంటే తన కార్యాలయాన్ని వాడుకోమన్నాడు. సభ పరిస్థితికి గోస్వామి చలించిపోయారు. "అయ్యా! మీరు ఊఁ అనండి. మాకు, సభకు కావలసిన పైకాన్ని నేను సమకూర్చుతాను. ప్రజల్లో ఇంకా దానగుణం నశించిపోలేదు"– అన్నారు.

మరు రోజునుండే ఆయన ఉత్సాహంగా కార్యరంగం లోకి దూకారు. ఇల్లిల్లు తిరిగారు. హిందీ భాష యొక్క ఆవశ్యకత గురించి, సంస్కృతీ సంప్రదాయాల స్థితిగతుల గురించి వివరించారు. ప్రజల హృదయాలలో నిద్రావస్థలో ఉన్న దేశాభిమానం జాగృతమైంది. ప్రతి మంగళవారం సంచీ భుజానికి తగిలించుకుని వెళ్లేవారు. నిండు సంచీతో తిరిగి వచ్చేవారు. సత్సంకల్పం ఎప్పుడూ వెనుకకు పోదు. పాఠశాల ప్రారంభింపబడింది. మెల్లమెల్లగా పంజాబులోని ప్రతి నగరంలోను హిందీ ప్రచారం జోరందుకుంది. హిందీతోపాటు హిందూత్వాన్ని కూడ పరిచయం చెయ్యటం ప్రారంభించారు.

చూస్తూ ఉండగానే 3–4 వందల ఉన్నత పాఠశాలలు, ప్రత్యేకంగా బాలికా పాఠశాలలు, జూనియర్ కాలేజీలు విస్తారంగా స్థాపించబడ్డాయి. లక్షల సంఖ్యలో విద్యార్థులు శ్రద్ధగా చదువుకోసాగారు. ఆహా! గోస్వామి సంభావించిన మార్గం మహోన్నత దశకు చేరుకుంది. మహాత్ముల ఆశయాలు చిరస్మరణీయాలు కదా! ఇది చరిత్రలో సువర్ణాక్షరమాలతో లిఖించదగినదే కాని మరొకటి కాదు.

గోస్వామి గణేశదత్తు యౌవనంలో కుటుంబ జీవితం మీద ఏ కారణంగానో విరక్తిని పెంచుకున్నారు. స్వామి రామతీర్థుల వారిని అలవోకగా చేరుకున్నారు. వారి సన్నిధిలోనే సమాజసేవా బీజాలు హృదయంలో గాఢంగా నాటుకున్నాయి. ఆ ప్రేరణతోనే సమాజసేవలో మరింత వేగంగా దూసుకుపోయారు. తన జీవితాన్ని సమాజసేవకే అంకితం చేయాలని సంకల్పించుకున్నారు. ఆ మార్గంలో భాగంగానే తన ధర్మపత్ని పార్వతీదేవిని ఒక పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా చేర్పించారు. తమ ఇద్దరు కుమార్తెల పోషణ భారాన్ని ఆమెకే అప్పచెప్పారు. భార్య అనుమతితో తాను సంపూర్ణంగా సమాజసేవలో లీనమయ్యారు.

పాఠశాలలు ప్రారంభించిన 4–5 సంవత్సరాలకు పంజాబులో ప్లేగు మహమ్మారి విజృంభించింది. ఆయన ఉత్సాహవంతులైన ఐదారుగురు యువకులను వెంట తీసుకున్నారు. నిర్భయంగా, నిబ్బరంతో, నిస్వార్థంగా రోగపీడితులకు సేవలు చేసారు. సొంత బంధువులే రోగిని వదిలి పారిపోతే, వారిని ఓదార్చి ఒడ్డుకు చేర్చారు. ఆ స్థితిని ప్రత్యక్షంగా చూచిన కవులు దాన్ని తమ పుస్తకాల్లో గుర్తుగా వ్రాసిపెట్టుకున్నారు.

మరొకసారి బెంగాలులో కరవు రక్కసి విలయ నాట్యం

సర్వేషాం భూషణం ధర్మః. అందరికీ అలంకారం ధర్మం.

చేసింది. ఆ సమయంలో కూడ గోస్వామి గణేశదత్తు ఉత్సాహవంతులైన యువకుల సాయంతో శక్తివంచన లేకుండా సహకరించారు. వందల సంఖ్యలో బట్టల మూటలు, వేలసంఖ్యలో రూపాయలు, అంతులేని ఆహార పదార్థాలు సేకరించి పీడిత జనాలకు అందజేశారు. ఆయన భార్య పార్వతీదేవి కూడ సేకరించిన పదార్థాలను బుట్టలో పెట్టి నెత్తిమీద మోస్తూ చేరవేసింది. ఆ సమయంలో సమాజంలో తనకున్న గౌరవ స్థానాన్ని కూడ ఆమె లెక్కచేయలేదు. తన భర్త దగ్గర పొందిన స్ఫూర్తికి ఫలితమే ఇది.

ఇంతలో దేశానికి స్వాతంత్ర్యంతో పాటు విభజన కూడ వచ్చింది. పాకిస్తాను వేరు కావటంతో, భారతదేశానికి శరణార్థుల సంఖ్య పెద్ద బెడదగా మారింది. గోస్వామి గణేశదత్తు స్థాపించిన పాఠశాలలు అధికశాతం పశ్చిమ పంజాబులోనికి వెళ్లిపోయాయి. కాని ఆయన దానినంతగా పట్టించుకోలేదు. ప్రవాహంలా వచ్చి పడుతున్న శరణార్థులను ఆదుకోవడంలో నిమగ్నమయ్యారు. పగలు రాత్రి నిద్రాహారాలను త్యజించి వారికి సహకరించారు. ప్రతి వ్యక్తి వివరాల నడిగి వ్రాసుకుంటూ పునరావాసం కల్పించారు. తాను ప్రోగుచేసిన చందాలలో ఒక్క రూపాయి కూడా తన కుటుంబం కోసం వాడుకోలేదు.

తండ్రి, అన్నదమ్ములు కొద్దో గొప్పో ఉన్నవారే. తనపెద్ద కుమార్తె యుక్త వయస్కురాలైంది. ఐనా తన సంపాదన అంటూ కుటుంబానికి ఒక్కపైసా కూడా ఇవ్వలేకపోయారు. ఇవ్వటం చేత కానప్పుడు అడగటం ధర్మంకాదనుకున్నారు. భార్యతో ఆలోచించి ఎవ్వరికీ చెప్పకుండానే పెండ్లి జరిపించారు. భార్య నగలలోనుండి ఒకటిరెండు కుమార్తెకు ఇచ్చారు. అల్లునికి ఒక్క ఖద్దరు సూటు కుట్టించారు. అంతే. నిరాడంబరంగా పెండ్లి జరిపించారు. పెండ్లివారు తిరిగి వారి గ్రామం వెళ్లుతూ అమ్మాయి తాతగారి దుకాణం ముందునుండే సాగిపోతున్నారు. ఆయన గుమాస్తాను పిలిచి "ఎవరా పెండ్లివారు?" అని అడిగారు. మీ మనుమరాలేనని చెప్పగా– ముందుగా ఉలిక్కిపడినా, గోస్వామి స్వాభిమానానికి గర్వపడ్డారు.

గోస్వామి గణేశదత్తు దృఢమైన సంకల్పంగల కార్యకర్త. ప్రతి దానికి తనపేరును బైటపెట్టుకునే స్వభావంలేనివారు. సొంత డబ్బా వాయించుకోవటమంటే ఆయనకు అసహ్యం. నిశ్శబ్దసేవను మహామనా మాలవ్యా నుండి ఆయన నేర్చుకున్నారు.

ఆయన చేసిన సేవలు, స్థాపించిన కేంద్రాలు అజరామరాలు.

★★★

## మార్గదర్శకుడైన నాయకుడు

మహాత్మా గాంధీ ఆ రోజులలో చంపారన్ (బీహార్)లో ఉన్నారు. ఒక రాత్రి ఆయన అక్కడి నుండి బేతియా వెడుతున్నారు. రైలు ఖాళీగా ఉన్నది. మహాత్ముడు మూడవ తరగతి పెట్టెలో ఒక సీటు మీద నిద్రపోతున్నారు. అర్ధరాత్రి సమయమానికి రైలు ఒక స్టేషన్‌లో ఆగింది. ఒక రైతు ఆ పెట్టెలోకి ఎక్కాడు. అతడు మహాత్ముణ్ణి తట్టిలేపి అన్నాడు, "లేలే ఈ బండి నీ స్వంతం అయినట్లుగా పడి నిద్రపోతున్నావు.' గాంధీజీ లేచి కూర్చున్నారు. ఆ రైతు కూర్చొని పాట పాడసాగాడు –

ధన్యుడు, ధన్యుడు గాంధీజీ – పేదల పాలిట పెన్నిధి

ధన్యుడు, ధన్యుడు గాంధీజీ – నది దాటించే వారధి

నిజానికి ఆ రైతు గాంధీజీ దర్శనం కోసం బేతియా వెళుతున్నాడు. తాను తట్టి లేపిన వ్యక్తి, తన పాట విని చిరునవ్వు నవ్వుతూన్న వ్యక్తి గాంధీజీయేనని పాపం అతనికి ఏం తెలుసు? బేతియాలో రైలు ఆగింది. వేలాదిగా ప్రజలు వచ్చారు. గాంధీజీకి జైజైకారాలు పలుకుతున్నారు. అప్పుడు ఆ రైతుకి తాను చేసిన పొరపాటు ఏమిటో తెలిసింది. అతడు కన్నీరు కార్చుతూ గాంధీజీ పాదాల మీద పడ్డాడు. గాంధీజీ అతన్ని లేవనెత్తి కౌగలించుకున్నారు.

**వినయ సంపన్నమైన విద్య అలంకారాలకు అలంకారం.**

ఆచరణలో అధ్యాత్మ

# అహంకారం కాదు - స్వాభిమానం

సర్ ఐజాక్ న్యూటన్ తో ఎవరో అన్నారు- "మీరు పూర్తి జ్ఞానాన్ని సంపాదించినట్లున్నారు."

'నా ముందు జ్ఞానం యొక్క విశాల సముద్రం వ్యాపించి ఉంది. దాని ఒడ్డున ఉన్న కొన్ని రేణువులను మాత్రమే గ్రహించగలిగాను"- అని విజ్ఞాన ప్రపంచంలో విఖ్యాతి పొందిన వ్యక్తి జవాబిచ్చాడు. అది ఆయన నిరభిమానానికి చక్కని ఉదాహరణ.

జీవితంలో ప్రగతి, అభివృద్ధి, విజయం కోరుకొనేవారు అహంకారానికి దూరంగా ఉండాలి. మానవుల కోరికల సాధనలో అహంకారమే పెద్ద ఆటంకం. అహంకారపూరిత వ్యక్తిలో అభివృద్ధి ఆగిపోతుంది. అతని ప్రగతికి ఉన్న అన్ని అవకాశాలు దూరమవుతాయి. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకునే పండితులు దీనిని నీచమైనదిగా, వదిలివేయవలసినదిగా చెప్పారు.

చుట్టూ ఉన్న అందరికంటే తనను అసాధారణంగా, గొప్పగా భావించే గుణాన్నే అహంకారం అంటారు. అహంకారం అనేక దుర్గుణాలకు మూలం. తెలివితేటలు, జ్ఞానం, రంగు, అందం, సృజనాత్మకత, సామర్థ్యం- ఈ గుణాల అహంకారమే మనిషి పతనానికి కారణా లవుతాయి. వ్యక్తిలో అహంకారం ప్రవేశించగానే అతని పనులు, బుద్ధులు మారిపోతాయి. మత్తులో ఉన్నట్టుగా అసంబద్ధమైన, పద్ధతిలేని పనులు చేస్తూ ఉంటాడు. అతనిలో ఆలోచనా శక్తి, దూరదృష్టి నాశనమవుతాయి.

అహంకారం ఎటువంటి విషబీజం అంటే- అది జీవితంలోని ఆనందం, సౌందర్యం, బుద్ధి, అభివృద్ధి అన్నింటిని ఆపి, ఎండిపోయేలా చేస్తుంది. అహంకారం అనేది ఎటువంటి విషపు కత్తి అంటే- అది అతనికి, ఇతరులకు కూడా నష్టం కలిగిస్తుంది. అహంకారం మనిషిని క్రూరత్వం, దోపిడి, అనాచారాల వైపు తీసుకుపోతుంది. ఫలితంగా వ్యక్తికీ సమాజానికీ నష్టం కలుగుతుంది.

గణితం, విజ్ఞానముల అఖండ మేధావి న్యూటన్ మహాశయుడి గణితానికి సంబంధించిన అపూర్వమైన విషయాలు ఒక సంచికలో వెలువడినాయి. దానిపట్ల అనేకమంది నుంచి ప్రశంసలు. అభినందనలు, జ్ఞాపకాలు, కృతజ్ఞతలు వచ్చాయి. దీనిపట్ల విచారం వ్యక్తపరుస్తూ ఆయన ఇలా అన్నారు- ఇప్పుడు నా గౌరవం బాగా పెరుగుతుంది. కాని ఏ విజ్ఞానానికి నేను జీవితాంతం సమయం వెచ్చించానో దాని అభివృద్ధి ఆగిపోతుంది"

ప్రశంసలు, గౌరవాలు అహంకారాన్ని పెంచి పోషిస్తుంటాయి. తన చదువును, పేరు ప్రతిష్టలను గుర్తించాలని ఎవరు ఆలోచిస్తారో వారు ప్రగతిమార్గంలో కాలు ఎలా మోపగలరు? కష్టపడటంలోని, సాధించటంలోని గొప్పదనాన్ని వారు మరచిపోతారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకునే కవులు, రచయితలు, శాస్త్రవేత్తలు, కళాకారులు, వేదాంతులు, మహాపురుషులు తమ సాధన పరిపూర్ణం అయ్యేవరకు తమ కార్యకలాపాలను రహస్యంగా ఉంచారు. అహంకారపు కబంధహస్తాలకు క్రోసుల దూరంలో ఉన్నారు.

అహంకారానికీ, స్వాభిమానానికీ ఆకాశానికి పాతాళానికి ఉన్నంత దూరం ఉంది. అహంకారం సంకుచిత ఆలోచనల నుండి పుడుతుంది. కాని స్వాభిమానం వ్యక్తిలోని ఉదాత్తమైన విశాలమైన ఆత్మీయత నుండి పుడుతుంది. అహంకారం వ్యక్తి దిగజారుడుతనానికి గుర్తయితే, స్వాభిమానం వ్యక్తి గొప్పతనానికి గుర్తు. తమ దేశం, జాతి, మతం, మానవత్వం కొరకు వాటిని నిలబెట్టటానికి, రక్షించటానికి ప్రాణాలను పణంగా పెట్టటమే స్వాభిమానానికి నిర్వచనం.

అహంకారం భౌతిక విషయాలకు సంబంధించినది. డబ్బు, చదువు, అందం, బలం- ఇటువంటి నాశనమయ్యే సంపదలను చూసుకొని మిడిసిపడే వ్యక్తిని అహంకారి అంటారు. స్వాభిమానులంటే ఆదర్శాలను పాటించటంలో నిలకడ సాధించి, ఆదర్శ భావాలను సమాజంలో నిలబెట్టటానికి తమ సర్వస్వాన్ని పణంగా పెట్టేవారు. అహంకారి తనకు కొంచెం అవమానం జరిగినా భరించలేడు. దెబ్బతిన్న పాములా ఇతరులపై విరుచుకుపడతాడు. కాని స్వాభిమాని వ్యక్తిగత లాభ నష్టాలను, మానావమానాలు దృష్టిలో ఉంచుకోక- ఎల్లప్పుడూ ఆదర్శాలకు కట్టుబడి ఉంటాడు. మంచి భావాలను రక్షించటంలోనే తన విజయం, గౌరవం ఉన్నట్లు భావిస్తుంటాడు. మనం అహంకారులుగా కాక స్వాభిమానులుగా తయారుకావాలి.

★★★

నాలుక విషానికీ అమృతానికీ గని.

ధారావాహిక : గాయత్రీ మహావిజ్ఞానం- 16

# సప్త ముద్రలు

## మహాముద్ర

ఎడమకాలి మడమను గుదమునకు, మూత్రేంద్రియమునకు మధ్యనుంచి కుడికాలిని బారచాపాలి. కుడికాళ్ల వేళ్లను రెండుచేతులతోను పట్టుకోవాలి. శిరస్సును మోకాళ్ళకు తగిలించే ప్రయత్నం చేయాలి. ఎడమముక్కు రంధ్రముతో శ్వాస పూరించాలి. కొంతసేపు కుంభించి కుడి ముక్కు రంధ్రము ద్వారా రేచకము (వదులుట) చేయాలి. మొదట ఎడమవైపు ముద్రతో ఐదు ప్రాణాయామాలు చేసి, తరువాత కుడికాలిని మడచి, మడమను గూడా మూత్రేంద్రియముల మధ్యభాగములో ఉంచి, ఎడమకాలు చాచి రెండుచేతులతో కాలివేళ్ళను పట్టుకొని, కుడి ముక్కు రంధ్రముతో శ్వాసను పూరించి కుంభకముచేసి, ఎడమ ముక్కు రంధ్రము ద్వారా వదలాలి. ఎడమవైపు ఎంతసేపు చేసితిమో కుడివైపు కూడ అంతసేపు చేయాలి.

ఈ మహాముద్ర వలన కపిలమునికి సిద్ధి ప్రాప్తించినది. దీనివలన అహంకారము అవిద్య, భయము, ద్వేషము, మోహము ఆదిగాగల పంచక్లేశదాయక వికారముల యొక్క శమనము కలుగును. భగందరము, మూలవ్యాధి, సంగ్రహణీ, ప్రమేహము మొదలయిన రోగములు దూరమగును. శరీరము యొక్క తేజస్సు పెరుగుతుంది. వృద్ధాప్యమును దూరంగా నిలబెడుతుంది.

## ఖేచరీ ముద్ర

నాలుకను చాపి వెనుకకు త్రిప్పి తాలు ప్రదేశమునకు నాలుక కొనను తాకించటం ఖేచరీముద్ర అనబడుతుంది. తాలువు నందలి గోతిలో బోలుగా ఉండే ప్రదేశం లోపలికి చొచ్చుకపోతే మాంసముతో తయారయిన ఒక చిన్న తొండము వంటిది ఊగుతూ వుంటుంది. దీనిని కపిల కుహరము అని పిలుస్తారు. ఈ స్థానము నాలుక కొనతో తాకవలసియున్నది.

పూర్వకాలంలో నాలుకను పొడవుగా చేయడానికి అనుసరింపబడిన పద్ధతులు నేడు ఉపయోగింప పనిలేదు- (1) పశువుల యొక్క పాలు పితికినట్లు నాలుకను చేయడం, (2) జిహ్వను తేనె, మిరియము మొదలయిన వానితో నిమిరి ముందుకులాగడం (3) జిహ్వక్రింది భాగమందలి నాడీ తంతువులను కోయడం (4) లోహశలాకతో అణగగొట్టి నాలుకను పెంచడం. ఈ క్రియలు, దేశకాల జ్ఞానములు నేటి పరిస్థితికి తగినవి కావు. ప్రాచీన కాలంలోవలె వేలాది సంవత్సరాలు నిరాహారంగా తపస్సు చేయడం నేడు ఏ విధంగా అనావశ్యకమో, నాలుక పొడుగుచేయడం కూడ అంతే. తేనె, మిరియములతో నాలుకను మెల్లగా మర్దనచేయడం వలన అక్కడి తంతువులయందు ఉత్తేజం కలుగుతుంది. వెనుకకు మడవడానికి సహాయపడుతుంది. ఈ విధంగా నాలుక కొనను తాలుభాగమునందలి గహ్వరములో ఉంచడానికి నాలుక నిదానంగా కదిలిస్తుంటే తాలు గహ్వరమునకు మెల్లగా మర్దన జరుగుతుంది. దృష్టిని భ్రూమధ్యంలో ఉంచాలి.

ఖేచరీముద్రవలన కపాల గహ్వర మందలి ప్రాణశక్తి సంచారము కలిగి సహస్రదళ కమల మందవస్థితమైన అమృత నిర్ఝరి ప్రవహించడం మొదలుపెడుతుంది. దాన్ని ఆస్వాదించడం వల్ల ఒక దివ్యానందము కలుగుతుంది. ప్రాణము ఊర్ధ్వగతి చెందటం వలన మృత్యుకాలమందు జీవుడు బ్రహ్మరంధ్రము ద్వారా ప్రయాణము చేస్తాడు. అందువలన ముక్తి లేక స్వర్గము యొక్క సద్గతి ప్రాప్తిస్తుంది. గుదము మొదలగు అధోమార్గముల ద్వారా ప్రాణము నిష్క్రమించిన, అతడు నరకగామి కాగలడు. నోరు, నాసిక, చెవి ద్వారా ప్రాణము వదలిన మృత్యులోకము నందు తిరుగుతూ ఉంటాడు. ఎవని జీవము బ్రహ్మరంధ్రము ద్వారా నిష్క్రమిస్తే వానికి అవశ్యము సద్గతి ప్రాప్తిస్తుంది. ఖేచరముద్వారా బ్రహ్మాండ స్థితి, శేషశాయి, సహస్రదళ నివాసియైన పరమాత్మ సాక్షాత్కారం కలుగుతుంది. ఈ ముద్ర చాలా మహత్తరమైంది.

## విపరీతకరణి ముద్ర

తలనేలమీద ఉంచి రెండుచేతులు సమీపంలో ఉంచి కాళ్ళు సూటిగా పైకి ఉంచడాన్ని విపరీతకరణి ముద్ర అంటారు. దీన్నే శీర్షాసనమని అంటారు. తల క్రిందకు కాళ్ళు పైకి ఉండటం దీని ముఖ్య లక్షణము.

**తపస్సార ఇంద్రియ నిగ్రహః. తపస్సుకు సారం ఇంద్రియ నిగ్రహం.**

తాలువు యొక్క మూలమునుండి చంద్రనాడి, నాభియొక్క మూలమునుండి సూర్యనాడి బయలుదేరుతాయి. ఈ రెండింటి యొక్క ఉద్గమ స్థానములు విపరీతకరణి ముద్రద్వారా కలుస్తాయి. అందువలన మస్తిష్కమునకు బలము కలుగుతుంది.

## యోని ముద్ర

దీనిని షణ్ముఖీ ముద్ర అని గూడ అంటారు. పద్మాసనం వేసి కూర్చొని రెండు బొటన వ్రేళ్ళతో రెండుచెవులు, రెండుతర్జనీ (చూపుడు) వేళ్ళతో రెండు కళ్ళు, రెండు మధ్యవేళ్ళతో రెండు ముక్కురంధ్రములు, రెండు అనామికలతో (ఉంగరపు) నోటిని మూయాలి. పెదవులను కాకి ముక్కువలె బయటకుపెట్టి నిదానంగా శ్వాస పీలుస్తూ గుదమువరకు తీసుకుపోయి, మరల నిదానంగా పరివర్తన క్రమంలో బయటికి పంపాలి. యోనిముద్ర సాధన చేయడంవల్ల యోగసిద్ధియందు విశేష సహాయసిద్ధి కలుగుతుంది.

## శాంభవీ ముద్ర

అసనంవేసి కూర్చొని, రెండు కనుబొమ్మలమధ్య భృకుటియందు దృష్టిని నిలిపి ధ్యానం చేయడాన్ని శాంభవీ ముద్ర అంటారు. అరమూసిన నేత్రములతో నిటారుగా కూర్చొని శాంత చిత్తముతో ధ్యానం చేయడాన్ని గూడ శాంభవీ ముద్ర అంటారు. భగవంతుడగు శంభునిద్వారా సాధన చేయబడినందున దీని పేరు శాంభవీ ముద్ర అయినది.

## అగోచరీ ముద్ర

మనసును నిరోధించి నాసికయొక్క అగ్రభాగమున మనసు నేకాగ్రము చేయుట అగోచరీ ముద్ర.

## భూచరీ ముద్ర

నాసికనుండి నాలుగు అంగుళముల పైన శూన్యస్థానముపై రెండు నేత్రముల యొక్క దృష్టిని ఒక బిందువుపైన కేంద్రీకరించుట.

ఇవిగాక నభో ముద్ర, మహా బంధము, శక్తిచాలనీ ముద్ర, తాడగి, మాండవీ, అధోధారణ, అంభసే, వైశ్వానరీ, వాయినీ, సభోధారణ, అశ్వనీ, పాశన, కాకి, మాతంగి, దుజాంగీ, దుజాంగినీ మొదలగు 25 ముద్రల గురించి ఘేరండ సంహితయందు సవిస్తారముగా వర్ణింపబడినది. ప్రాణమయకోశ అనావరణమునందు ఏముద్రలు ప్రముఖంగా పనిచేస్తాయో, ఆ ఏడు ముద్రలయొక్క సంక్షిప్త వర్ణన పైన యీయబడింది.

★★★

## కర్తవ్యనిష్ఠుడైన ఉపాధ్యాయుడు

గంగాధర శాస్త్రి ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన విద్వాంసుడు. ధుండిరాజు ఆయన కుమారుడు. ధుండిరాజు తోటి విద్యార్థులకు ఎంతో ఆప్తుడుగా ఉండేవాడు. గంగాధర శాస్త్రి ఒక అధ్యాపకుడు. ఒక రోజున అకస్మాత్తుగా జబ్బుచేసి ధుండిరాజు మరణించాడు.

పండిత గంగాధర శాస్త్రి ఎప్పటి మాదిరిగానే ఆ రోజు కూడా పాఠం చెప్పాడు. అయితే ఆయన ముఖం ఎంతో ఉదాసీనంగా, గంభీరంగా ఉంది. పాఠం అయిన తర్వాత తోటి విద్యార్థులు వెళ్ళి ధుండిరాజును కేకవేసి పిలిచారు. అప్పుడు పండిత గంగాధర శాస్త్రి చెప్పాడు– "వాడు చాలా దూరం వెళ్ళిపోయాడు. మీ కేక అక్కడి దాకా వినిపించదు" మొదట విద్యార్థులకి అర్థంకాలేదు. తర్వాత మరణ వార్త తెలిసింది. విద్యార్థులకు ఆశ్చర్యంవేసింది. వినయంగా అడిగారు– 'గురూజీ ఇంత శోకంలో కూడా మీరు పాఠం చెప్పటం ఆపలేదు!'

'ఎలా ఆపగలను నాయనా!' పండితుడు ఆగి ఆగి స్పష్టమైన స్వరంతో చెప్పాడు– 'మీరంతా పిల్లలు. ఎక్కడెక్కడి నుంచో వచ్చారు. ఒక్కరోజు మాత్రం ఎట్లా వ్యర్థం చేస్తాను? పుత్రశోకం నా సొంత విషయం. కాని జ్ఞాన సమారాధన అందరికీ సంబంధించిన విషయం. దాన్ని ఆటంక పరచి మీ అభివృద్ధిని కుంటుపర్చటం నాకు న్యాయమా?'

అచంచలమైన ఈ కర్తవ్యనిష్ఠ చూచి అంతా నిశ్చేష్టులైనారు. ఆ విద్యార్థులలో కంటతడి పెట్టనివారు లేరు.

**నిశాంతే కార్యం చింతయేత్. చేయవలసిన పనులను గురించి తెల్లవారుజామున ఆలోచించాలి.**

ధారావాహిక : నా స్మృతిపథంలో గురుదేవులు-6

# భుసావల్ గాయత్రీ యజ్ఞంలో అద్భుతం

ఒక రోజు గురుదేవులు నాదగ్గరకు వచ్చి, వెంటనే భుసావల్ వెళ్లమన్నారు. అక్కడ పండితులు యజ్ఞం చేస్తున్నారట. గాయత్రీ పరివార్‌శాఖ అక్కడలేదు. కాని 'సర్దార్‌సింగు' అనే గాయత్రీ పరివార్ సభ్యుడు ఉన్నారు. అక్కడ యజ్ఞంలో ప్రవచనం ఇవ్వడం కోసం కొంత సమయం పరివార్‌కు కేటాయించారు. అందువల్ల నన్ను అక్కడకు వెళ్లమన్నారు. భుసావల్‌లో నాకు ఎవరూ తెలియదని సందేహించాను. అదీగాక, అక్కడ యజ్ఞం మరెవరో చేస్తున్నారు. అక్కడ నేను చేయగలిగేదేమిటి? ఏమి మాట్లాడాలో తెలియదు. గురూజీ అన్నారు- "నీకు ఎన్నోసారులు చెప్పాను. నా పని, నాపై భారం మోపి శ్రద్ధతో చేయి. ఎల్లప్పుడూ నేను నీతో ఉంటాను". గురూజీ ఆజ్ఞానుసారం భుసావల్ బయలుదేరాను. బండి భుసావల్‌లో ఆగగానే, పసుపు జండా పుచ్చుకున్న వ్యక్తిని కలిశాను. ఆయనే సర్దార్‌సింగు. ఆయనతో భుసావల్ చేరాను. నన్ను ఆయన తన ఇంటికి తీసికొని వెళ్లాడు. స్నానం, భోజనం చేసి విశ్రాంతి తీసుకున్నాను. అక్కడ జరిగేది ఒక కుండీ యజ్ఞం. అక్కడి పండితులు దాన్ని జరుపుతున్నారు. ఆ సాయంత్రం అక్కడ ప్రవచనం ఇవ్వడానికి బయలుదేరాము. అక్కడ జనానికి వెనకగా కూర్చున్నాము. అక్కడ పండితులు చెప్పే ప్రవచనాన్ని శ్రద్ధగా విన్నాను. వారి తర్వాత ఒక వ్యక్తి వేదిక మీదికి వచ్చి, గాయత్రీ పరివార్ నుండి వచ్చినవారు పది నిముషాలు వారి ప్రవచనాన్ని వినిపిస్తారని ప్రకటించారు. సర్దార్ సింగుతో పాటు నేను వేదికపైకి వెళ్లాను. గురుదేవులు ప్రవచనానికి ముందు గాయత్రీ మంత్రం పఠించేవారు. వారు చెప్పిన రామాయణ విశేషాలు గుర్తు చేసుకున్నాను. రామాయణ విశేషాలు వివరించాను. పది నిముషాలు అవగానే, నాకు కేటాయించిన సమయం అయిపోయినందున ముగిస్తున్నానని చెప్పాను. సభలో కలకలం. ఈ పండిత్‌కు మరికొంత సమయం ఇవ్వాలని అరుపులు. వీరి ఉపన్యాసం రేపు విందురుగాని అని సభా నిర్వాహకులు అన్నా, ఇప్పుడే వారు మాట్లాడాలని పట్టుపట్టారు. నిర్వాహకులు తప్పని సరిగా నన్ను మాట్లాడమని కోరారు. నేను నా ప్రవచనం చాలాసేపు పడుతుందని చెప్పాను. ఎంత సమయమైనా సరే నేను మాట్లాడాలని సభలోనివారు కోరారు. రామాయణ కథలో పాత్రల మధ్యగల పరస్పర అనుబంధాన్ని గూర్చి, కుటుంబ సంబంధాలను గూర్చి వివరంగా ప్రసంగించాను. ఈ విధానం సభికులను ఆకట్టుకొంది. వారంతా వేదికమీద నన్ను చుట్టుముట్టారు. యజ్ఞం చేయించగలరా- అని వారు నన్ను అడిగారు. గాయత్రీ తపోభూమిలో నేను చేసే పని అదేనని చెప్పాను. అయితే రేపు మీరే ఈ యజ్ఞాన్ని చేయించాలని అరవడం మొదలుపెట్టారు. ఇతర పండితులు అభ్యంతరం చెప్పారు. ఈయన యజ్ఞం చేయిస్తే మేమంతా యజ్ఞకుండంలో దూకుతామని బెదిరించారు. కాని అక్కడి సభికులు వారిని నిరోధించి, అభ్యంతరం చెప్పడానికి వారికి ఏ విధమైన హక్కూ లేదని తేల్చారు. వారు ఇంకా అభ్యంతరాలు చెపితే తమ యిండ్లలోని కార్యక్రమాలకు వారిని పిలవమన్నారు. వారితో అన్ని సంబంధాలూ త్రెంచుకోటానికి సిద్ధమైనారు. ఆ విధంగా వారు అక్కడ నేను యజ్ఞం చేయడానికి అంగీకరించారు. వెంటనే వేదికపైనుండి సభికులనందరినీ -స్త్రీ పురుష భేదం లేకుండా- మరునాటి ఉదయం స్నానాలు చేసి యజ్ఞం దగ్గరకు రమ్మన్నాను. వారు ఆశ్చర్యపోయారు- ఇక్కడి పండితులు యజ్ఞం వారే చేసేవారు; కాని గాయత్రి పండితులు అందరినీ యజ్ఞం చేయడానికి రమ్మంటున్నారు అని. మరునాటి ఉదయం వారంతా యజ్ఞశాలకు వచ్చారు. వారంతా పంచలు కట్టుకుని రాలేదు. అయినా అదే విధంగా వారు యజ్ఞం చేయడానికి అంగీకరించి, వారిచేత గురూజీ వ్రాసిన విధంగా చక్కగా యజ్ఞం చేయించాను. గాయత్రీ మంత్రాన్ని వారు ఏకకంఠంతో చదివేటప్పుడు వారి కండ్లలో నీరు చూసాను. ముందే ఏర్పాటు చేసిన విధంగా గురుదేవుల పుస్తకాలు అక్కడ తయారుగా ఉన్నాయి. కొంచెం సేపటిలో ఆ పుస్తకాలను వచ్చినవారు తలా ఒకటి కొన్నారు.

సత్సంగః స్వర్గవాసః. సత్సంగమే స్వర్గ నివాసం.

ఒకవేళ, అక్కడ నా ప్రవచనం జరగపోయినా, కనీసం తన ఆలోచనలు ఆ విధంగా వ్యాపిస్తాయని గురూజీ ఉద్దేశ్యం. గురూజీ సాహిత్యం అంతా అమ్ముడైపోయింది. ఆ రోజు సాయంత్రం నా ప్రవచనం బదులు, ఒక అమ్మాయిని ఉపన్యాసానికి పిలిచారు. కాని అక్కడి సభికులు గాయత్రి పండితులే ఆ రోజు గూడా మాట్లాడాలని నిలదీశారు. నేను గాయత్రీ మంత్రం పఠించి, గురుదేవులను స్మరించాను. గీతమీద ప్రవచనం చేయాలని నిర్ణయించాను. గురూజీ నుండి చాల వివరంగా గీత విషయాలు విన్నాను. అందుచేత గీతా ప్రవచనం చేసాను. ఈ రోజు విన్న విషయాలు ఇదివరకెప్పుడూ వినలేదని అందరూ ప్రశంసించారు. ఈ విధంగా సభ్యులందరి చేతా యజ్ఞం చేయించినవారు లేరు. ప్రవచనం తర్వాత జనం వేదికమీద గుమిగూడారు. వారిని తప్పించుకొని బయటకు రావడానికి నేను చాలా కష్టపడాల్సివచ్చింది. మొదటిరోజున అక్కడి పురోహితులు యజ్ఞం చేయించారు. రెండోరోజు నేను చేయించాను. మూడోరోజు అక్కడికి వచ్చిన జీవసమూహాన్ని అదుపుచేయడం కష్టమైంది. హాజరైన వారందరినీ ఒక చెడ్డ అలవాటును యజ్ఞందగ్గర గురుదక్షిణగా వదలమని చెప్పాను. చాలమంది చుట్ట, బీడీ, సిగరెట్ త్రాగడం, మద్యం సేవించడం, మాంసభక్షణ, పరస్త్రీ వ్యామోహం మొదలగు వాటిని విసర్జించారు. ఒకమంచి అలవాటు తీసుకున్నారు. ఈ పద్ధతి భుసావల్‌లో క్రొత్త ఒరవడి సృష్టించింది. అందరినీ ఆకర్షించింది. యజ్ఞపరిసమాప్తి అనంతరం, నేను అక్కడి పురోహితులకు– యజ్ఞకుండంలో దూకుతామన్నవారు దూకవచ్చు అని చెప్పాను. వారంతా సిగ్గుతో తలలు వాల్చారు. ఆదిత్యకుమార్ సిన్హా ఇప్పుడు అక్కడ శక్తిపీఠాన్ని నిర్వహిస్తున్నారు. రేయింబవళ్లు గాయత్రీ పరివార్ కోసం శ్రమిస్తున్నారు. వారు యజ్ఞం అనంతరం అక్కడకు వచ్చారు. అక్కడే, అప్పుడే గాయత్రీ పరివార్ శాఖ ప్రారంభమైంది. నేను మథురకు తిరిగి వచ్చాను. అక్కడి ప్రజలు స్టేషనుకు వీడ్కోలు ఇవ్వడానికి వచ్చారు. రైలుబోగీని అలంకరించారు. ఆ బోగీలో నేను ఎక్కాను. రైల్వే అధికారులు ఆ బోగీలో ఒక భాగాన్ని నాకు కేటాయించారు. ఇతరులెవ్వరూ దానిలోనికి ప్రవేశించకుండా చేసారు. దారిలో నాకు ఫలహారాలు ఏర్పాటుచేయమని గార్డుకు, ఇంజను డ్రైవరుకూ చెప్పారు. ప్రతిస్టేషనులో రైల్వే అధికారులు నాకు సత్కారాలు చేశారు. డ్రైవరూ, గార్డూ మారేటప్పుడు క్రొత్త వారితో నన్ను జాగ్రత్తగా చూసుకోమని చెప్పారు. అలా మథుర స్టేషను వరకూ ఏర్పాట్లు చేసారు. మథురలో నా సామాను రిక్షా వరకు తెచ్చి వీడ్కోలు తీసుకున్నారు.

ప్రయాణంలో నేను సంత్ జ్ఞానేశ్వర్‌ను గుర్తు చేసుకున్నాను. ఒక గేదెను వారు వేద మంత్రాలు చదివే విధంగా మార్చారు. ఇప్పుడు నాకు ఆ విషయం అర్థమైంది. మామూలు మనిషినైన నన్ను, ఈ విధమైన సన్మానాలకు అర్హుణ్ణి గావించారు గురుదేవులు. వారి శక్తి అటువంటిది. అలాగే, సంత్ జ్ఞానేశ్వర్ గేదె చేత వేద మంత్రాలు చెప్పించి ఉంటారు. భుసావల్ ప్రజలు నన్ను ఒక జ్ఞానిగా సన్మానించారు. గురూజీ మామూలు వ్యక్తిని తన శక్తితో మహిమాన్వితునిగా జేయగలరు. ఇటువంటి గురువుతో నాకు పరిచయం కల్గటం నా అదృష్టం. వారు నా అజ్ఞానాన్ని తొలగించారు. మథుర వెళ్లిన తర్వాత, గురూజీ నాతో, 'నీవు నా పని చేయి. మిగతాది నేను చూసుకుంటాను. నేనూ, మాతాజీ ఎల్లప్పుడూ నీతో ఉంటాము. నీవంక ఎవరైనా వక్రదృష్టితో చూస్తే వారి కళ్లు పీకేస్తాము"– అన్నారు. ఈ రోజుకు కూడా నేను ఏకాకిని అని భావించను. గురుదేవులు నాతోనే ఉన్నారు. నన్ను అన్నివిధాలా కాపాడుతున్నారు. దాంతో నాకు భయం అనేది పోయింది. అందువల్ల ఎంతటి కార్యక్రమాన్నైనా చేపట్టగల్గుతున్నాను. ప్రతివారికీ ఈ మార్గం తెరిచే ఉంది. గురుదేవులు మానవులుగా కనబడుతూన్న శక్తి స్వరూపులు. వారి ఆలోచనలను రోజూ రెండుగంటలపాటు ప్రచారం చేయండి. గాయత్రి అనగా మంచి ఆలోచనలు. యజ్ఞం అంటే మంచి పనులు చేయడం. వీటిని మన జీవితాల్లో అమలు చేయండి. ప్రతివారూ యజ్ఞమయ జీవితాన్ని గడపాలి. యజ్ఞం అనేది ఒక ప్రక్రియ మాత్రమే. భుసావల్ ఉదంతం తర్వాత నాకు బాగా ధైర్యం వచ్చింది.

★★★

**విశ్వాసఘాతినో న నిష్కృతిః కృతఘ్నుడికి ప్రాయశ్చిత్తం లేదు.**

ధారావాహిక : మిత్రమా! తెలుసుకో ఆత్మను-6

# నిర్భయత్వానికి రాచబాట ఆత్మజ్ఞానం

ఆత్మయొక్క స్వరూపాన్ని గురించి, స్వభావాన్ని గురించి, అనుభూతిని గురించి వ్యాఖ్యానిస్తూ ఋషి-విశ్వంలోని సమస్త ప్రాణులలో వ్యాపించి ఉండే చైతన్యమే ఆత్మ అని చెప్పారు. అది మిక్కిలి రహస్యము, అందనిది అయిన తత్త్వం. అందువలననే లోకులు దానిని ప్రత్యక్షంగా చూడలేరు. చిత్తవృత్తులు గతిశీలములుగా, కదిలేవిగా కనపడతాయి. అందువలన మనస్సు లేక చిత్తమే ఆత్మ అన్న భ్రమ కలుగుతుంది. నిజానికి చిత్తం ఆత్మ కాదు. ఆత్మ గొప్ప ప్రకాశం గల తత్త్వం. చైతన్యం, ఆత్మల అనుభూతికి ఏకైక ఉపాయం నిరంతరం వానిని గురించి ఆలోచించుట, చింతించుట. విద్వాంసులైనవారు అక్షరం, అవినాశి, అజరం, అమరం అయిన ఆ ఆత్మ చింతనయే చేస్తూ ఉంటారు. ఆత్మసంబంధమైన ఆధ్యాత్మిక వికాసానికి కావలసినంత సమయాన్ని కేటాయించి, మిగిలిన సమయాన్ని మాత్రమే లౌకిక జీవనానికి వాడతారు. ఆత్మయొక్క గుణాలను గురించి, దాని లక్షణాలను గురించి ఆలోచించడమే వారి స్వభావంగా ఉంటుంది. దానిలోనే వారికి అంతులేని తృప్తి కలుగుతుంది.

దీర్ఘతముడి శిష్యులలో ఆరోజున విలక్షణంగా నిశ్శబ్దం ఆవరించింది. చరిత్ర, భూగోళం, జీవశాస్త్రం, రసాయన శాస్త్రములకు చెందిన పాఠాలు అతి తేలికగా అర్థమౌతున్నాయి. కానీ ఆత్మవిద్యకు సంబంధించిన విషయమే మిక్కిలి గూఢంగాను, రహస్యంగాను ఉండి అర్థం కావటంలేదు. దీర్ఘతముడు ఎంత ప్రయత్నించినా, ఎంత వివరించి చెప్పినా విద్యార్థులకు అర్థం కావడంలేదు.

ఆత్మకు సంబంధించిన విషయం ప్రతి విద్యార్థి స్వవిషయము. అందువలన అది అన్నిటికన్న అవసరమైన విషయమయింది. ఎప్పుడు ఆ విషయానికి సంబంధించిన తరగతి వస్తుందో అప్పుడు వాళ్లలో గాంభీర్యం పెరిగేది. వాళ్లలో తన్మయత ఏర్పడేది. కానీ నేటివరకూ వారికి ఆత్మయొక్క చైతన్య స్వరూపానికి సంబంధించిన జ్ఞానం కలుగనే లేదు.

మధ్యాహ్నం కన్న ముందే విద్యాలయం మూసివేయబడినట్లు శంఖనాదం చేయబడింది. విద్యార్థుల హృదయాలు "నేనేమిటి ? ఎక్కడ నుంచి వచ్చాను ? ఎందుకు వచ్చాను?"-అన్న ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకునే ఆతురతతో నిండాయి. విద్యర్థులందరూ తమతమ పటకుటీరాలలోకి వెళ్లిపోయారు. మధ్యాహ్న సమయంలో ఉండే అలజడి ఎక్కడా వినబడటంలేదు, కనబడటంలేదు. ఆ శ్రమమంతా చిన్నపోయింది, ప్రశాంతత నిండిపోయింది.

సూర్యుని రథం కొంచం పడమటికి తిరిగింది. మళ్లీ ఘంట మ్రోగింది. విద్యార్థులందరూ ఒక చోటకు చేరారు. ఎవరి చేతిలోనూ వ్రాయడానికి గంటం తానీ తాటాకులు గానీ లేవు. ఏ విధమైన చప్పుడు గానీ, మాటల సవ్వడిగానీ లేదు. ఋషి ఒకవైపు వెడుతున్నారు. విద్యార్థులు ఆయన వెనుక వెళ్లడం మొదలుపెట్టారు. ఒకేవరుసలో క్రమశిక్షణతో ఆయనవెనుక నడుస్తున్నారు అందరూ.

గంగానదికి గల శ్మశాన ఘట్టం దగ్గర అందరూ ఆగిపోయారు. ఆ రేవుకు కట్టిన మెట్లను ఆనుకుని ఒక శవం తేలుతోంది నీళ్లలో. ఋషి దానిదగ్గరకు వెళ్లాడు. విద్యార్థులందరూ మెట్లమీద బారులు తీరి కూర్చున్నారు.

ఋషి పారాయణ ప్రారంభించారు. శవం యొక్క ఒకొక్క అవయవం వేపు చెయ్యి చూపిస్తూ ఆయన- ఈ రెండు చేతులూ మన చేతుల వంటివే. వాటివలెనే తయారు చేయబడ్డాయి. మాంసముతోను, వేళ్లతోను ఉన్నాయి. కానీ, యీ చేతులు కదలవు, లేవవు. శవానికి కళ్లున్నాయి. కానీ అవి చూడలేవు. చెవులున్నాయి. కానీ వినలేవు. అనేకరకాల తినుబండారాలు తినిన నోరు ఇప్పుడూ ఉంది గానీ అది ఇప్పుడు తినలేదు. ముక్కు గాలి పీల్చలేదు. గుండె కొట్టుకోవడంలేదు. శరీరమైతే ఎప్పటిలాగే ఉంది. కానీ దానికి రూపం, రసం, వాసన, ఆకాశం, సూర్యచంద్రులు, వెలుతురు, వాన, నిప్పు మొదలైన వస్తువులన్నీ లేనివాటిలో లెక్కే.

ఈ శరీరాన్ని క్రియాశీలం చేసే శక్తి దీనినుంచి వేరయిపోయింది. నిప్పునుంచి వేడి, నీటినుంచి చల్లదనమూ పోయినట్లు ఆ శక్తి పోయింది. ఆ శక్తి ఉన్నంతరకు ఈ శవం

**శ్వః కార్యమద్య కుర్వీత. రేపు చేయవలసిన పని నేడే చేయాలి.**

క్రియాశీలంగా ఉండేది. ఆ శక్తి పోగానే ఇది ప్రాణం పోయిన పీనుగయింది.

చీమలు, పక్షులు, ఏనుగులు, దున్నపోతులు, ఆవులు, ఎద్దులు, కాకులు, గద్దలు మొదలైన వాటినుండి మనుష్యుల వరకు అన్నిటిలోను ఇటువంటి ఒక చేతన ఉంది. ఐతే కొన్ని ప్రాణులలో ఆ శక్తి తక్కువ ఉండవచ్చు, కొన్నిటిలో ఎక్కువ ఉండవచ్చు. వృత్తులు, సంస్కారములు వేరు వేరు కావచ్చు. కానీ చూడడం వినడాలలో, పని చేయడంలో, కోరికలను తీర్చుకోవడం విషయంలో, శ్రద్ధ వహించడంలో, ప్రేమను చూపడంలో, కామమును ప్రదర్శించుటలో, ఆహార నిద్రా భయాదులలో అన్ని జీవుల ప్రవృత్తీ ఒకే విధంగా ఉంటుంది. అందరిలో ఈ శక్తి ఒకే రూపం, ఒకే గుణం కలది మనకు లభిస్తుంది. అందువలననే దానిని ఆత్మ అని పిలుస్తారు. ఈ ఆత్మయే ఆకాశ రూపంగాను, శక్తి లేక చైతన్యరూపంగాను వివిధ శరీరాలలో వ్యాపించి ఉంటుంది. కానీ శరీరాలతో దానికి ఏ విధమైన సంబంధమూ లేదు. అది అజరము, అమరమునై, నాశనము లేనిదై, ఎల్లప్పుడూ చైతన్యము కలదై కూడా స్థూల పదార్థములతో కలిసి ఉండడం వలన అదికూడా పుడుతుందని, చేస్తుందని అనిపిస్తుంది. సుఖ, దుఃఖాలకు భ్రమయే కారణం.

చైతన్యం ఆత్మయొక్క శుద్ధమైన తత్వం. చిత్తమన్నది దానికి గల ఒక గుణం. కోరికలు, వాసనలు, ప్రవృత్తులు ఆ చిత్తానికి చెందినవిగాని ఆత్మవి కావు. అందువలననే ఈ శరీర ప్రవృత్తులైన కామ,భోగ,సౌందర్య సుఖాలే జీవితమని తలిచేవారు తమ జీవితం యొక్క అసలు ఉద్దేశ్యం నుంచి దూరమైపోతారు. చైతన్యం యొక్క జన్మ ఆనంద, పరమానందాలను పొందడానికే జరిగింది. ఐతే చిత్త వృత్తులు దానిని క్షణభంగురములైన సుఖాలవైపు ఆకర్షించి త్రోవ తప్పిస్తాయి. మనిషి ఈ ప్రాపంచిక కామక్రీడలలో మునిగిపోయి ఉంటాడు. దానితో అతని చైతన్యం అంతరించిపోతుంది. అతను ఈ ప్రాపంచిక దుఃఖాలు, ప్రారబ్ధం, సంస్కారాల బరువు నెత్తికెత్తుకొని చివరకు కన్ను మూస్తాడు. చిత్తం యొక్క మాలిన్యం కారణంగానే ఆతని నశించని తత్వం మళ్లీ మళ్లీ పుట్టడం జరుగుతుంది. దానివలన పరమానందాన్ని అందుకోలేకపోతాడు. సుఖాలయందు భ్రమ కలిగించే ఈ చిత్తమే ఆత్మకు లేక చైతన్యానికి బంధనమౌతుంది.

"ఏకాలంలోనైనా, ఏ వ్యక్తికి గానీ ఆత్మజ్ఞానం లేకుండా ముక్తి దొరకదు"–అంటూ ఋషి ఇంకా బోధిస్తున్నారు. ఒక శిష్యుడు, "గురుదేవా ! ఈ ఆత్మ ఇంత సూక్ష్మం, రహస్యం, కనపడనిదీ ఐతే దానిని పొందడమెలా ? ఈ చిత్తప్రవృత్తుల ప్రభావం నుంచి తపుకోవడమెలా?" అని ప్రశ్నించాడు.

ప్రశ్నించి శిష్యుడు కూర్చున్నాడు. ఋషి అతని ప్రశ్నకు సమాధానం చెబుతూ, "నేను శరీరాన్ని–అని జీవుడు ఎంతవరకు భావిస్తాడో అంతవరకు కోటి ఉపాయాలకు కూడా శాశ్వతమైనవి ఆత్మకు లక్ష్యములైనవి ఐన సుఖ శాంతులను పొందడం కుదరదు. మనం శరీరం కాదు; శరీరంలో మనం కూర్చున్నాము. శరీరాన్ని ఒక వాహనంగా చేసుకుని అందులో మనం కూర్చున్నామంతే. ఐనా మనను మనం శరీరమనుకుని అన్ని పనులూ చేస్తాము. ముందు ఈ భావనను ఆపాలి. నేను శరీరాన్ని కాను; శరీరం, ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి మొదలైన అంతఃకరణ చతుష్టయానికి వేరయిన శుద్ధ ఆత్మను – అన్న నిశ్చయజ్ఞానం కలగాలి. కొన్నిరోజులు ఈ విధంగా నిరంతర చింతన చేయడం వలన ఆత్మిక భావం గట్టిపడుతుంది, ఆత్మ కళ్యాణమార్గం కళ్లబడుతుంది.

ఋషి విషయాన్ని లోతుగా వివరించడంలో మునిగిపోయారు. సూర్యుడు అస్తాచలం వైపుకు వేగంగా వెడుతున్నాడు. కానీ ఎంతో ఆనందాన్ని కలిగించే ఆత్మ విషయంలో మునిగిన శిష్యులందరూ కదలకుండా తన్మయత్వంతో కూర్చుండిపోయారు. వారికి తెలుసుకోవాలనే కోరిక తీరడం లేదు; లేద్దామన్న కోరిక లేకుండాపోయింది. ఆశ్చర్య, కుతూహలాలతో అందరూ ఎంతో శ్రద్ధగా గురుదేవుని ప్రసంగం వినడంలో మునిగిపోయారు. ఋషి ఇంకా ఇలా వివరిస్తున్నారు–

"ఆత్మ తనంతట తాను జ్ఞానస్వరూపం. జ్ఞానాన్ని పొందడానికి ప్రత్యేకంగా కష్టపడవలసిన అవసరం లేదు. దొరకని వస్తువును దొరికించుకోవడానికి ప్రత్యేక ప్రయత్నం చేయాలి. కానీ తానే జ్ఞాన స్వరూపమైనప్పుడు తనను తాను వెతుక్కోవడానికి అడవులలో తిరగనక్కరలేదు; జీవితాన్ని ఎండగట్టుకోవడం గానీ, కఠినం చేసుకోడం గానీ అవసరమే లేదు. తనలో ఉన్న అహంకారాన్ని పోగొట్టుకోవాలంతే. కారణమేమంటే– ఈ భ్రమ కూడా ఆత్మవలె అనాది, అనంతము. అందువలన తన శక్తి

ప్రచ్ఛన్న పాపానం సాక్షిణో భూతాని. రహస్యంగా పాపాలు చేసేవాడికి పంచభూతాలే సాక్షులు.

స్వరూపాన్ని, జ్ఞాన స్వరూపాన్ని, చైతన్య స్వరూపాన్ని గట్టిపరుచుకోవడానికి ఎంతో లోతుగా ఆలోచించడం అవసరమౌతుంది. ఆత్మను పొందడానికి ఎన్నిరకాల సాధనలను, ఉపాసనలను ఏర్పాటు చేయడం జరిగిందో, అవన్నీ ఈ మాటనే గట్టిపరుస్తాయి. అదేమిటంటే–"నీవు శరీరానివి కావు. మనస్సు, ఇంద్రియాలు కానీ కావు. వీటికి పైన అనంత శక్తిస్వరూపమైన ఆత్మవు నీవు. ఆత్మకు ఏవిధమైన బంధనాలూ ఉండవు. తన కోరిక, సంకల్ప బలాలతో ఆత్మ ఎక్కడికైనా పోగలదు. వెలుగుతూ ఆడుతుంది. దానికెవరూ చుట్టాలుగానీ, కొడుకులు గానీ, భార్యగానీ లేరు. అందరూ వివిధ రూపాలలో ఆత్మయే. తమతమ చిత్తవృత్తులను బట్టి సోదరుడుగా, తల్లిగా కనబడతాయి. ఆ బంధాల నుండి బైటపడి, రాగ,ద్వేష,మమతలను వదిలి, కేవలం కర్తవ్య నిర్వహణ మీద దృష్టి పెట్టి ఎవరైతే ఆత్మయందే రమిస్తారో ఆత్మను గురించే ఆలోచిస్తారో, ఆత్మయొక్క గుణాలకు తగినట్లుగా ఆచరణ చేస్తారో–అట్టివారు చివరకు లౌకిక భోగాలను అనుభవిస్తూనే ఆత్మప్రాప్తిని సాధించగలుగుతారు. మనస్సు,ప్రాణం,ప్రకృతులను బట్టి వేరువేరు రూపాలుగా కనబడినా– మీరు, మేము, నిజానికి ఒకే ఆత్మలము. ఇదే విషయాన్ని– ఆత్మయే వివిధ రూపాలలో కనబడుతూ ఏవిధమైన బంధనాలూ లేని పరమాత్మగా మారవలెనని కోరుతుంది–అనిచెప్పవచ్చు. ఈ తత్త్వరూపాన్ని ఎవరు వెతుకుతారో వారు తమలక్ష్యాన్ని చేరినవారౌతారు. ఇందుకు భిన్నంగా– ఎవరైతే తమ అహం వృత్తిలోనే కొట్టుమిట్టాడుతూ ఉంటారో, అట్టివారు సుఖస్వరూపులైనా దుఃఖాలను అనుభవిస్తూ, బంధనాల నుంచి విడిపడి కూడా వాటిలోనే ఇరుక్కుపోతారు.

"జీవనకాలంలో ఇది నా సాధనం, ఇది నా ఇల్లు, నేను తింటాను, నేను పండితుడిని, జ్ఞానిని, నేను అందరికన్న అందగాడిని – అని చెప్పుకునేవాడే ఎక్కడికో పారిపోతాడు. శరీరం మాత్రం అట్లాగే ఉంటుంది. మనస్సు, అహంకారాలకు తాను వేరని అర్థం చేసుకోవడంలోనే ఆత్మయొక్క సారమంతా దాగి ఉంది. ఇదే సిద్ధాంతాన్ని నిరంతరమూ చింతన చేయడం వలన ఈ భావం బలపడుతుంది.

"ఈ ఆత్మ మనస్సు, అహంకారాల నుంచి వేరుగా ఉండి తన పనిని చేసుకుంటూ పోతుంది. మనస్సు, అహంకారాలు నిజానికి మేలుకుని ఉన్నపుడే ఉంటాయి. కానీ ఆత్మ శాశ్వతమైనది, అనాది అయినది. ఇందుకే విద్వాంసులు నిరంతరం ఆత్మ చింతనలోనే ఉండి చివరకు సుఖంగా ఆత్మభావంలోనే అంతర్హితులై పరమాత్మకు శరణాగతులౌతారు".

సూర్యుడు ఇంచుమించు అస్తమించే స్థితిలో ఉన్నాడు. సంధ్యాసమయమయింది. అది గమనించిన ఋషి తన పాఠాన్ని ముగించారు. దాంతో విద్యార్థుల ఏకాగ్రత చెదిరిపోయింది. వాళ్లు ఆత్మయొక్క చింతనలో మునిగిపోయారు కొద్దిసేపు. అదే ఆత్మయొక్క నిజమైన లక్ష్యం. అందరూ గురువు చెప్పిన పాఠం అర్థమయిందన్న ఆనందంలో ఉన్నారు. ఋషి అడుగు జాడలలో నడుస్తూ అందరూ గురుకులానికి తిరిగి వచ్చారు; తమతమ సంధ్యాపూజలో లగ్నమయారు.

## ఆత్మను తెలుసుకోండి

చేసిన పాపాల వలన, ముసలితనం వలన, మరణం, ఆకలి దప్పికల చింతలవలన, భయంవలన కలిగే అనేక సంకల్ప వికల్పాలను పుట్టించే శోకం, ఉద్రేకములు మొదలగు వాటితో సతమతమవుతూ జీవితం యొక్క సహజ స్వాభావికమైన సుఖాన్ని, లాభాలను కూడా మనిషి పొందలేక పోతున్నాడు. దేవతలకు కూడా లభించని మానవ జన్మను బరువైనదిగా, ఒక శాపంగా భావించుతూ జీవిస్తాడు. భయంవలన కలిగే పనికిరాని ఆలోచనలు అతనిని స్థిమితంగా నిద్రపోనీయవు, సుఖంగా బ్రతకనియ్యవు. ఈ బాధలన్నిటి నుంచీ బయటపడి సుఖవంతము, మధురమునైన జీవితాన్ని వెతుక్కోవడానికి మనిషి ఆ విషయానికే ప్రాధాన్యాన్ని ఇస్తాడు.

"య ఆత్మాపహతపాప్మా విజరో విమృత్యుర్వి శోకోసోఽన్వేష్టయః స విజిజ్ఞాసితవ్యః"(ఛాందోగ్యం–8–7.1)

అనగా–

ఏది పాపాలు లేనిదో, ముసలితనము లేనిదో, మరణం లేనిదో, శోకం లేనిదో, ఆకలి దప్పికలు లేనిదో, ఏది సత్యమును కోరునో, సత్యసంకల్పము కలదో – దానినే వెతకాలి. దానినే తెలుసుకోవాలని కోరుకోవాలి, ఆ తత్త్వమే 'ఆత్మ'.

**కష్టించి పనిచేయడం దేవునికి శరీరం చేసే ప్రార్థన.**

నిజానికి ఆత్మయే జరామరణాలు, ఆకలిదప్పులు, అన్ని విధాలైన భయ సందేహాలు, సంకల్ప వికల్పాలు లేని నిత్యముక్తం, అజరం, అమరం, అవినాశి అయిన తత్వం. దానిని తెలుసుకున్న మీదటనే మనిషి అన్నిరకాల భయాల నుంచి, శోకాల నుంచి, చింతలు, క్లేశాల నుంచి విముక్తుడౌతాడు.

ఆత్మ అంతటా వ్యాపించిన నిత్యతత్త్వం. ఆత్మయే జీవనం యొక్క మూలసత్యం. దాని వెలుగులోనే బైటి ప్రపంచం, మానవ జీవితంలోని కార్యకలాపముల యొక్క ఉనికి ఉంది. ఆత్మ అన్న తెరమీదనే కండ్లకు కనబడే ఈ జగత్తు, అందులో సాగే జీవనాల బొమ్మలు కలుస్తూ, విడిపోతూ ఆడతాయి. జగత్తంతా ఆత్మయొక్క అభివ్యక్తి, దాని విస్తరణయే. ఐతరేయ బ్రాహ్మణము (1.1)లో –

**"ఆత్మా వా ఇదమేక మేవాగ్ర ఆసీత్ నాన్య త్ కించిన మిషత్ । సీక్షత లోకాన్ సృజాయితి॥"** అని తెలుపబడింది

అనగా –

పూర్వము ఆత్మ ఒక్కటే కలదు. మరే తత్త్వములూ లేవు. ఆ ఆత్మనుంచే అనేక లోకాల సృష్టి జరిగించి.

ఛాందోగ్యోపనిషత్‌లో (4.25.2) "ఆత్మై వేదం సర్వమ్" ఆత్మయే యీ అన్నీ – అని తెలుపబడింది. ఆత్మయొక్క భూతలంలోనే యీ కనబడే జగత్తు పుడుతుంది, అంతమౌతుంది. దానిమీదనే ఈ సృష్టి, లోకముల చక్రం తిరుగుతూ ఉంటుంది. ఐతే ఈ ఆత్మతత్త్వం తన నిత్యస్వరూపంలో ఎల్లప్పుడూ స్థిరంగానే ఉంటుంది. అనంతమైన ఆకాశం మధ్యలో గ్రహ నక్షత్రాల క్రియా కలాపాలు నడుస్తూనే ఉంటాయి; అనేక ఉల్కలు నక్షత్రాలౌతాయి, మరల నశిస్తాయి; కానీ ఆకాశం మాత్రం తన గురుగంభీర అవిచల స్వరూపంలో స్థిరంగానే ఉంటుంది. అదే విధంగా అంతటా వ్యాపించిన ఆత్మతత్త్వంమధ్యలో అనేక పదార్థాల పుట్టుక, అంతములు జరుగుతుంటుంది. కానీ ఆత్మతత్త్వం మీద వాటిప్రభావం పడదు. అది ఎల్లప్పుడూ నిత్యంగా ఉంటుంది.

అంతటా వ్యాపించిన విరాట్ ఆత్మసత్తాయే బ్రహ్మ. "అయమాత్మా బ్రహ్మ।" (బృ.ఉప.2.5.11) ఈ ఆత్మయే బ్రహ్మయని ఉపనిషత్ కారుడు తన అనుభూతి ఆధారంగా తెలిపారు. ఆత్మయే పరమాత్మ లేక ఈశ్వరుడు. ఆత్మతత్త్వము యీ జగత్తును, దేహమును, ఇంద్రియాలను, లోకంలోని పదార్థాలను ప్రకాశింపజేసినప్పుడు అది అనేక రూపాలలో కనబడుతుంది. నీటి చుక్కలు సముద్రంలో పడేటప్పుడు వేరువేరుగా కనబడినా– అవి సముద్రంలో పడిన తరువాత దానితో ఏకమైపోతాయి. అదేవిధంగా ఆత్మ, పదార్థాలు ఒకటైపోతాయి. ఆత్మ ఆదిలోను, అంతంలోను ఒకే రూపంలో స్థిరంగా ఉండే నిత్యతత్త్వము. అది విరాట్, భూమా. "యోవైభూమా" అని ఆత్మప్రబోధ ఉపనిషత్ (19)లో తెలుపబడింది.

**"ఘటావభాసకో భానర్ఘటనాశేననశ్య**
**దేహావభాసకః సాక్షీ దేహనాశేన నశ్యతి"**

"ఏవిధంగానైతే కుండను ప్రకాశింపజేసే సూర్యుడు కుండ పగిలిన తరువాత నష్టంకాడో, అదే విధంగా దేహం నశించినా ఆత్మ నశించదు. సూర్యుని వెలుగు వేరువేరు కుండలలో పడినప్పుడు వేరువేరుగా కనబడుతుంది. కానీ అది ముక్కలు కాదు. అదే విధంగా ఆత్మకూడా అనేక శరీరాలను, పదార్థాలను ప్రకాశింప జేస్తూ కూడా ముక్కలు ముక్కలవదు.

నేలమీద చిన్నపిల్లలు మట్టితో అనేక బొమ్మలు చేస్తారు. తరవాత విరక్కొడతారు. అదే విధంగా శిల్పులు అనేక విగ్రహాలు తయారు చేస్తారు. కొంతకాలానికి అవి విరిగిపోతాయి. వీటిలో కూడా మొదట్లోను, చివరలోను మట్టిగానీ, నేలగానీ తమ రూపంలో స్థిరంగా నిలిచే ఉంటాయి. అదేవిధంగా ఆత్మ అన్న తెరమీద ఈ జగత్తు, అనేక పదార్థాలు పుట్టడం, పోవడం జరుగుతూనే ఉంటుంది. కానీ ఆత్మతత్త్వం తన నిత్యస్వరూపంలో స్థిరంగా ఉంటుంది.

ఇదే విధంగా మానవజీవనం, సమస్త జగత్తు, పదార్థముల తత్వములు, సర్వత్రా వ్యాపించిన ఆత్మతత్త్వం– వీటిని తెలుసుకున్న మీదట మనిషి జీవితంలో సంభవించే వివిధ మార్పులు, పుట్టుకలు, చావులు, లాభనష్టాలు, సుఖ దుఃఖాలు, భయ శోకాలు మొదలుగువాటినుంచి విముక్తిని పొందుతాడు. అతని సమస్త పాప, తాపాలు, వికృతులు వెనుకకు తిరిగిపోతాయి. ఆత్మవిదుడై, ఆత్మస్థిరుడై మనిషి సుఖ, శాంతి, ఆనందముల సహజావస్థను పొందుతాడు. ఆత్మయొక్క సత్యత్వానికి సంబంధించిన జ్ఞానం కలుగగానే మనిషి సహజంగానే ఈ

**సూర్యుడు నేర్పే పాఠాలు: అహంకారశూన్యత, ఆత్మార్పణ, అఖండ కర్తవ్య పరాయణత, సమయ పాలన.**

సంసారానికీ, దానికి చెందిన పదార్థాలకూ అంటుకోకుండా నిస్పృహుడౌతాడు. సహజంగా ఈ జగత్తు, దీనికి సంబంధించిన పదార్థాలు, ఉపకరణాలనే జీవన సత్యాలుగా తలచేవారే అనేక ఉపాయాలతో పదార్థోపకరణాలను ప్రోగు చేసుకుంటారు. ఇందుకోసం ఒకరికొకరు చెరుపుచేయడానికీ, దోపిడీ జేయడానికి, నాశనమొనరించడానికి వెనుకాడరు. ఒకరినొకరు ఎదిరిస్తూ రాత్రింబగళ్ళు అశాంతి, క్లేశం, ఉద్రేకాలకు భాగస్వాములౌతారు. కానీ ఆత్మజ్ఞాని ఈ సంసారము యొక్క, ఇందలి వివిధ పదార్థముల యొక్క క్షణభంగురత, అనిత్యతలను గ్రహించి ఆత్మయొక్క స్వభావానుసారం స్వర్గతుల్య జీవనాన్ని గడుపుతాడు. అతను పదార్థాలకు చెందిన మోహమన్న గంధము మీద గద్దలా విరుచుకు పడడు, ఎవరితోను కొట్టాడడు.

దేహం, ఇంద్రియాలు, సంసారానికి సంబంధించిన పదార్థాలే ప్రధానమని భావించడం వలననే వివిధ రాగద్వేషాలు, ఆశ, అభిలాషలన్న చక్రం తిరుగుతూఉంటుంది. ఎప్పుడైతే మనిషి వీటికి అతీతుడై ఆత్మయొక్క వ్యాపక విరాడ్రూపంలో స్థితుడౌతాడో, పదార్థాల యొక్క తక్కువతనము, శరీరం, ఇంద్రియాలయొక్క అనిత్యత, క్షణ భంగురతలకు చెందిన జ్ఞానం కలుగుతాయే– అప్పుడు అమూల్య మానవ జీవనాన్ని యీ పనికిరాని వాటికోసం పాడుచేయడు. దానితో అతని దుఃఖాలన్నీ వెనుకకు మళ్లుతాయి.

అంతటా ఆత్మ స్వరూపాన్నే చూచే ఆత్మ విదుని ఆంతర్యం నుంచి విశ్వప్రేమ అన్న సురనది ప్రవహిస్తుంది. సత్యము, ప్రేమ, ఆనందం మొదలైనవి ఆత్మయొక్క గుణధర్మాలు. ఎవరిలోపల ఈ పుణ్యప్రవాహం పారుతూ ఉంటుందో అతనికి ఆనందం, శాంతి, సంతోషాలు లభిస్తాయి; అనుభవం కలవాడే వాటిని తెలుసుకుంటాడు. అందరినీ, అన్నింటినీ ఆత్మమయములుగా చూచేవాడు అందరినీ ప్రేమిస్తాడు. అందరినీ ప్రేమించటం, అందరికీ సేవ చేయటం, అందరియందు ఆనందానుభూతి ఆత్మజ్ఞానికి అంగములౌతాయి.

ఆత్మజ్ఞానం మనిషిని చావు పుట్టుకలకు చెందిన భయము నుంచి విముక్తుడిని చేస్తుంది. నిజానికి ముసలితనం, మరణాలకు సంబంధించిన భయం, చింతలు ఎంత భయంకరములంటే – వీటివలన జీవనశక్తి ఎంతో వేగంగా అంతరించిపోతుంది. భయం యొక్క ప్రబలమైన ప్రతిక్రియల వలన లోకులు అనుకోకుండా మరణించడం కనబడుతుంది. కానీ అన్ని భయాలను ప్రధానంగా అన్నిటికన్న గొప్పదైన మృత్యుభయాన్ని తక్షణం పోగొట్టగలది ఆత్మజ్ఞానమొక్కటే. కారణమేమంటే – ఆత్మ చావుపుట్టుకలన్న బంధనాలనుంచి విముక్తమైనది. కఠోపనిషత్‌లో ఆత్మద్రష్టయైన ఋషి –

**"నజాయతే మ్రియతేవా విపశ్చిన్నాయం**
**కుత శ్చిన్న బభూవకశ్చిత్**
**అజోనిత్యః శాశ్వతోఽయం పురాణో నహన్యతే**
**హన్యమానే శరీరే"–**(కఠో 1-2-17)

అని పేర్కొన్నారు. ఈ చైతన్యమయ ఆత్మ ఎప్పుడూ పుట్టదు, చావదు. అది ఎవరి కడుపునా పుట్టలేదు, ఎవరినీ పుట్టించనూలేదు. అది పుట్టనిది, నిత్యమైనది, శాశ్వతమైనది, చిరంతనమైనది. శరీరాలు పోయినా ఆత్మ పోదు. ఆత్మ అక్షయం, అజరం, అమరమునైన నిత్యతత్త్వం. అది చిరంతనం కనుక దానికి పుట్టుక చావులు లేవు. అది వాటికి అతీతమైనది.

ఈవిధమైన అజరామరమైన ఆత్మ సత్తాకు చెందిన జ్ఞానం కలిగితే మనిషి జరామరణ భయాల నుంచి, అన్ని విధములైన భయములనుంచి ముక్తు డౌతాడు. ఆత్మజ్ఞానికి మరణమన్నది కట్టిన బట్టను మార్చుకోవడానికి చేసే ఒక పనివంటిది. అవసరమైతే అతను నవ్వుతూ నవ్వుతూ చావును కౌగలించుకోవడానికి వెనుకాడడు. కారణమేమంటే– దానివలన అతని శరీరం పోతుంది కానీ ఆత్మపోదు.

ఇందువలన జీవితంలో సంతృప్తిని సంపాదించుకోవడానికి, సత్యం, ప్రేమ, ఆనందాలకు చెందిన మిక్కిలి గొప్పదైన అనుభూతిని అందుకోవడానికి, అన్ని వైపుల నుంచి నిర్భయత నిర్ద్వంద్వం, నిశ్చింతలతో కూడిన వాళ్లంగా తయారు కావడానికి– ఆత్మతత్త్వంలో ప్రవేశంపొందడం. దానితో జీవించడం, దానియందే స్థిరంగా ఉండటానికి నిత్యమూ ప్రయత్నించడం అవసరం. ఆత్మయే తెలుసుకొనదగినది, ఆత్మయే ధ్యానించదగినది, ఆత్మయే నిరంతరం స్మరించదగినది.

*(సంపూర్ణం)*

★★★

**మబ్బు సూర్యుణ్ణి కప్పివేస్తుంది. అజ్ఞానం దేవుణ్ణి కప్పివేస్తుంది.**

ధారావాహిక : సమాజానికి వెన్నెముక వానప్రస్థం-9

# వానప్రస్థంలో జ్ఞాన, భక్తి, కర్మ యోగాలు

వానప్రస్థ జీవితంలోని నిత్యకర్మలో ప్రాతః కాలం స్వాధ్యాయ, తపశ్చర్యలకు కేటాయించాలి.

## స్వాధ్యాయం, సత్సంగం, మననం, చింతన

వాతావరణంలో అనైతికత అనే విషం పెచ్చుపెరిగిపోయింది. ప్రతిరోజూ దాన్ని సంస్కరించకపోతే, మనిషి పతనం చెందే అవకాశం పూర్తిగా ఉంది. పడవ నడిపే వ్యక్తి బలంగా తెడ్డు వేయకపోతే, పడవ ఆవలి ఒడ్డుకు చేరదు. పొరపాటు చేస్తే, పడవ ఎటో పోతుంది.

స్వాధ్యాయాన్ని తపస్సు అని అన్నారు. తపస్సులోని వేడి మాలిన్యాలను భస్మం చేస్తుంది. ఆత్మ చింతన, ఆత్మ సంస్కరణ, ఆత్మ నిర్మాణం, ఆత్మ వికాసములకు స్వాధ్యాయాన్ని మించిన సాధనం లేదు. స్వాధ్యాయంలో ఆధ్యాత్మ సత్యాలను సరైన రీతిలో వివరించే సద్ గ్రంథాలను అధ్యయనం చేయాలి.

పరివ్రాజకులుగా సేవాసాధనలో పర్యటిస్తూన్న వానప్రస్థులకు సరైన మార్గదర్శకులు లభించడం కష్టం, కనుక, వారికి స్వాధ్యాయమే సత్సంగం యొక్క అవసరాన్ని తీర్చవలసి ఉంటుంది. అధ్యయనంతో పాటు మననం, చింతన కూడ జరపాలి. చదివినదాన్ని గురించి లోతుగా ఆలోచించాలి. ఆయా ఉదాత్త ఆదర్శాలను నిత్యజీవితంలో ఆచరణలో పెట్టడానికి తగిన పద్ధతులను రూపొందించుకోవాలి. స్వాధ్యాయం, సత్సంగం, మననం, చింతన - ఈ నాలుగూ బ్రహ్మవిద్యను పొందడానికి ఆధారాలు.

## పంచదేవ సాధన

యోగాభ్యాసంలో గాయత్రీ మంత్రసాధన అత్యంత ఉత్తమం. ఆ మంత్రంలోని 24 అక్షరాలలో ఉన్నత స్థాయి శక్తి కేంద్రాలు ఇమిడి ఉన్నాయి. ఈ మంత్రం భావనలనూ, ఆలోచనలనూ అద్భుతంగా సంస్కరిస్తుంది. ఈ మంత్ర జపం, పరమ తేజస్వి అయిన సవితా దేవత ధ్యానం, కణ కణంలో జ్యోతికిరణాల అవతరణ యొక్క అనుభూతిలో జరిపితే - ఆత్మిక ప్రగతి చేకూరుతుంది.

దీని తర్వాతి మెట్టు పంచకోశముల సాధన. లయ యోగం, ప్రాణ యోగం, బిందు యోగం, నాద యోగం, ఋజు యోగములు ఆధారంగా క్రమంగా చక్ర భేదనం, కోశముల ఆవిష్కరణ సాధ్యపడతాయి. పంచముఖి వేదమాత యొక్క పంచదేవ సాధన ఇది. భవాని, గణపతి, బ్రహ్మ, విష్ణుమూర్తి, శివుడు పంచ దేవతలు. తత్వదృష్టిలో వారిని సర్వసమర్థత, ప్రజ్ఞా ప్రతిష్ఠ, సృజన, అభివర్ధన, వివర్తనల ప్రబల సామర్థ్యం కలిగిన ఆత్మబలంగా పరిగణించవచ్చు.

## గాయత్రీ సాధనమే పంచాగ్ని విద్య

గాయత్రియొక్క ఉన్నతస్థాయి సాధనయే ఉపనిషత్తులో యమధర్మరాజు నచికేతునికి చెప్పిన పంచాగ్ని విద్య. పంచ అగ్నులు ఊర్ధ్వ లోకములకు వ్యాపించి ఉన్న జ్యోతిర్మయములైన శక్తులు. ఇవే బ్రహ్మ తేజస్సులు. ఆత్మలో పరమాత్మ అవతరణను సాధించే తేజస్సులు.

## యోగ స్వాధ్యాయాలకు రెండు గంటలు

ప్రాతఃకాలం బ్రహ్మ ముహూర్తంలో లేచి క్రమబద్ధంగా గంటసేపు యోగసాధన చేస్తే మామూలుగా సరిపోతుంది. దినచర్యలో స్వాధ్యాయం కోసం మరో గంట కేటాయించాలి. ఇంద్రియ నిగ్రహం, మనసులోని తృష్ణల అదుపు, సంయమనం, నిరాడంబరత్వం, తితీక్షలతో కూడిన దినచర్యను నియమబద్ధంగా పాటిస్తే, దానిని తపశ్చర్య అని చెప్పవచ్చు. స్వభావ అభ్యాసములను తపశ్చర్య పరాయణ జీవనానికి ఉపకరించే విధంగా తీర్చిదిద్దుకోవడమే తపశ్చర్యలోని ముఖ్య ఉద్దేశ్యం. ఈ తపశ్చర్యలో తాను ఏయే పద్ధతులను అవలంబించాలో అనుభవజ్ఞుడైన మార్గదర్శకుని నుండి తెలుసుకోవడం మంచిది.

**గాయత్రి కల్పవృక్షం. దానిని ఆశ్రయించిన వ్యక్తికి ఎన్నడూ ఎలాంటి కొరతా ఉండదు.**

## సేవా సాధనయే కర్మయోగం

యోగాభ్యాస, స్వాధ్యాయాలకు రెండు గంటలు కేటాయించి, వానప్రస్థుడు మిగతా సమయాన్ని సేవాసాధనకు వినియోగించాలి.

విశ్వమానవుల భావనాత్మక స్థాయిని పెంచడం పూజ – ఆరాధనలో అంతర్భాగమే. ప్రపంచంలో ఉత్కృష్టతను అభివృద్ధి చేయడం కర్మయోగమే. యుగ ధర్మానికి అనుగుణమైన ఉత్తమోత్తమ తపశ్చర్య ఇదే. జపతపాదుల వల్ల వ్యక్తికి స్వంత ప్రయోజనం కలుగుతుంది. విశ్వకళ్యాణ కార్యంలో నిమగ్నుడైన బ్రహ్మపరాయణుడైన మహామానవుడు తాను చేసే ఈ పుణ్య సాధనను కూడ దళిత మానవత ఉద్ధరణ కోసం సమర్పిస్తాడు. సమాజ సేవకుడు జ్ఞాన సాధకుని కన్న, యోగి కన్న, తపస్వి కన్న, భగవద్ భక్తుని కన్న ఉన్నతుడు–ఔదార్యం దృష్ట్యా. తన కృషిని తనకోసం కాక, విశ్వకళ్యాణం కోసం అంకితంచేసే వ్యక్తియొక్క ఆంతరిక ఔన్నత్యం మరింత ప్రశంసనీయం అవుతుంది.

## మూడు యోగముల సమన్వయం

దేవగణాలలో బ్రహ్మ విష్ణు మహేశ్వరులవలె – యోగములలో జ్ఞాన యోగం, భక్తియోగం, కర్మయోగం ప్రధానములు. వానప్రస్థ సాధనలో ఈ మూడింటినీ సమన్వయించాలి.

బ్రహ్మ విద్యా పరాయణుడై స్వాధ్యాయం, సత్సంగం, మననం, చింతనల ద్వారా తన ఆలోచనా విధానాన్ని శిఖరాగ్రానికి కొనిపోవడం జ్ఞానయోగం.

గాయత్రీ శక్తి కేంద్రాలు ఆధారంగా చేసే యోగాభ్యాసం, తపశ్చర్యలు భక్తియోగం.

లోకకళ్యాణం కోసం సహృదయతతో, అయినా సాహసవంతులైన శూరవీరులవలె, ప్రాణాలు ఒడ్డి ఉద్యమించే కర్మనిష్ఠ అతిశ్రేష్ఠమైన కర్మయోగం. అలాంటి కర్మ నిష్ఠ కలిగిన వ్యక్తిని నిజమైన విరాగి అనీ, యోగి అనీ, తపస్వి అనీ, భక్తుడనీ, ఋషితుల్యుడనీ పిలువవచ్చు.

సేవా సాధనలో మనం ఆలోచనలను కదిపి కుదుపివేయడానికే, భ్రమలనూ నికృష్ట అభిరుచులనూ జన మానసంనుండి తొలగించడానికీ అగ్ర ప్రాధాన్యం ఇవ్వాలి.

## ఆలోచన వక్రిస్తే.....

ఆలోచనకు ఉత్కృష్టమైన దిశ అందకపోతే– పెరిగిన సంపద ఆపదగా పరిణమిస్తుంది. పెరిగిన శరీరబలం గూండా చర్యలకు, పెరిగిన సంపద వ్యసన – వ్యభిచారాలకు, పెరిగిన బుద్ధిబలం ఉపద్రవాలకు ప్రోద్బలం ఇస్తుంది. నేటి సమాజంలో ఈ వికృతులను మనం ప్రత్యక్షంగా చూస్తున్నాం. ఈ బలవంతులకన్న, ధనవంతులకన్న, విద్యావంతులుకన్న రోగులు, పేదలు, నిరక్షరాస్యులు సమాజానికి తక్కువ హానికారకులని అనిపిస్తుంది నేటి పరిస్థితిని చూస్తూ ఉంటే.

## కీర్తి కాంక్షనూ వదులుకోవాలి

ప్రజాసేవ పేరిట నేడు ప్రభుత్వ సంస్థలూ, స్వచ్ఛంద సంస్థలూ భౌతిక సుఖ సౌకర్యాలను పెంచడానికే అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఆలోచనల సంస్కరణ గురించి ఎవరూ పట్టించుకోవడంలేదు. ఈ స్థితిలో – వానప్రస్థులు ఆలోచనా సంస్కరణ, భావప్రక్షాళన, వివేక సంవర్ధనలకే అగ్ర ప్రాధాన్యం ఇవ్వాలి. ఈ సేవాసాధన భవనాలవలె ప్రత్యక్షంగా కనిపించేది కాదు. కనుక ఇందులో పేరు ప్రతిష్ఠలు లభించవు. విత్తేషణ (ధనవాంఛ)నూ, పుత్రేషణ (సంతానముపై మమకారం)నూ వదులుకున్న వానప్రస్థులు లోకేషణ (పేరు ప్రఖ్యాతులు) ను కూడా వదులుకోవాలి.

## శతసూత్ర యోజన అమలు

మతవేదిక ఆధారంగా జన మానస సంస్కరణకై కార్యాచరణ పద్ధతి యుగ నిర్మాణ శతసూత్ర యోజనలో ఉన్నది. ఆ యోజనను శ్రద్ధగా అధ్యయనం చేసి– స్థానిక పరిస్థితులకూ, కార్యకర్తల శక్తి సామర్థ్యాలకూ అనుగుణమైన కార్యక్రమాలను రూపొందించాలి. ఈ కార్యక్రమాల ద్వారా దుర్బుద్ధినీ, దుష్ట భావనలనూ, దుష్ట ప్రవృత్తులనూ నిర్మూలించాలి. గుడ్డి

**భగవంతుని ఆహ్వానాన్ని అందుకున్న వ్యక్తి ఎన్నడూ నష్టపోడు.**

నమ్మకాలపై, దురాచారాలపై పోరాటం సాగించాలి. ఇదే జ్ఞాన యజ్ఞం.

### మత రంగాన్ని క్షాళన చేసే కార్యక్రమాలు

శక్తివంతమైన మతరంగాన్ని ప్రతీప శక్తుల చేతులనుండి లాగికొని, దాన్ని ప్రగతిశీలుర చేతులకు అప్పగించడం వానప్రస్థునికి ముఖ్యమైన పని కావాలి. మత సంప్రదాయాలకు ప్రగతిశీలమైన రూపాన్ని ఇవ్వడానికై అనేక కార్యక్రమాలను చేపట్టవచ్చు. ఒక్కరోజు సత్యనారాయణ వ్రతం, రామాయణ సప్తాహం, గీతా సప్తాహం నిర్వహించడం ప్రయోజనకరం. పండుగలను సామూహికంగా నిర్వహింపజేయాలి. ఆయా పండుగల వెనుక ఉన్న ధర్మ సూత్రాలను ప్రజలకు బోధించాలి. కుటుంబ వ్యవస్థను పటిష్టం చేయడానికై పుంసవన, అన్నప్రాశన, నామకరణ, ముండన, ఉపనయన సంస్కారాలను నిర్వహించాలి. వివాహ సంస్కారం జరిపేటప్పుడు దాంపత్య జీవనం వెనుక ఉన్న సిద్ధాంతాన్ని వివరించాలి. ఫలితంగా - వధూవరులే కాక ఉత్సవంలో పాల్గొన్నవారు కూడ గృహస్థ ఆశ్రమ ప్రాముఖ్యాన్ని తెలుసుకొని, అందుకు అనుగుణంగా వ్యవహరించగలుగుతారు. జన్మదిన, వివాహ దిన మహోత్సవాలు ఎంతో ప్రేరణను ఇవ్వగలుగుతాయి. చిన్న పెద్ద యజ్ఞాల ద్వారా దుష్ట ప్రవృత్తులను వదులుకునే ప్రతిజ్ఞలు చేయించాలి. తద్వారా వ్యక్తి, సమాజాల పునర్నిర్మాణానికి పునాదులు నిర్మించాలి. ఈ కార్యక్రమాలలో వర్ణ విభేదానికీ, లింగ వివక్షణతకూ ఎక్కడా తావు ఉండదు. ఫలితంగా- మూఢాచారాలను నిర్మూలించే సాహసం ప్రజలలో మేలుకొంటుంది.

### ధార్మిక మేళాల నిర్వహణ

ధార్మిక మేళాలను ప్రారంభించాలి. వాటిద్వారా ప్రజలలో ఉత్సాహం రేకెత్తుతుంది. ప్రేరణ ఇచ్చే ఆ వాతావరణం ద్వారా అమ్మకందార్లూ, కొనుగోలుదార్లూ కూడ ప్రయోజనం పొందగలుగుతారు. ప్రతి సంవత్సరం నిర్ణీత తేదీలలో ఇలాంటి మేళాలను గాయత్రీ యజ్ఞంతో పాటు నిర్వహించాలి. ఇలాంటి మేళాలు అద్భుతమైన ప్రభావాన్ని కలిగించాయని గత అనుభవం చెపుతోంది.

★★★

### వీరుల పట్ల శ్రద్ధ

ప్రిన్స్ ఆఫ్ వేల్స్ ఎడ్వర్ట్ (ఎనిమిది) ఒక రోజున ప్రపంచ యుద్ధంలో గాయపడిన సైనికులను చూడటానికి వెళ్ళాడు. ఇంగ్లాండులోని ఒక ప్రయివేట్ ఆసుపత్రిలో 36 మంది గాయపడిన సైనికులు పడి ఉన్నారు. అధికారులు ప్రిన్స్‌ను ఆసుపత్రికి తీసుకునివెళ్ళారు. అంతా చూచిన తర్వాత ప్రిన్స్ ద్వారం దగ్గరకు వచ్చాడు. 'మీరు 36 మంది గాయపడ్డారని చెప్పారు నేను 29 మందిని మాత్రమే చూచాను' అని అన్నాడు.

మిగతావారు తీవ్రంగా గాయపడ్డారు. అందువల్లవారిని నీ ముందుకు తీసుకుని రాలేదు.

వారిని చూచి రావాలి- అని ప్రిన్స్ పట్టుపట్టాడు. వారిలో ప్రతి ఒకరి బెడ్ వద్దకు వెళ్ళి ఆప్యాయంగా పలుకరించి ఉత్సాహపరచాడు. అధికారులు తనను బయటకు తీసుకుని పోతుండగా ప్రిన్స్ మళ్ళీ అడిగాడు, 'ఏడవసైనికుడు ఎక్కడ? ఇక్కడ ఆరుగురే కదా ఉన్నారు!'

అధికారులు సందేహిస్తూ చెప్పారు, 'అతనిని చూసి ఏం చేయగలం. అతని పరిస్థితి ఇంకా ఎక్కువ ప్రమాదకరంగా ఉంది. ఆ దృశ్యం భయంకరమైనది. మీరు చూచి భరించలేరు.'

'నేను అతనిని తప్పక చూడాలి- ప్రిన్స్ చెప్పాడు. అధికారులు మరల తప్పించుకోవాలని చూచారు. వారిలా అన్నారు- అతడు చూడలేదు, తినలేదు. అతని వద్దకు వెళ్ళి ఏమిచేస్తారు?' కాని ప్రిన్సు పట్టు విడవలేదు. తప్పించుకోలేక వారు ఆయనను అక్కడికి తీసుకుని వెళ్ళారు. అక్కడ ఒక మాంసపు ముద్ద కనపడింది. తన జీవితాన్ని యుద్ధరంగంలో పణం పెట్టి పోరాడిన వీరుని దేహం అది. చీకటిగదిలో పడి ఉన్న ఆ శవాన్ని ప్రిన్స్ పరిశీలించి చూచాడు. ఎంతో ఆత్మీయతతో, శ్రద్ధాభావనతో ఆ వీరుని చేతిని ముద్దుపెట్టుకున్నాడు. ఎంత పవిత్రమైనది ఆ ముద్దు!

**శిష్టాచారం కొనకుండా అలవడుతుంది. దానిద్వారా అన్నింటినీ కొనవచ్చు.**

# ధారావాహిక : దివ్యజీవన దర్శనం-35


# ఆశీస్సులూ, వాగ్దానాలూ

### కుల దేవతయే గ్రామ దేవత

కన్నైయా ఇలా అన్నాడు - "గ్రామ ప్రజలు ఈ దేవతను గురించి పట్టించుకోవాలని మా కోరిక. వారు పూజలు చేయకపోవచ్చు. అరుగుకు మరమ్మత్తు చేయించాలి. సాధ్యమయితే ఓ చిన్న ఆసరా కూడా నిర్మించాలి."

శ్రీరామ్ అతనిని అడిగాడు - "ఆసరా అంటే ఏమిటి?"

అతడు ఇలా జవాబు చెప్పాడు- "ఆసరా అంటే చిన్న ఆలయం. మేము పేదవాళ్లం. మా దేవత కూడా పేదవాడే."



శ్రీరామ్ ఇలా అన్నారు - ''ఇలా ఆలోచించకు. ఇక్కడ దేవత యొక్క పాదాలు స్థాపితమై ఉన్నాయి. శక్తిపీఠాలు 51 ఉన్నాయి. మేము దీనిని గ్రామదేవత యొక్క చరణపీఠం అని పిలుస్తాం. ప్రజలంతా ఇక్కడికి రావాలి."

ఆ వెంటనే కార్యక్రమం రూపొందింది. మార్గశిర పౌర్ణమినాడు అఖండ పారాయణ జరపాలని నిర్ణయించారు. ఆ పారాయణకు ప్రజలందరినీ ఆహ్వానించాలనీ, వారి సహకారం పొందాలనీ ఆలోచించారు. ఆ అరుగుమీద చిన్న ఆలయం నిర్మించాలి. పనిలో పనిగా అరుగును మరమ్మత్తు చేయాలి. అంచనావేసి చూచారు. 80 రూపాయల బడ్జెట్ తయారయింది. 1930-32 లో ఈ మొత్తంలో చిన్న ఆలయం నిర్మాణం అయేది. ఇంటికి పావలా చందా వసూలు చేయాలనీ, దేవతకు అర్పించబడే కానుకలు దానికి కలిపితే చాలినంత సొమ్ము సమకూరుతుందనీ భావించారు. మరునాటి నుండి శ్రీరామ్ సేనకు చెందిన యువకులు సహకారాన్ని సమీకరించే పని ప్రారంభించారు. దళితుల అరుగుమీద వారి కులదేవతను ప్రతిష్ఠించడం కోసం పారాయణ జరుపుతారనే వార్త విని గ్రామ ప్రజలు ఆశ్చర్యపడ్డారు. ఆ పేటలో పూజలను ప్రోత్సహించడం మతానికి విరుద్ధమని గ్రామంలోని కొందరు పెద్దలు అభ్యంతరం చెప్పారు.

ఇలాంటి ప్రశ్నలూ, అనుమానాలూ వస్తాయని శ్రీరామ్ ముందుగానే ఊహించారు. యువసేన కార్యకర్తలకు వాటికి సమాధానాలను బోధించారు. శబరి, గుహుడు మున్నగు భక్తుల ఉదాహరణలు, కిరాతులు వానరుల ఉదాహరణలు వారికి తెలిపారు. 'భక్తి-సేవ జరపడానికి అందరికీ అధికారం ఉన్నది. పూజలు జరపడాన్ని ప్రోత్సహించడం అధర్మం కాదు ధర్మమే. శ్రీరామచంద్రుడు వానరులతో రామేశ్వరంలో పూజ చేయించలేదా? కృష్ణ పరమాత్మ గోవర్ధన పూజ ప్రారంభించాడు. అందుకోసమై గోపబాలురను ముందు నిలిపాడు - ఇలా యువకులు ప్రజలకు వివరించారు.

తర్కమూ, ప్రమాణమూ కాక- యువకుల వ్యక్తిత్వం కూడ ప్రభావం చూపింది. యువకులు క్లిష్ట సమయాలలో గ్రామ ప్రజలకు చేస్తూ వచ్చిన సేవను ప్రజలు గుర్తించారు. అంతే కాదు. ఆ నవ యువకులను తమ మంచాలపై కూర్చోబెట్టుకునేవారు. మామూలు రోజులలో కూడ ఈ యువకులు పాఠశాల కోసం, వ్యాయామశాల కోసం పని చేస్తూ వచ్చారు. పాఠశాలకు విద్యార్థులు హాజరు అవుతున్నారా లేదా; గ్రామంలోని ఏ పిల్లవాడూ చదువుకోకుండా లేడు కదా; పిల్లల చదువులు ఎలా ఉన్నాయి -మున్నగు విషయాలను ఆ యువకులు నిశితంగా పరిశీలించేవారు. ఎక్కడయినా ఏదయినా లోటు జరిగితే, వారు వెంటనే దాన్ని పూర్తి చేసేవారు. తమ శరీర ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకై వారు పిల్లలకు ప్రేరణ ఇచ్చేవారు.

మామూలు రోజులలో ఈ మెలకువతోపాటు -ప్రత్యేక సందర్భాలలో వారి తత్పరత కూడ గ్రామ ప్రజల హృదయాలను చూరగొన్నది. దళితుల పట్ల మనస్సులలో విషంలా వ్యాపించిన విద్వేషం వల్ల ప్రజల నోళ్లనుంచి కుతర్కాలు వెలువడేవి. కానీ, యువకుల మాటలు విన్న తర్వాత వారి బాణాల వాడి నశించిపోయింది. యువకులు ఏ ఇంటికి వెళ్లినా, కనీస విరాళం

**కర్మయొక్క సహకారం లేని జ్ఞానం నిరర్థకం.**

తీసుకుని తిరిగి వచ్చారు. కొన్ని ఇళ్లనుండి రూపాయి, రూపాయి పావలా విరాళాలు వచ్చాయి. లాల్ జడాల్ చంద్ దళితులను తిట్టిపోసేవాడు. అతడు అయిదు రూపాయలు ఇచ్చాడు. పారాయణకు సన్నాహాలు జోరుగా సాగాయి.

## పారాయణను ప్రారంభించిన తాఊజీ

మర్గశిర పౌర్ణమి వచ్చింది. తాఊజీ పారాయణకు ముఖ్య యజమానిగా, కర్తగా ఉండాలని చౌధరీ యువక బృందానికి సూచించాడు. పలువురు ఆ సూచనను బలపరచారు. ఆమె పూజకు కూర్చున్నారు. "వర్ణానామార్థ సంఘానాం" అంటూ పండిత దయాశంకర్ పారాయణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అయిదుగురు వ్యక్తులు ఆయనతోపాటు పారాయణ చేయడానికి ఎంపిక చేయబడ్డారు. మొదటి విడత పారాయణకు ఎంపిక అయినవారంతా పారాయణ చేయడం చేతకానివారు. కనుక - కొత్త ఏర్పాటు జరిగింది. ఆ అయిదుగురిలో ఇద్దరిని తొలగించారు. వారికి తర్వాత విడత పారాయణలో చోటు కల్పించారు. వారి స్థానంలో ఎంపిక అయిన ఇద్దరూ 5వ తరగతి, 7వ తరగతి చదివిన యువకులు. వారు తేలికగా రామచరిత మానస చదువగలరు. వారు పండిత దయాశంకర్‌తో పాటు చౌపాఈలు ( రామచరిత మానసలోని పద్యాలు) పాడారు. మిగతా ముగ్గురూ వారితో శృతి కలిపారు. ఇలా అక్షరాస్యులతో, నిరక్షరాస్యులతో కూడిన అయిదుగురు పారాయణ చేశారు. అలా 24 గంటల అఖండ పారాయణ పూర్తయింది. చదువురాని వారిని పారాయణకు కూర్చుండబెట్టడం అవసరమయింది. కనీస విద్యా పరిమితి నిర్ణయించబడితే, ఆ హరిజనవాడలోని వారు ఎవరూ పారాయణలో పాల్గొనలేరు. మరి, వారికి ప్రాతినిధ్యం ఇవ్వాలి. కనుక -అక్షరాస్యులనూ, నిరక్షరాస్యులనూ కలసి ప్రతిజట్టులో కూర్చుండబెట్టారు.

పాడ్యమినాడు గ్రామదేవత పూజ, సంక్షిప్త హవనం జరగడంతో- పారాయణ పూర్తయింది. గ్రామస్థులు ఇచ్చిన విరాళాలూ, దేవతవద్ద కానుకలుగా ఇవ్వబడిన మొత్తం కలిపి 105 రూపాయలు పోగయింది. పారాయణ, వాహనం, ప్రసాదం మున్నగు వాటికి ఖర్చు చేయగా, చరణపీఠం జీర్ణోద్ధరణకు కావలసినంత సొమ్ము మిగిలింది. ఆ మొత్తాన్ని శ్రీరామ్ చేతిలో పెట్టారు. ఆయన చౌధురీబాబును పిలిచి, ఆ నాణెముల సంచీని అతడి చేతిలో పెట్టారు. జీర్ణోద్ధరణకు మొదటి రాయిని చౌధురి చేతనే వేయించారు.

## "సైనిక్" పత్రికతోపాటు సమాజసేవ

ఆగ్రాలో 'సైనిక్' పత్రిక పరిస్థితి కొంత దెబ్బతిన్నది. 1932లో కార్యకర్తలు జైలునుండి విడుదల అయిన తర్వాత అది తిరిగి వెలువడసాగింది. అయితే, దానిలో పూర్వపు వాడినీ, వేడినీ నిలిపి ఉంచడం సాధ్యపడలేదు. తాఊజీ నిర్దేశం ప్రకారం- శ్రీరామ్ పర్యటించే యోగి యొక్క జీవన సరళిని అవలంబించారు. ఒకోసారి ఆగ్రా, ఒకోసారి ఆవల్‌ఖేడా, ఒకోసారి మథుర వెళ్లేవారు. గ్వాలియర్, మీరట్, హాథ్‌రస్ ల వరకు కూడ పర్యటించేవారు. ఆనాడు ఆగ్రాలో ఆర్యసమాజం ఒక్కసారిగా ఊపందుకున్నది.

పూనా పాక్ట్ యొక్క ప్రభావంవల్ల సమాజంలో దళితులపట్ల ఆత్మీయత, అనురాగం పెంపొందాయి. ఫలితంగా - కాంగ్రెసు కార్యకర్తలు దళిత బస్తీలకు నిస్సంకోచంగా వెళ్లిరావడం సాగించారు. వర్ణభేదాన్ని అంగీకరించకపోవడంతో, కులాలు ఆధారంగా హెచ్చు తగ్గులను ప్రతిఘటించడంలో ఆర్యసమాజం మొదటినుండీ పేరు ప్రతిష్ఠలు సంపాదించింది, పూనా పాక్ట్ కారణంగా, గాంధీజీ ఒత్తిడి కారణంగా ఇతర సామాజిక-రాజకీయ ఒత్తిడి కారణంగా - దళితులు హిందూ సమాజంనుండి విడిపోవడం చివరి క్షణంలో ఆగిపోయింది. ఆర్యసమాజం ప్రచారకులు ఈ పరిణామాన్ని తమ పద్ధతిలో ప్రజలకు వివరిస్తున్నారు. పూనా పాక్ట్ గురించీ, దాని ప్రభావాలను గురించీ శ్రీరామ్‌కు పూర్తిగా తెలుసు. అయినా - సామాజిక కార్యంలో ప్రజల మాటలను శ్రద్ధగా వినేవారు. వారి మాటలకు అంత పట్టు ఉండదు. అయినా, శ్రీరామ్ వారి భావాలకు ఉపేక్షించరు.

ఉత్సాహవంతుడైన ఆర్య సమాజం ప్రచారకుడు ఆనందప్రకాశ్ ఆవల్‌ఖేడాలో ఆయనవద్దకు వచ్చాడు. శ్రీరామ్ 20-21 సంవత్సరాల ఉత్సాహవంతుడైన యువకుడని మాత్రమే ఆయనకు తెలుసు. ఆయన నిర్ణయించుకున్నదాన్ని చేస్తారనీ, చేసి తీరుతారనీ కూడ తెలుసు. ఆయన శ్రీరామ్‌తో ఇలా అన్నాడు-

"సంఘ సంస్కరణపట్ల మీకు హెచ్చు అభిరుచి ఉన్నదని విన్నాను."

**దృఢ నిశ్చయంతోనే సఫలం అవుతుంది సదాశయం.**

అందుకు శ్రీరామ్ ఇలా చెప్పారు–

"సమాజ సంస్కరణలో కాదు, సమాజ సేవలో."

సంభాషణను కొనసాగిస్తూ ఆనందప్రకాశ్ ఇలా అడిగాడు–

"ఇంతవరకు మీరు ఏయే పనులు చేశారు?"

శ్రీరామ్ వినమ్రంగా ఇలా అన్నారు–

"ఉపదేశక మహాశయా! మేము ఏమీ చేయలేదు. భగవంతుడు ఏది చేయించదలచుకున్నాడో దానిని చేయించాడు. మేము ప్రత్యేకంగా దానిని నమోదుచేసి ఉండలేదు."

శ్రీరామ్ విషయాన్ని దాటవేస్తున్నారని ఆ ఆర్యసమాజ ప్రచారకునికి అనిపించింది. అయినా, శ్రీరామ్ యొక్క స్వరంలో శిష్టాచారం, నిశ్చల భావం స్పష్టంగా ప్రతిబింబించాయి. అలాంటి జవాబు తనకు ప్రోత్సాహకరం అని ఆయన భావించాడు. ఆయన ఇలా అన్నాడు–

"దళితులకూ, గ్రామ ప్రజలకూ మధ్య సామరస్యాన్ని స్థాపించడానికై మీరు వారి కుల దేవతను గ్రామదేవతగా ప్రతిష్ఠింపజేశారు. మంచిదే. కానీ, దానివల్ల అవిద్య వ్యాపించదా?"

"అవిద్య ఎలా వ్యాపిస్తుంది?"

–అని శ్రీరామ్ జిజ్ఞాసను వ్యక్తపరచారు.

ప్రచారకుడు దానికి సమాధానం చెప్పడానికి ఇలా ప్రయత్నించాడు–

"వేద శాస్త్రాల ప్రకారం పరమేశ్వరుడు ఒక్కడే. అతడు నిర్గుణుడు, నిరాకారుడు. అతడికి వివిధ రూపములు ఉండజాలవు. మనం రకరకాల దేవతలను ప్రతిష్ఠిస్తూ పోతే – ఆ పని పరమేశ్వరునిపట్ల శ్రద్ధ జనించడంలో ఆటంకం కలిగిస్తుంది."

శ్రీరామ్ అందుకు ఇలా సమాధానం చెప్పారు–

"ఆనందజీ! మేము వేదాలను లోతుగా అధ్యయనం చేయలేదు. అయినా– విద్వాంసుల ద్వారా విన్నాము. వారు వ్రాసిన గ్రంథాలను అధ్యయనం చేశాము. వేదాలలో పెక్కు దేవతల స్తోత్రాలు ఉన్నాయని అందువల్ల మాకు తెలిసింది. కనీసం 50 మంది దేవతల పేర్లను మేము కూడ చూచి ఉన్నాము. అంతే కాదు. రాముడూ, కృష్ణుడూ, బుద్ధుడూ మున్నగువారు పరమేశ్వరుని అవతారాలే కదా. ప్రజలు వారినికూడ పరమేశ్వరునిగా పరిగణించి పూజిస్తారు."

ప్రచారకుడు ఇలా జవాబు చెప్పాడు–

"ఇది అవిద్యవల్ల జరుగుతోంది. చూడు. క్రైస్తవులు ఒకే దేవుణ్ణి నమ్మారు. ఆ క్రైస్తవులు ప్రపంచమంతటా ఆధిపత్యం వహిస్తున్నారు. ముస్లింలు ఒకే దేవుణ్ణి నమ్మారు. వారు కూడా ప్రపంచంలో ఢంకా బజాయిస్తున్నారు. మనం పెక్కు దేవతలను పూజిస్తున్నాం. కనుక దారి తప్పుతున్నాం. ఎవరినీ ఎదుర్కొనలేకపోతున్నాం."

ఈ వాదానికి సమాధానం శ్రీరామ్ వద్ద ఉంది. కానీ, వాదాన్ని పెంచడం ఆయనకు ఇష్టం లేదు. ఆయన ఇలా అన్నారు–

"సిద్ధాంత చర్చలో మునిగిపోవడం మా పని కాదు. మేము పనిచేసే వాళ్లం. చెప్పండి. మనం కలసిమెలసి సమాజ కార్యాన్ని ఎలా ముందుకు తీసుకువెళ్లాలి?"

## సంస్కరణవాది ప్రతిపాదన

ఆనందప్రకాశ్ ఆవేశం చల్లబడింది. ఆయన ఇలా అన్నాడు–

"మీరు చరణపీఠాన్ని నిర్మించారనే వార్త విని నేను ఇక్కడికి వచ్చాను. ఇది మంచిదయినా చెడ్డదయినా – దానివల్ల దళిత వాడకు ప్రజల రాకపోకలు పెరిగాయి. వంచితులైన మన సోదరులను మనవాళ్లుగా చేసుకునే దిశలో ఇది ఒక అడుగు. అందరినీ అక్కున చేర్చుకోవాలని స్వామి దయానందులు ప్రబోధించారు. ఇప్పుడు నేను మీకొక సూచన చేయడానికి వచ్చాను."

శ్రీరామ్ రెప్పవాల్చకుండా ఆయనవైపు చూస్తూ ఉండిపోయారు. ఏమీ చెప్పలేదు. ఆయన మౌనంలోనే తర్వాతి విషయం వినాలనే ఉత్సుకత తొణికిసలాడింది.

ఆనందప్రకాశ్ ఇలా అన్నాడు–

"గ్రామంలోని దళితవాడలోని ప్రజల ఉపాధికి సముచితమైన ఏర్పాటు లేదని మీకు తెలియదా?"

శ్రీరామ్ ఇలా అన్నారు–

"మీ మనస్సులో ఏదైనా పథకం ఉన్నదా?"

**ఆలోచనలు ఎలా ఉంటే జీవితం అలా రూపొందుతుంది.**

ఆనందప్రకాశ్ ఇలా అన్నాడు –

"పథకాన్ని మీరు రూపొందించండి. సాధన సంపత్తిని సమీకరించడంలో నేను సహకరిస్తాను."

పథకం గురించి చర్చలు జరపడం కోసం సాయంత్రం వరకు ఆ సంభాషణను వాయిదా వేశారు. కొంత ఆలోచించడానికి ఆ వ్యవధి సరిపోతుంది. సాయంత్రం ఆనందప్రకాశ్‌తో సమావేశం జరిగింది. అంతవరకు జరిగిన చర్చల సారాంశాన్ని ఆయన ముందుంచారు. ఒక చేనేత పరిశ్రమను స్థాపించాలన్నది ఆయన అభిప్రాయం. ఇందువల్ల 9–10 మందికి పని దొరుకుతుందని ఆయన వివరించారు.

గాంధీజీ యొక్క ఖద్దరు ఉద్యమం అప్పుడు అంతగా వ్యాప్తిచెందలేదు. శ్రీరామ్ స్వయంగా ఖాదీ వస్త్రాలు ధరించేవారు. ఆయన చుట్టుప్రక్కల నివసించేవారు కూడా ఖద్దరు ధరిస్తారు. అయితే – గ్రామ స్వరాజ్యం, గ్రామాల స్వయంపోషకత్వం, స్వదేశీ, కుటీర పరిశ్రమల వంటి కార్యక్రమాలు ఉద్యమ స్థాయికి ఎదగలేదు.

గ్రామంలో చేనేత పరిశ్రమ స్థాపించడానికి రేడు వందల రూపాయలు అవసరం అవుతాయి. ఆర్యసమాజం నుండి అందులో సగం పైకం ఏర్పాటుచేస్తానని ఆనందప్రకాశ్ మాట ఇచ్చాడు. పూర్తి మొత్తం ఏర్పాటుచేయడానికి ప్రయత్నిస్తాననీ, అయినా శ్రీరామ్, ఇతరులు తమవంతుగా కొంత ప్రయత్నం చేయాలనీ ఆయన సూచించాడు.

★★★

## భక్త శిఖామణి రామానుజాచార్యుడు

ఒకసారి కాంచీపూర్ణులు కేశవాచార్యుల ఇంటికి వెళ్ళారు. రామానుజాచార్యులు శ్రీ కేశవాచార్యుల కుమారుడు. తండ్రి రామానుజాచార్యులతో ఇలా అన్నాడు – 'కుమారా, శ్రీ కాంచీ పూర్ణులు సాక్షాత్తుగా వరద రాజస్వామియే. వారిని సేవించి తరించు'. శ్రీ కాశీపూర్ణులు శయనించేముందు గదిలోకి శ్రీరామానుజాచార్యులు వెళ్ళారు. ఆసనం వద్దకు వెళ్ళి ఆ మహాభక్తుని పాదాలను తన ఒడిలో తీసుకున్నాడు. శ్రీకాంచీపూర్ణులు ఉలిక్కిపడిలేచారు. 'ఇదేమి పని నాయనా, నీవు బ్రాహ్మణుడవు', 'నేను శూద్రుడను', రామానుజుడు చెప్పాడు – 'హే భక్తశిరోమణి, కులానికీ, భక్తికీ సంబంధంలేదు. ఎవరయినా తన కర్మకారణంగా మహాత్ముడవుతాడు. జన్మచేత కాదు. మీరు మహాపురుషులు. మీ సేవ చేయడం నా మహాభాగ్యం', శ్రీకాంచీపూర్ణులు పరవశులై పోయినారు. 'ప్రభూ, నీ ఇచ్ఛ' అని చెప్ప శయనించారు. రామానుజుడు శ్రద్ధాభక్తులతో వారి పాదాలను ఒత్తుతూ కూర్చున్నాడు. ఉదయమే లేచి శ్రీకాంచీపూర్ణుడు రామానుజులకు 'ఓం నమో నారాయణాయ' అని అష్టాక్షరీ మంత్రాన్ని ఉపదేశించారు. ఈ మంత్రాన్ని ఇతరులెవ్వరికీ ఉపదేశించరాదని శ్రీరామానుజుల చేత ప్రమాణం చేయించుకున్నారు. కొంత కాలం తర్వాత రామానుజుల హృదయంలో ఒక పవిత్రమైన కోరిక చిగురించింది. అందరికీ శ్రేయస్సును చేకూర్చాలి అనే భావన కలిగింది. దేవాలయ శిఖరంపైకి ఎక్కి రామానుజుడు ఆ మంత్రాన్ని పెద్దగా ఉచ్ఛరించడం మొదలుపెట్టాడు. చూస్తుండగానే అన్ని వర్గాల ప్రజలు అక్కడ గుమిగూడారు. అందరూ కలిసి, 'ఓం నమో నారాయణాయ', మంత్రాన్ని ఉచ్ఛరించారు. అనుకోకుండా కాంచీపూర్ణులు కూడా అక్కడికి వచ్చారు. 'రామానుజా, ఇది ఏమిటి? నీ ప్రతిజ్ఞను భంగం చేశావు. ఇది అపరాధం. నీవు నరకానికి వెళ్తావు. దుఃఖం అనుభవిస్తావు' అని అన్నారు. రామానుజుడు తొణకలేదు. ప్రశాంత భావంతో చెప్పాడు – 'మహాత్మా, ఈ మంత్రాన్ని సామూహికంగా ఉచ్ఛరించడంవల్ల అసంఖ్యాకులైన జీవులు భగవద్భక్తులయినారు. భవసాగరాన్ని దాటారు. అందుకునేను కోట్లాది నరకాలలో కష్టాలు అనుభవించేందుకు సిద్ధంగా ఉన్నాను.

కాంచీపూర్ణులు మౌనంగా ఉండిపోయారు. ఆయన నేత్రాలు ప్రకాశించాయి. ఆయన నోటి నుండి ఈ మాటలు వినపడ్డాయి, వత్సా, నీకు మేలు జరుగుతుంది. నీకు నా ఆశీస్సులున్నాయి.

**దుఃఖంలో కలతచెందడం మానవీయం. దుఃఖాన్ని దూరంచేయడం దేవతాతుల్యం.**

## వార్తలు

# శక్తిపీఠాల రజత జయంతి సందర్భంగా వాడవాడలా
# గాయత్రీ యజ్ఞాలు, దీపయజ్ఞాలు

శక్తిపీఠాల రజత జయంతి సందర్భంగా వాడవాడలా 5కుండముల, 9కుండముల, 24కుండముల గాయత్రీ యజ్ఞాలూ, దీపయజ్ఞాలూ జరిగాయి. శ్రీ అశ్విని సుబ్బారావు, శ్రీహీర్‌సింగ్ రాజపురోహిత్‌లు కార్యక్రమాలను యోజన చేశారు. అక్టోబరు 22నుండి నవంబరు 6వరకు ఈ యజ్ఞాలు నిర్వహించబడ్డాయి.

మొదటిదశలో హైదరాబాదులోని ఎస్.ఆర్.నగర్, సంతోష్‌నగర్‌లలో యజ్ఞాలు జరిగాయి. నల్గొండ జిల్లాలోని వలిగొండ గ్రామంలో 24 కుండముల గాయత్రీ యజ్ఞం జరిగింది. యజ్ఞంలో పాల్గొన్న 400మంది గురుదీక్ష తీసుకోవడం ఒక ప్రత్యేకత. ఈ కార్యక్రమాల సందర్భంగా వేలాదిమంది సాధన, స్వాధ్యాయం, సేవలు జరపాలని సంకల్పం తీసుకున్నారు. ఇంటింటా దేవస్థాపనలు జరిగాయి.

రెండవ దశలో హైదరాబాద్‌లోని తార్నాక, కె.పిహెచ్.బి. కాలనీ, కొత్తపేట, ధర్మారెడ్డి కాలనీ, మూసాపేట, బోయినపల్లి, తాళ్లగడ్డ, మల్కాపురం, రామచంద్రాపురం, దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలలో యజ్ఞాలు, వివిధ సంస్కారాలు జరిగాయి.

కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లాలోని హందీఖేడా గ్రామంలో నవంబరు 5న జరిగిన 27కుండముల గాయత్రీ యజ్ఞంతో కార్యక్రమాలకు పూర్ణాహుతి జరిగింది. యజ్ఞంలో మూడువేలమంది పాల్గొన్నారు. అందరూ గాయత్రీ మంత్రదీక్ష తీసుకున్నారు. గ్రామంలో ఇంటింటా దేవస్థాపన జరిగింది. 20మంది యువకులు దేవదక్షిణగా మద్యపాన వ్యసనాన్ని వదిలారు.

శ్రీయుతులు శశీంద్ర నాథ్ తివారీ, వినోద్ మరాపే, అజయ్ దివాన్, కుంభదేవ్ నాగ్, అప్పారావు సాఠే, కె.వి.వి.పంతులు, వెంకటనారాయణ, శివానంద్, ప్యారేలాల్ పరివ్రాజక్, శ్రీమతి అనసూయమ్మ బృందాలుగా ఏర్పడి పై కార్యక్రమాలను నిర్వహించారు. హందీఖేడా గ్రామంలో యజ్ఞనిర్వహణలో శ్రీయుతులు బాబూలాల్ సాఠే, నాగేందర్ సాఠే, కిషన్‌సింగ్, జాదవ్, శ్యామరావ్ మలారీ విశేషంగా సహకరించారు.

### హైదరాబాదు మెహదీపట్నంలో 200 మందికి గురుదీక్ష సంస్కారం

హైదరాబాదులోని మెహదీపట్నం శారదానగర్‌లో ఉన్న ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలోని గాయత్రీ ధ్యానమందిరంలో నవంబరు 5 ఉదయం కార్తీక పూర్ణిమ సందర్భంగా శ్రీసాయి గాయత్రీ సేవాసమితి ఆధ్వర్యంలో బి.వి.సుబ్బారావు బృందం నవకుండీయ గాయత్రీ యజ్ఞం నిర్వహించారు. శ్రీమతి అనసూయమ్మ యజ్ఞాన్ని జరిపించి, సామూహిక గురుదీక్ష సంస్కారాన్ని ఇచ్చారు. శ్రీమతి ధనలక్ష్మి, శ్రీ జుగల్ కిశోర్ దాస్ కార్యక్రమానికి సహకరించారు. యజ్ఞంలో పాల్గొన్న 200మందీ గాయత్రీ మంత్ర దీక్షను స్వీకరించడం విశేషం.

### గాయత్రీ చేతనా కేంద్రంలో గురుదీక్షా సంస్కారం

హైదరాబాదులోని గాయత్రీ చేతనా కేంద్రంలో నవంబరు 2న సిరిసిల్లకు చెందిన పదిమంది యువకులు గురుదీక్ష తీసుకున్నారు.

హైదరాబాదులోని బాలాజీ రాజస్థాన్ భవన్‌లో అక్టోబరు 22న శ్రీ సురేంద్రసింగ్ రాజపురోహిత్ కుమారుని నామకరణ సంస్కారం, కుమార్తె విద్యారంభ సంస్కారం జరిగాయి.

### విజయవాడ విద్యాధరపురంలో త్రికుండీయ గాయత్రీ యజ్ఞం

విజయవాడలోని విద్యాధరపురంలో అక్టోబరు 29న త్రికుండీయ గాయత్రీ యజ్ఞం జరిగింది. కొత్తూరి పూర్ణచంద్రరావు దంపతులు, మునగంటి నాగేశ్వరరావు దంపతులు, కొప్పూరి వెంకటేశ్వర రావు దంపతులతోసహా 12గురు దంపతులు యజ్ఞంలో పాల్గొన్నారు. శ్రీ కుమార్, శ్రీమతి లక్ష్మి, శ్రీ మురళి యజ్ఞాన్ని నిర్వహించారు.

### ఇల్లందులో బడిపిల్లలకు ఉచిత ఆయుర్వేదవైద్య శిబిరం

ఆయుష్ ఆంధ్రప్రదేశ్ శాఖ, గాయత్రీ పరివార్ యుగనిర్మాణ్ మిషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో, రతన్ మెడికల్ హాల్ సౌజన్యంతో ఇల్లందు గాయత్రీ పరివార్ కార్యాలయంలో అక్టోబరు 13న బడిపిల్లలకు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించబడింది. శ్రీరతన్‌లాల్ ఖండేల్‌వాల్, మునిసిపల్ ఛైర్‌పర్సన్ శ్రీ మోల బాబు శిబిరాన్ని ప్రారంభించి, ఆరోగ్య పరిరక్షణ ఉద్యమ కరపత్రాన్ని విడుదల చేశారు. ఆయుష్ జిల్లా కో ఆర్డినేటర్ డా॥నాగేశ్వరరావు ముఖ్య అతిధిగా ప్రసంగించారు. శ్రీసతీష్ ఖండేల్‌వాల్ ప్రసంగించారు. శిబిరంలో రెండువేలమంది బాలబాలికలను పరీక్షించి, వారికి ఆయుర్వేద ఔషధాలను ఉచితంగా ఇచ్చారు. ప్రభుత్వ వైద్యాధికారులు శ్రీయుతులు జె.హరికిషన్ నాయక్, అబ్రహం, సామ్యూల్, పి.రామాచార్యులు, డి.వి.సత్యదేవ్, శ్రీయుతులు సుగుణలు, ఉమా, మాధవి వైద్య పరీక్షలు జరిపారు. ఆర్.జె.డి. శ్రీ బాపూరావు, శ్రీయుతులు సుబ్రహ్మణ్యం, మహేష్, టి.నాగభూషణరావు, ఎస్.వి.పరబ్, సన్నిధానం సత్యనారాయణ, కొండయ్య, శ్రీమతి సరోజ, కృష్ణకుమారి, అనితా ఖండేల్‌వాల్, శ్రీదేవి, చిన్న సరోజ కార్యక్రమంలో పాల్గొన్నారు.

★★★

**నమ్రతతో కూడిన ప్రసన్నత గొప్పతనానికి గుర్తు.**

# సద్గురు లీలామృతం

## ప్రజాదరణకు పుట్టిల్లు ఆత్మీయత

ఆత్మీయత ఎక్కడ ఎంత హెచ్చుగా విస్తరిస్తే, ప్రజాదరణ అక్కడ అంతగా హెచ్చుగా పొంగిపొరలుతుంది. గురుదేవులు చెప్పిన మాట ఇది.

అహ్మదాబాదు శక్తిపీఠం ప్రారంభోత్సవం సందర్భంలో ఈ మాట అక్షరాలా నిజమయింది.

ఉత్సవానికి ప్రజలు తండోపతండాలుగా వచ్చారు. ప్రముఖులు ఎందరెందరో వచ్చారు. గుజరాత్ ప్రభుత్వంలోని మంత్రులు ముగ్గురు వచ్చారు.

గురుదేవులు తమ ప్రవచనంలో నవ్వుతూ ఇలా అన్నారు–

"నావద్ద చాలా డబ్బు ఉంది. ఎక్కడ? అది నేను చెప్పను. చెపితే ఇన్‌కమ్ టాక్స్ వాళ్లు దాడిచేయరా?"

కొంచెం ఆగి వారిలా అన్నారు–

"నా డబ్బు మీ అందరి జేబుల్లో ఉంది. ఎప్పుడు కావాలంటే అపుడు తీసుకుంటాను."

ప్రవచనం పూర్తయిన తర్వాత ఒక మంత్రిగారు నవ్వుతూ ఇలా అన్నారు.

"ఆచార్యజీ! నేడు ఒక విషయం అర్థమయింది. అదేమిటో చెప్పమంటే చెపుతాను."

"చెప్పండి".

అని గురుదేవులు నవ్వుతూ అన్నారు.

మంత్రిగారు ఇలా అన్నారు–

"దేశ ప్రజల పరిపాలన కేంద్రం ఢిల్లీయే కావచ్చు. కాని ప్రజల మనస్సులకు కేంద్రం మీరు."


నవ్వుతూ చెప్పిన ఈ మాట గురుదేవుల జీవితకాలంలోనే నిజమవుతూ వచ్చింది. నేడూ, భవిష్యత్తులోనూ మరింతగా నిజమవుతూ వస్తుంది.

గురుదేవుల ఆత్మీయతనుండి జనించిన ప్రజాదరణ యొక్క పరిపక్వ స్థితి ఇది.

## నిరంతర స్వాధ్యాయం

స్వాధ్యాయాన్ని అశ్రద్ధ చేసే వ్యక్తి ఎన్నడూ గొప్ప మేధావి కాలేడు.

యుగసాహిత్యం అనే సంజీవని ద్వారా జీవించే కళనుండి ఆత్మిక ప్రగతియొక్క శిఖరాగ్రాల వరకు ఎన్నెన్నో మహత్తర విషయాలను బోధించిన ఆచార్యశ్రీ బాల్యంనుండి అధ్యయనశీలి. పాఠశాల విద్యయే లక్ష్యం అయితే, వారు అయిదవ తరగతి తర్వాత కూడ తమ చదువును కొనసాగించేవారు. అయితే, ఆ తర్వాత ఆయన చేసిన పని అందువల్ల జరిగేది కాదు.



వారు హిందీ, ఉర్దూ, సంస్కృత భాషలలో తమ ప్రాథమిక జ్ఞానాన్ని ఆధారం చేసుకుని అధ్యయనం ప్రారంభించారు. ఆగ్రాలోని హోలిట్‌పార్క్ లైబ్రరీ, మథురలోని సుఖ సంచారక పుస్తకాలయ, హథరస్‌లోని రెండు ప్రసిద్ధ లైబ్రరీలు, పాట్నాలోని ఖుదాబక్ష్ లైబ్రరీ, జయపూర్‌లోని మధుసూదన్ జార్ఝూజీ విశ్వవిద్యాలయాల పెరాసైకాలజీ విభాగం గ్రంథాలయం, వారణాసిలోని ఏనీబీసెంట్ లైబ్రరీ, కలకత్తాలోని గ్రంథాలు అన్నింటినీ చదివారు. ఉజ్జయినిలోని "కల్పవృక్ష" పత్రిక సంపాదకులు శ్రీ దుర్గాశంకర్ నాగర్ వారి ఆప్తమిత్రులలో ఒకరు. నాగర్‌జీ స్వంత లైబ్రరీ చాలా పెద్దది.

ప్రతిరోజూ గంటకు 25–30 పేజీలు చదవడం గురుదేవులకు ప్రియమైన పని. అఖండ జ్యోతి పత్రికలో కాని, పుస్తకాలలో కాని వ్రాయవలసిన విషయాలనే వారు చదివేవారు.

ఈ జ్ఞానం ఆధారంగానే గురుదేవులు 30 సంవత్సరాల వయస్సులో "నేను" ఏమిటి?" అనే గ్రంథం రచించారు. ఆతర్వాత సుమారు 3500 గ్రంథాలను రచించారు.

★★★

**చెడ్డవాణ్ణి ద్వేషించకు. చెడుకు సహాయనిరాకరణ చెయ్యి.**

# నేత్ర రక్షణకు చాక్షుషీ విద్యా ప్రయోగం

ఉపనిషత్తులు చాక్షుషీ విద్యకు మహత్తరమైన స్థానం ఇచ్చాయి. ఈ మంత్ర పఠనం ద్వారా అనేక దేశాలలో ప్రజలు కంటి జబ్బుల నుండి విముక్తి పొందారు. మన రాష్ట్రంలో హైద్రాబాదు గాయత్రీ చేతనా కేంద్రంలోని శ్రీమతి బి.అనసూయమ్మ ఈ మంత్రంద్వారా కంటి ఆరోగ్యాన్ని పూర్తిగా పొందారు.

సూర్యోదయం నుండి ఒక గంటకాలం ఈసాధన చేయవచ్చు. తూర్పువైపు సూర్యునికెదురుగా కూర్చొని – పవిత్రీకరణం, ఆచమనం, శిఖావందనం, ప్రాణాయామం, న్యాసం, చందన ధారణం చేసి, గాయత్రీ మహామంత్రం 24 సార్లు జపించిన తర్వాత ఈ క్రింది మంత్రంతో ఒక చెంచా నీరు భూమి మీద సమర్పించాలి.

**త స్యా శ్చాక్షుషీ విద్యాయా అహిర్బుధ్య ఋషి గాయత్రీ**

**ఛందః సూర్యోదేవతా చక్షూరోగ నివృత్తయే జపే వినియోగః**

తర్వాత ఈక్రింది మంత్రాన్ని 12 సార్లు జపించాలి.

**ఓం చక్షుః చక్షుః తేజః స్థిరోభవ । మాం పాహి పాహి ।**

**త్వరితం చక్షూరోగాన్ శమయ శమయ । మమ జాతరూపం తేజో**

**దర్శయ దర్శయ । యథాహం అంధోన స్యాం తథాకల్పయ కల్పయ**

**కల్యాణం కురు కురు । యాని మమ పూర్వజన్మోపార్జితాని చక్షుః**

**ప్రతిరోధకదుష్కృతాని సర్వాణి నిర్మూలయ నిర్మూలయ । ఓం నమః చక్షుస్తేజో**

**దాత్రే దివ్యాయ భాస్కరాయ । ఓం కరుణాకరాయామృతాయ ।**

**ఓం నమః సూర్యాయ । ఓం నమో భగవతే సూర్యాయాక్షితేజసే నమః ।**

**ఖేచరాయ నమః । మహతే నమః । రజసే నమః । తమసే నమః ।**

**అసతోమా సద్గమయ । తమసోమా జ్యోతిర్గమయ । మృత్యోర్మా అమృతం గమయ ॥**

ఇలా పఠించిన తర్వాత పంచపాత్రలోని జలాన్ని సూర్యభగవానునకు అర్ఘ్యరూపంలో సమర్పించి మిగిలిన రెండు చుక్కల జలాన్ని రెండు చేతివ్రేళ్ళకు రాసుకొని కళ్ళు తుడుచుకోవాలి.

ఇలా నెలరోజులు చేసిన తర్వాత కళ్ళు పరీక్ష చేయించుకొని, 3 నెలలదాకా వరుసగా చేయండి. మీ అనుభవాలను యుగశక్తి గాయత్రీ కేంద్రం, హైదరాబాదుకు తెలియజేయండి.

★★★

**YUGASHAKTI GAYATRI (Telugu Monthly), December - 2006**
**RNI No. APTEL / 2000/1656. Postal Reg. No. L-II/RNP/H-HD-953/2006-08**

# వలిగొండలో 24 కుండీయ గాయత్రీ యజ్ఞం




యజ్ఞ వేదికపై శ్రీయుతులు యాదవ్ గురూజీ, హీర్‌సింగ్ రాజపురోహిత్, అజయ్ దివాన్, శ్రీమతి అనసూయమ్మ, శ్రీయుతులు వినోద్, ప్యారేలాల్.



యజ్ఞ దృశ్యం.

# ఇల్లందులో ఉచిత ఆయుర్వేదవైద్య శిబిరం



శిబిరంలో వేదికపై డా॥వి.నాగేశ్వర రావు, శ్రీ సతీష్ ఖండేల్‌వాల్, శ్రీమతులు అనితా ఖండేల్‌వాల్, కృష్ణ కుమారి, క్యాతం సరోజిని.



శిబిరంలో వేదికపై డా॥బి.మురహరి బాబు, డా॥ జె.హరికిషన్ నాయక్, డా॥ బాపూరావు, శ్రీ సతీష్ ఖండేల్‌వాల్, డా॥వి.నాగేశ్వర రావు.

Global Head Quarters :
**GAYATRI TEERTH, SHANTIKUNJ,**
Haridwar - 249411 Ph: (01334) 260602, 261955, 260309
Fax : (01334) 260866, E-mail : shantikunj@awgp.org,
southindiazone@awgp.org, website : www.awgp.org

Chief Editor : **Dr. PRANAV PANDYA**
Printed & Published By Sri B.CH.V.SUBBA RAO (Aswini)
(For SRI VEDAMATHA GAYATRI TRUST)
5-283, H.P.Road, Moosapet, Hyderabad-500 018.
Printeda at Bharathi Art Printers, Chikkadapally, Hyderabad - 20

If Undelivered please return to: **GAYATRI CHETANA KENDRA & MEDITATION CENTER,**
Near Aswini House, H.P.Road, Moosapet, Hyderabad - 500 018, Ph : 040 - 23700722, 32986922, 09392506888.
E-mail : hyderabad.ap.in@awgp.org, info@aswini.com

SUNDAR GRAPHICS : 9391030025